సాహితీ
గత వారంతో మీ పుస్తకాల వెలుగులు

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

ఒంగోలు

: fb.com/vaartha Digital

Published from Ongole, Guntur, Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-9-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 240 పేజీలు: 12 వెల: 6.50

ఢాకాలో 80 వేల ముస్లిం ఓట్లు తొలగింపు

మెలోనీ ఆత్మకథకు ప్రధాని మోడీ ముందుమాట

9లో

# ఇంటింటికి జిఎస్టీ ఫలాలు



## ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

### లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరుతున్న నీరు

### బాధితులు పునరావాస కేంద్రాలకు తరలింపు

### ముంపు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: మంత్రి అనగాని

**విజయవాడ,సెప్టెంబరు29,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతంగా ఉంది.ఇప్పటికే రెండో ప్రమాద హెచ్చరికను జలవనరుల శాఖ అధికారులు జారీచేసారు.నదీ పరివాహక ఆవాశిత ప్రాంతాల్లో ఇళ్లల్లోకి వరద నీరు చేరటంతో నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించారు,వరద నీటి ఉధృతితో భయాందోళనలో నది పరివాహ ప్రాంతవాసులు ఉన్నారు. ప్రకాశం బ్యారేజ్ ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 6.81 లక్షల క్యూసెక్కులుగా ఉంది,69 గేట్లను పూర్తిస్థాయిలో ఎత్తి వరద నీరు అధికారులు విడుదల చేస్తున్నారు. టూరిజం సిబ్బంది విజయవాడ బెర్న్‌పార్క్ వద్ద అప్రమత్తమైయ్యారు.పర్యాటకశాఖ బోట్లు తాళ్లతో కట్టేశారు. నదీపరివాహక ప్రాంతాల్లో ప్రజ >>2



సోమవారం జిఎస్టీపై కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో సిఎం చంద్రబాబు

### రాష్ట్రమంతా జిఎస్టీ 2.0 సంస్కరణలపై విస్తృత ప్రచారం

### అక్టోబరు 19 వరకు వేర్వేరు థీమ్స్‌తో ప్రజల్లోకి

### జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు

### జిఎస్టీ ఉత్సవ్‌పై కేబినెట్ సబ్‌కమిటీలో భేటీలో సిఎం చంద్రబాబు

**విజయవాడ సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** సూపర్ జిఎస్టీసూపర్ సేవింగ్స్ పేరిట రాష్ట్ర ప్రభుత్వం జిఎస్టీ ప్రయోజనాలను రాష్ట్రంలోని ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీతో సిఎం చంద్రబాబు నాయుడు సోమవారం తన క్యాంప్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిఎస్టీ 2.0 సంస్కరణల ప్రయోజనాలను ప్రజలు, వినియోగదారుల్లోకి తీసుకెళ్లేలా విస్తృత ప్రచారం చేసేందుకుగాను రాష్ట్ర వ్యాప్తంగా 65 వేల సమావేశాలు, కార్యక్రమాలను నిర్వహించాలని నిర్ణయించారు. వచ్చే నెల 19వ తేదీ వరకు వేర్వేరు థీమ్‌లతో ఈ ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కేబినెట్ కమిటీకి సిఎం చంద్రబాబు దిశా నిర్దేశంచేశారు. దీనిపై అధికారులు మాట్లాడుతూ...ఇప్పటికే ఇంటింటికీ జిఎస్టీ ఫలాల్ను థీమ్‌తో నిత్యవసరాలు, ఔషధాలు, స్టేషనరీ, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, మహిళలు, చిన్నారులకు సంబంధించిన వస్తులపై పన్నులు తగ్గిన అంశాన్ని విస్తృతంగా ప్రచారం నిర్వహించామని, క్షేత్రస్థాయిలో వీటిపై అవగాహన కల్పించామన్నారు. అన్ని వర్గాలకు జిఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు తెలిసేలా ప్రచార కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు చేపట్టింది. సెప్టెంబరు 30 నుంచి అక్టోబరు 19వ తేదీ వరకు వ్యవసాయం, ఎంఎస్ఎంఇలు, చేనేతఉత్పత్తులు, ఆక్వా, విద్యారంగం, బీమా, ఎలక్ట్రానిక్స్, ఈ కామర్స్, భవన నిర్మాణ రంగం, టూరిజం, ఆతిథ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్, ఆటో మొబైల్స్, తదితర అంశాలపై రంగాల వారీగా ఆయా శాఖలు ప్రచారం చేపట్టాలని సిఎం సూచించారు.

రైతులకు అవగాహన కల్పించేలా ట్రాక్టర్ ర్యాలీలు, యంత్రాల ప్రదర్శన చేపట్టాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఆప్కో, లేపాక్షి, ఒక జిల్లాఒక ఉత్పత్తి పేరిట మేళాలు, ఎంఎస్ఎంఇ యూనిట్లలో తయారయ్యే ఉత్పత్తులు, దానికి సంబంధించిన పన్నుల తగ్గింపుపై ప్రచారం నిర్వహించేలా చూడాలన్నారు. సెలూన్లు, యోగా సెంటర్లు, జిమ్‌లలో జీఎస్టీల తగ్గింపు వల్ల ధరలు ఎంత వ్యత్యాసం వచ్చిందో అవగాహన కల్పించాలని సిఎం ఆదేశించారు.

జిఎస్టీ తగ్గింపుతో స్టేషనరీ ఉత్పత్తులపైనా ధరలు గణనీయంగా తగ్గిన అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సమావేశంలో నిర్ణయించారు. వీటిపై అవగాహన కల్పించేలా విద్యార్థులకు వ్యాస రచన, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని ముఖ్యమంత్రి చెప్పారు. రాష్ట్రంలోని 7వేల ఉన్నత పాఠశాలలు, 4 వేల జూనియర్ కాలేజీల్లో ఈ ప్రచారం నిర్వహించేలా ప్రణాళిక సిద్దం చేశారు. అలాగే జీవిత బీమా, ఆరోగ్య బీమాలకు సంబంధించి జీరో జిఎస్టీ విషయాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులకు సంబంధించి ధరలపై అవగాహన కల్పించేందుకు ఉత్పత్తిదారులు, డీలర్లతో జిల్లా, నియోజకవర్గ, మండలాల వారీగా 850కి పైగా చోట్ల కార్యక్రమాలు చేపట్టాలని ఈ భేటీలో నిర్ణయించారు.ఇకామర్స్ రంగానికి సంబం >>2



## భారతీయ సినిమాలపై 100% సుంకాలు

### ట్రంప్ పేల్చిన మరో బాంబు

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** భారత్‌పైనే కాకుండా తనకు వ్యతిరేక వైఖరితో ఉన్న దేశాలపై సుంకాలను బాదిపారేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌మరో సంచలన నిర్ణయం ప్రకటించారు. తన సొంత సోషల్‌మీడియా సంస్థ ట్రూత్‌లో సోమవారం ఆయన మరో సంచలన పోస్టుచేసారు. ఇకనుంచి విదేశాల్లో తీసే సినిమాలు అమెరికాలో ప్రదర్శిస్తే 100 శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించారు. ఇప్పటికే భారత ఎగుమతులపై 50శాతం సుంకాలు విధించిన ట్రంప్ ప్రకటించిన ఈ తాజా నిర్ణయంతో భారతీయ చిత్రాలపై భారీ ప్రభావం పడనున్నది. అమెరికా వెలుపల నిర్మించే సినిమాలపై సుంకాలు అమలు చేయనున్నట్లు హెచ్చరించారు. వందశాతం సుంకాలను విధించనున్నట్లు ప్రకటించారు. విదేశీ సినిమాలపై వందశాతం సుంకాలు అమలుకానున్నాయి. 'మా సినిమా నిర్మాణ వ్యాపారాన్ని అమెరికా నుంచి ఇతర దేశాలను ఓ శిశువునుంచి మిఠాయిని తొలగించినట్లుగా దొంగిలించా >>2

## టివికె జిల్లాప్రధానకార్యదర్శి మథియజగన్ అరెస్టు

**చెన్నై, సెప్టెంబరు 29:** టివికెచీఫ్ విజయన్ కరూర్ ర్యాలీ దుర్ఘటనకు సంబంధించి విజయ్‌పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మథియజగన్‌ను కరూర్ పోలీసులు అరెస్టుచేసారు. పోలీసులు ఆయనపై హత్యాయత్నం, ఉద్దేశపూర్వక నేరపూరిత చర్యలకు యత్నం, ప్రజాభద్రతకు భంగం కలిగించడం వంటి అభియోగాలకింద కేసు నమోదు చేసారు. అలాగే టివికె ప్రధాన కార్యదర్శు బుస్సీ ఆనంద్, జాయింట్ జనరల్ సెక్రటరీ నిర్మల్ సేకర్‌లపైనా కేసులునమోదయ్యాయి. ఒక పోలీస్ అదికారి ఫిర్యాదుమేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేసారు. విజయ్ వైఖరివల్లనే 41 మంది చనిపోయేందుకు కారణం అయిందని, విజయ్ ఉద్దేశ్యపూర్వకంగానే ఆయన రాకను ఆలశ్యంచేసారని, కనీసం నాలుగుగంటలపాటు జాప్యంచేసారని, ఈలోపు అక్కడ రద్దీపెరిగిపోయిందని, దీనితో అసహనం పెరిగి కట్టడిచేయడమే కష్టం అయిందని పోలీస్ అధికారి ఫిర్యాదుమేరకు ఎఫ్ఐఆర్ రిజిస్టరుచేసారు.

## మంత్రి లోకేష్‌కు తిలక్ వర్మ ప్రత్యేక బహుమతి



**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్త ప్రతినిధి:** ఆసియా కప్ ఫైనల్ హీరో, భారత క్రికెటర్ తిలక్ వర్మ మంత్రి నారా లోకేశ్‌కు ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. పాకిస్థాన్‌తో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తాను ఉపయోగించిన క్యాప్‌ను మంత్రి లోకేశ్‌కు ప్రేమతో ఇస్తున్నట్లు తిలక్‌వర్మ పేర్కొన్నారు. ఈ మేరకు తిలక్ వర్మ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. తిలక్ వర్మ బహుమతికి మంత్రి లోకేశ్ ముగ్ధుడయ్యారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం 'ఎక్స్'లో లోకేశ్ పోస్టు చేశారు. తమ్ముడు తిలక్ వర్మ బహుమతి నాకెంతో ప్రత్యేకమైందని స్వదేశానికి వచ్చాక అతడి చేతుల మీదుగానే క్యాప్ తీసుకుంటానని పేర్కొన్నారు. క్యాప్‌పై తిలక్ వర్మ సంతకం చేస్తున్న వీడియోను మంత్రి లోకేశ్ షేర్ చేశారు. ఆసియా కప్ ఫైనల్‌లో తిలక్ వర్మ 69 పరుగులతో నాటౌట్‌గా నిలిచి భారత్ విజయంలో కీలక పాత్ర పోషించారు.ఇక భారత్ ఛాంపియన్స్‌గా నిలవడంలో తెలుగు కుర్రాడు తిలక్ వర్మ కీలక పాత్ర పోషించాడు. లక్ష్య ఛేదనలో మూడ వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయిన జట్టును తిలక్ తన వీరోచిత ఇన్నింగ్స్‌తో విరుచుకుపడ్డాడు. తిలక్ ఆట తీరుతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా సాగింది. ఆసియా కప ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌ను చిత్తు చేసి టైటిల్‌ను సొంతం చేసుకుంది భారత్. తిలక్ వర్మ (69 రన్స్ చేస్తే >>2



సోమవారం దుర్గమ్మతల్లికి సతీసమేతంగా పట్టు వస్త్రాలు తీసుకుని వెళ్తున్న సిఎం చంద్రబాబు

## దుర్గమ్మకు పట్టు వస్త్రాలు

### సతీ సమేతంగా అమ్మవారిని దర్శించి సమర్పించిన సిఎం చంద్రబాబు

### ముఖ్యమంత్రికి వేదాశీర్వచనం అందించిన ఆలయ అర్చకులు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మ దర్శనార్థం సాధారణ భక్తులకు ప్రాధాన్యం ఇస్తున్నామని సిఎం నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. భక్తుల కోసం నిర్మిస్తున్న అన్న ప్రసాద భవనం మరో ఆరు నెలల్లో పూర్తవుతుందని చెప్పారు. సోమవారం ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వర స్వామివారి దేవాల >>2

## ఎంపి మిథున్ రెడ్డికి బెయిలు

### లిక్కర్ కుంభకోణం కేసు



**విజయవాడ, సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** లిక్కరు కుంభకోణం కేసులో ఎంపి మిథున్ రెడ్డికి బెయిల్ మంజూరయ్యింది. ఈ మేరకు మద్యం అక్రమ కేసుకు సంబంధించి మిథున్‌రెడ్డికి సోమవారం ఎసిబి కోర్టు బెయిల్ మంజూరు చేసింది. మిథున్‌రెడ్డి మద్యం కుంభకోసం కేసులో కీలక నిందితునిగా ఉన్నారు.ఈ కేసులో ఆయనను సిట్ అరెస్ట్ చేయడంతో రాజమండ్రి సెంట్రల్ జైలులో దాదాపు 70 రోజులుగా ఆయన రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల సందర్భంగా విజయవాడ ఎసిబి కోర్టు ఓటు వేసేందుకు మిథున్‌రెడ్డికి తాత్కాలిక బెయిల్ ఇచ్చినప్పటికి తరువాత తిరిగి రిమాండ్‌కు పంపింది.ఇటీవల మిథున్‌రెడ్డి సిట్ రెండు రోజులు కస్టడీకి తీసుకుని విచారించింది.నేడు ఆయనకు ఎసిబి కోర్టు బెయిల్ ఇచ్చింది.



సోమవారం మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న హైదరాబాద్ సిపి ఆనంద్, చిత్రంలో నాగార్జున, చిరంజీవి, వెంకటేష్

## భారీ సినీ పైరసీ గుట్టురట్టు

### 500 సినిమాలు అక్రమంగా రికార్డు చేసిన ముఠా

### డిజిటల్ శాటిలైట్లు హ్యాక్‌చేసి పైరసీ తయారీ

### హైదరాబాద్ సిటీ కొత్వాల్ ఆనంద్ వెల్లడి

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశంలోనే అతిపెద్ద సినిమా పైరసీ ముఠాను హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఈ స ందర్భంగా ముఠాకు చెందిన ఐదుగురిని అరెస్టు చేయగా వీరి వద్ద నుంచి సినిమా పైరసీకి వాడిన పలురకాల ఉపకరణాలను, సెల్‌ఫోన్లను జప్తు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిటీ పోలీసు కమిషనర్ సి.వి ఆనంద్ సోమవారం మీడియాకు వెల్లడించారు. ఈ ఏడాది జూన్ ఐదవ తేదీన తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, యాంటీ వీడియో పైరసీ సెల్ తరపున అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేయగా ఈ మఠా గుట్టు రట్టయ్యిందని ఆయన తెలిపారు. ఈ ఏడాది మే తొమ్మిదవ తేదీన విడుదలైన సింగిల్, హిట్ థర్డ్ కేస్ సినిమాలు పైరసీకి గురైనట్లు ఆ ఫిర్యాదులో వుందని, ఈ రెండు సినిమాలు మొదటి రోజునే పైరసీకి గురైనట్లు తమ విచారణలో తేలిందని ఆయన తెలిపారు. దీనిపై మరింత లోతుగా విచారణ చేస్తే థియేటర్లలోనే పైరసీ జరిగిందని నిర్ధారణ అయిందని ఆనంద్ తెలిపారు.ౖ ఈ ఘటనపై నాలుగు నెలల పాటు విచారణ సాగించగా బిహార్‌లోని గుల్జార్‌బాగ్‌కు చెందిన అశ్విని కుమార్ (21), తమిళనాడులోని కరూర్ జిల్లా వెలుస్వామిపురం నివాసి సిరిల్ ఇన్ఫండ్ రాజ్ అమలదాస్ (32), ఇదే రాష్ట్రంలోని ఈరోడ్‌కు చెందిన సుధాకరన్ (31), వన స్థలిపురంలోని జాన కిరణ్ కుమార్ (29), గోవాకు చెందిన అర్సలాన్ అహ్మద్ (23)లు సూత్రధారులుగా తేలింది. ఈ ఐదుగురు మరికొందరితో క లిసి కొత్తగా విడుదలైన సినిమాలను మొదటి రోజునే థియేటర్లకు వెళ్లి >>2

## నేడు ఢిల్లీకి సిఎం, మంత్రి లోకేష్

### సిఐఐ సదస్సుకు హాజరు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం నారా చంద్రబాబు నాయుడు,రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌లు దేశ రాజధాని న్యూఢిల్లీ పర్యటన ఖరారైంది. మంగళవారం ఉదయం వీరిద్దరూ న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. సిఐఐ సదస్సులో సిఎం చంద్రబాబు నాయుడు పాల్గొనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీతో సిఎం చంద్రబాబు సమావేశమయ్యే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోనూ ఆయన భేటీ కానున్నారు. అక్టోబరు 16వ తేదీన కర్నూలులో జిఎస్టీ 2.0 కార్యక్రమాన్ని ఎపి ప్రభుత్వం నిర్వహిస్తుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని మోడీని సిఎం చంద్రబాబు అధికారికంగా ఆహ్వానించనున్నారు. మరోవైపు లోకేష్ సైతం న్యూఢిల్లీ పర్యటనలో భాగంగా పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారని తెలుస్తోంది. అక్టోబరు 16వ తేదీన కర్నూలు, >>2

## తపాలా శాఖలో రిజిస్టర్ పోస్టుకు స్వస్తి

### స్పీడ్ పోస్టు సేవల్లో మార్పులు

**విజయవాడ,సెప్టెంబరు29,ప్రభాతవార్తప్రతినిధి :** బ్రిటిష్ కాలం నుంచి అమల్లో ఉన్న రిజిస్టర్ పోస్టు విధానాన్ని తపాలా శాఖ స్పీడ్ పోస్టులో విలీనం చేసింది. వాల్యూయాడెడ్ సర్వీసుగా స్పీడ్ పోస్టు కిందే ఇది అందుబాటులో ఉంటుంది. అలాగే దేశవ్యాప్తంగా ఏకీకృత టారిఫ్‌ను రూపొందించింది. ఒటిపి ఆధారిత డెలివరీ అనే కొత్త సర్వీసును తీసుకొచ్చింది. అక్టోబరు ఒకటో తేదీ నుంచి దేశవ్యాప్తంగా ఇవి అమల్లోకి రానున్నాయి. రిజిస్టర్ పోస్టులో ఎవరి పేరుతో అయితే మనం పంపామో వారికే పోస్టుమన్ ఉత్తరాన్ని ఇచ్చి సంతకం తీసుకుంటారు. ఈ సేవ కోసం నిర్దేశిత టారిఫ్‌కు అదనంగా ఒక్కో ఆర్టికల్‌కు జీఎస్టీ కాకుండా రూ.5 చెల్లించాలి. స్పీడ్ పోస్టుకు సంబంధించి ఒటిపి ఆధారిత డెలివరీ అనే కొత్త సర్వీసు అందుబాటులోకి రానుంది. ఇందులో ఉత్తరం డెలివరీ సమయంలో చిరునామాదారు ఫోన్‌కు ఒటిపి వస్తుంది. ఆ ఒటిపిని ధ్రువీకరించుకున్నాకే పోస్టుమన్ ఉత్తరాన్ని అందజేస్తారు. ఇందుకోసం నిర్దేశిత టారిఫ్ మీద జిఎస్టీ కాకుండా అదనంగా రూ.5 వసూలు చేస్తారు.

**విద్యార్థులకు స్పీడ్ పోస్టు ధరను పది శాతం తగ్గించింది**

కొత్తగా బల్క్ సేవల్ని వినియోగించుకొనే సంస్థలకు 5శాతం ప్రత్యేకతగ్గింపును ప్రవేశపెట్టింది. తపాలా శాఖ కొద్దిరోజుల కిందటే కొత్త ఫీచర్లను తీసుకొచ్చిన విషయం తెలిసిందే. గ్రామీణ ప్రాంతాల నుంచి మొదలు నగరాల వరకూ అన్ని పోస్టాఫీసుల్లోను కూడా ఎపిటి పేరుతో కొత్త టెక్నాలజీ అమలులోకి వచ్చింది. సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్‌పోస్టల్ టెక్నాలజీ సహకారంతో ఏపీటీని అభివృద్ధి రూపొందించారు. దీనినే 'పోస్టల్ 2.0' గా పిలుస్తున్నారు. దేశవ్యాప్తంగా ఈ విధానం జులై >>2

## రాష్ట్రానికి పెట్టుబడుల వరద



దక్షిణ కొరియాకు చెందిన కంపెనీల ప్రతినిధులు ఎపి మంత్రులు

### 156 ప్రాజెక్టుల ద్వారా 10 లక్షల కోట్లు

### 8 లక్షల కొత్త ఉద్యోగాల సృష్టి

### నాలుగు కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులతో యేడాదికి అదనంగా 353 మి.మె.ట కార్గో రవాణా

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** దక్షిణ కొరియా రాజధాని సీయోల్‌లో నిర్వహించిన ఈ సదస్సులో పాల్గొన్న మంత్రి పి. నారాయణ, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఇడిబి అధికారులు, దక్షిణ కొరియాకు చెందిన ప్రముఖ కంపెనీల ప్రతినిధులు, పెట్టుబడిదారులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ గత ఏడాది కాలంలో, ఆంధ్ర ప్రదేశ్ 156 ప్రాజెక్టుల ద్వారా 10 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను సాధించడంతో పాటు దాదాపు 8 లక్షల కొత్త ఉద్యోగాలను సృష్టించిందిఇది కేవలం ఒక నెంబర్‌మాత్రమే కాదు, ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారులు ఒక గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌పై ఉంచిన విశ్వాసానికి ఇది ప్రతీక. 1,053 కి.మీ తీరప్రాంతంతో, నేడు ఆంధ్రప్రదేశ్ భారతదేశానికి తూర్పు తీర ముఖద్వారంగా పనిచేస్తుంది. ప్రస్తుతం రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న 4కొత్త గ్రీన్‌ఫీల్డ్ పోర్టులు రామాయపట్నం, మూలపేట, మచిలీపట్నం, కాకినాడ ఏడాదికి అదనంగా 353 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో సామర్థ్యాన్ని జోడించగలవు. రాబోయే కాలంలో రాష్ట్రంలో కార్గో సామర్థ్యాన్ని సంవత్సరానికి 700 మిలియన్ మెట్రిక్ టన్నులకు పైగా విస్తరించనున్నాము.ఏవియేషన్ రంగంలో ఆంధ్రప్రదేశ్‌లో 3 అంతర్జాతీయ విమానాశ్రయాలుసహా ప్రస్తుతం 9 విమానాశ్రయాలు అభివృద్ధి దశలోఉన్నాయి. భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం 2026 నాటికి గ్లోబల్ కనెక్టివిటీకి ప్రధాన కేంద్రంగా ఉంటుంది. ఆంధ్రప్రదేశ్ 20 గిగా వాట్ల స్థాపిత సామర్థంతో అంతరాయం లేని విద్యుత్ సరఫరాకు హామీ ఇస్తుంది. అందులో 39 పునరుత్పాదక శక్తి..సంవత్సరానికి 300 రోజులు వేడి వాతావరణం కారణంగా రాష్ట్రంలో 2047 నాటికి 160 గిగా వాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. గ్రీన్ హైడ్రోజన్ >>2

30-09pg2exHMNWJQER 2nd_30-09pg2exHMNWJQER.qxd 9/30/2025 12:12 AM Page 1





# శ్వేత సౌధం స్వర్ణమయం

## డొనాల్డ్ ట్రంప్ విడియో వైరల్

**వాషింగ్టన్, సెప్టెంబరు 29:** అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌ను 24 క్యారెట్ల బంగారు తాపడాలతో అలంకరించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా శ్వేతసౌధంలోని ఓవల్ ఆఫీస్, కేబినెట్ రూమ్‌లో భారీగా స్వర్ణ అలంకరణలు చేపడుతున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అందమైన భవనంగా పేరుపొందిన శ్వేతసౌధం ఇకపై అత్యుత్తమమైన భవనంగా ఇక్కడికి వచ్చిన విదేశీనేతలను విస్తుపోయేలా చేస్తుందని తెలిపారు. కార్యాలయంలో అలంకరిస్తున్న మేలిమి అలంకరణల నాణ్యత, సౌందర్యంచూసి ఏ విదేశీ నాయకుడైనా ఆశ్చర్యపోతారన్నారు. శ్వేతసౌధంలో ఏర్పాటు చేయనున్న స్వర్ణ అలంకరణలకు సంబంధించిన విడియోను సోషల్ మీడియాలో షేర్ చేశారు. విడియోలో బంగారు పూతతో ఉన్న డజన్ల కొద్దీ డిజైన్లు కనిపిస్తున్నాయి. వైట్‌హౌస్‌లో స్వర్ణతాపడాలు చేయించడానికి ఉపయోగించిన బంగారం ఖర్చును ట్రంప్‌నే స్వయంగా భరించినట్లు వైట్‌హౌస్ ప్రతినిధి ఇటీవల పేర్కొన్నారు. అయితే ఎంత మొత్తంలో బంగారాన్ని వినియోగిస్తున్నారనే విషయాన్ని వెల్లడించలేదు. ఇప్పటికే ఓవల్ ఆఫీస్‌లో పలుచోట్ల స్వర్ణ తాపడాలు ఉన్నాయి. మిగిలిన చోట్ల కూడా బంగారంతో అలంకరించాలనే తన కోరికను ట్రంప్ పలుమార్లు బయటపెట్టారు.

# ఇంటింటికి జిఎస్టీ ఫలాలు

>> ధించి గిగ్ వర్కర్లలో ద్విచక్ర ర్యాలీలు, స్వదేశీ ఉత్పత్తులపై ఎగ్జిబిషన్లు నిర్వహించనున్నారు. భవన నిర్మాణ రంగం, ఆతిధ్య రంగం, రవాణా, లాజిస్టిక్స్ పైనా జిల్లా, నియోజకవర్గాల్లో ఎగ్జిబిషన్లు, ర్యాలీలు చేపట్టేలా ప్రణాళిక చేపట్టారు. ఆటబొమ్మలు, క్రీడా పరికరాలు, పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి, ఆటో మొబైల్స్ ధరలకు సంబంధించి ప్రజల్లో అవగాహన కల్పిచేలా 200పైగా కార్యక్రమాలు చేపట్టనున్నారుజీఎస్టీ 2.0 వల్ల కలుగుతున్న లబ్ధిపై ప్రజలకు వివరించేలా వినూత్న రీతిలో కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టనుంది.

అక్టోబర్ 18వ తేదీతో క్షేత్ర స్థాయిలో ప్రచారాన్ని ముగించి 19వ తేదీన జిల్లా కేంద్రాల్లో షాపింగ్ ఫెస్టివల్, సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించారు. అదే రోజున జిల్లా కేంద్రాల్లో దీపావళి సంబరాలు జరపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. వచ్చే 19వ తేదీ వరకు రేడియో, టివి, మీడియా, సోషల్ మీడియా, పత్రికా, సినిమా థియేటర్లు వంటి ప్రసార, ప్రచార మాధ్యమాల ద్వారా ప్రచారం నిర్వహించాలని సిఎం సూచించారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాల వద్ద కూడా జిఎస్టీ 2.0 ఫలాలు తెలిసేలా హోర్డింగులు ఏర్పాటు చేయాలని సిఎం ఆదేశించారు. ఈ సమావేశంలో సిఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.

# ప్రకాశం బ్యారేజి వద్ద వరద ఉధృతి

>>లను అప్రమత్తం చేస్తున్నారు. ఈ పరిణామాల నడుమ ప్రకాశం బ్యారేజి నుంచి దిగువకు వరద నీటి ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. ఎగువ నుంచి వస్తున్న వరదతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోంది. వరద ఉధృతికి ప్రకాశం బ్యారేజీ నిండుకుండను తలపిస్తోంది. జలాశయానికి 6 లక్షలకు పైగా క్యూసెక్కుల వరద ప్రవాహం వస్తుండగా అంతే మొత్తాన్ని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజ్ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతుండగా లంక గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. దీంతో బాపట్ల జిల్లా రేపల్లె మండలం వరద ప్రభావిత ప్రాంతం పెనుముడి పల్లెపాలెంలోకి వరద నీరు చేరుతోంది. ఇప్పటికే పలు ఇళ్లల్లోకి వరద నీరు చేరగా నిర్వాసితులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తున్నారు. వరద నీటి ఉధృతితో నది పరివాహ ప్రాంతవాసులు భయాందోళన చెందుతున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో కృష్ణానది మధ్యలో లంక గ్రామాలున్నాయి. ప్రకాశం బ్యారేజి నుంచి 3.5లక్షల క్యూసెక్కుల వరద దాటితే కృష్ణానదికి చినరేవుకి మధ్యనున్న లంక గ్రామాల ప్రజలు రాకపోకలు నిలిచిపోతాయి. కృష్ణా నదిలో సహజ సిద్ధంగా ఏర్పడిన నదీపాయ గాజుల్లంక వద్ద చీలి భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద తిరిగి కృష్ణానదిలో కలుస్తుంది. ఈ నదీపాయ దాటేందుకు గ్రామాల మధ్య దశాబ్దాల క్రితం తక్కువ ఎత్తులో నిర్మించిన చప్టాలు ఉన్నాయి. వరద పెరిగితే నీరు చప్టాల పైనుంచి ప్రవహిస్తుంది. కొల్లూరు మండలం దోనేపూడి, భట్టిప్రోలు మండలం పెసర్లంక, ఓలేరు, కోళ్లపాలెం సమీపంలో ఈ చప్టాలు ఉన్నాయి.ప్రకాశం బ్యారేజ్‌కి వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో కృష్ణానది పరివాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర రెవెన్యూ రిజిస్ట్రేషన్, స్టాంపుల శాఖామంత్రి అనగాని సత్యప్రసాద్ సూచించారు. రేపల్లె, వేమూరు నియోజకవర్గ కరకట్టకు అనుకుని ఉన్న లంక గ్రామాల ప్రజలను అధికారులు నిరంతరం అప్రమత్తం చేయాలన్నారు. కృష్ణానది కరకట్టవెంబడి పరిస్థితిని అధికారులు ఎప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే లోతట్టు ప్రాంతాల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించాలని రెవిన్యూ అధికారులకు, పోలీసులకు ఆదేశించారు. కరకట్ట ప్రాంతంలో గండి పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు. కృష్ణానది పొంగిపొర్లుతున్న నేపథ్యంలో ప్రజలు నదిని గాని, కాలువలు గాని దాటే ప్రయత్నం చేయవద్దని, ప్రజలెవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు. ఎటువంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు రాష్ట ప్రభుత్వం సిద్ధంగా ఉందని తేల్చిచెప్పారు. కృష్ణా నది వరద ఉధృతికి బాపట్ల జిల్లా పరిధిలోని లంక గ్రామాల ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భట్టిప్రోలు మండలాల పరిధిలో వరదనీరు చప్టాలపై నుంచి పారుతున్నాయి. ఫలితంగా స్కూలుకి వెళ్లే పిల్లలు, పనులకు వెళ్లే కూలీలు ఇళ్లలోనే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కృష్ణా నదికి వరద పోటెత్తడంతో పల్నాడు జిల్లాలోని కృష్ణా పరివాహక ప్రాంతాలు క్రమంగా ముంపు బారిన పడుతున్నాయి. రెండు రోజులుగా ఎగువ ప్రాంతాల్లో పడుతున్న వర్షాలకు తోడు సాగర్, పులిచింతల ప్రాజెక్టు నుంచి భారీగా వరద నీరు చేరికతో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో అమరావతి మండలం పెద్ద మద్దూరులోని కొండవీటి వాగు తీవ్ర రూపందాల్చి రాకపోకలు నిలిచిపోయాయి. అమరావతి నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన మార్గం ఇదే కావడంతో ప్రజలు, ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వరద దెబ్బకు పెద్దమద్దూరు వాగు నీరు స్థానికంగా చేరి రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో పరిసర ప్రాంతవాసులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు.విజయవాడ నుంచి అమరావతి వచ్చే బస్సులుపెద్దమద్దూరు వరకు వచ్చి వరద వల్ల వెనక్కి తిరిగి వెళ్లిపోతున్నాయి. దీంతో ప్రయాణికులు అక్కడి నుంచి అమరావతి వెళ్లేందుకు ప్రయాణ సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారు. కృష్ణా వరద ఉధృతికి దివిసీమ ప్రజలు ఆందోళన చెందుతున్నారు. కూరగాయ పంటలు, వాణిజ్య పంటలు, రొయ్యలు, చేపల చెరువులు సాగుచేస్తున్న తమను వరదనీరు ముంచేస్తోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలుగా కృష్ణానదిలో వరద ప్రవహిస్తున్నా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తక్కువ స్థాయిలో వరద విడుదల చేశారు. గత వరదలతో తీవ్రంగా నష్టపోయిన తమకు ఈసారైనా పంట చేతికి వస్తుందని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఊహించని విధంగా వరద ప్రవాహం రావటంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రభావానికి ఘంటసాల, చల్లపల్లి, మోపిదేవి, అవనిగడ్డ, నాగాయలంక,కోడూరు మండలాల్లో కృష్ణానది ఎడమ కరకట్ట కృష్ణానది మధ్య ఉన్న వేలాది ఎకరాల్లో సాగు చేసిన పంటలు వరద ముంపునకు గురవుతాయని రైతులు అందోళన చెందుతున్నారు. ఆక్వా రైతులైతే తీవ్రంగా నష్టపోతామని చెబుతున్నారు. మరోవైపు లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రదేశానికి చేరుకోవాలని అధికారులు కోరుతున్నారు.



సిఎం దంపతులకు అమ్మవారి ప్రసాదం అందజేస్తున్న ఆలయ అర్చకస్వాములు, కార్యదర్శి

# దుర్గమ్మకు పట్టు వస్త్రాలు

>> యంలో కొలువు తీరిన దుర్గమ్మకి సిఎం చంద్రబాబు నాయుడు, నారా భువనేశ్వరి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. నవరాత్రుల్లో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మ సోమవారం సరస్వతి దేవి రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అలాగే ఈ రోజు మూల నక్షత్రం. అంటే అమ్మవారి జన్మ నక్షత్రం. ఈ నేపథ్యంలో దుర్గమ్మకు సిఎం చంద్రబాబు నాయుడు దంపతులు ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ పట్టువస్త్రాలు సమర్పించేందుకు మధ్యాహ్నం 3.30 గంటలకు సిఎం చంద్రబాబు నాయుడు దంపతులు ఇంద్రకీలాద్రిపై ఉన్న దుర్గమ్మ ఆలయానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా మేళ తాళాలు.. మంగళ వాయిద్యాలతో వారికి పూర్ణకుంభంతో వేద పండితులు, ఆలయ అధికారులు, మంత్రులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఎం దంపతులు అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అమ్మవారి దర్శనం అనంతరం ఈ దంపతులకు వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చారు.

ఆ క్రమంలో అమ్మవారి లడ్డూ ప్రసాదంతోపాటు దుర్గమ్మ చిత్రపటాన్ని చంద్రబాబు దంపతులకు దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి అందజేశారు. సిఎం దంపతులకు స్వాగతం పలికిన వారిలో.. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు, ఎంపీ కేశినేని చిన్నితోపాటు పలువురు మంత్రులు ఉన్నారు. అనంతరం దేవాలయం బయట సిఎం చంద్రబాబు మీడియాతో మాట్లాడుతూ.. రూ.25 కోట్లతో 1,500 మంది భక్తులు భోజనం చేసే విధంగా అన్న ప్రసాద భవనం నిర్మిస్తున్నామన్నారు. రూ. 27 కోట్లతో 3 నెలల్లో ప్రసాదం తయారీ కేంద్ర పనులు పూర్తవుతాయని పేర్కొన్నారు. అలాగే రూ.5.5 కోట్లతో ప్రధాన ఆలయం వద్ద పూజా మండపానికి సంబంధించిన నిర్మాణ పనులు చేపట్టామని సీఎం నారా చంద్రబాబు నాయుడు వివరించారు. ప్రభుత్వం తరఫున దుర్గమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. రాష్ట్ర ప్రజలకు సుఖసంతోషాలు అందించాలని అమ్మవారిని కోరుకున్నానని తెలిపారు. దుర్గమ్మ దయతో కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతోందని.. దీంతో రాష్ట్రంలోని ప్రాజెక్టులన్నీ జలకళతోఉన్నాయని సంతోషం వ్యక్తంచేశారు. ప్రజలంతా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని.. రాష్ట్ర సంపద పెరగాలని ఆయన ఆకాంక్షించారు. నవరాత్రుల సందర్భంగా ఇప్పటి వరకూ 8 లక్షల మంది భక్తులు.. దుర్గమ్మ వారిని దర్శించుకున్నారని వివరించారు.

# నేడు ఢిల్లీకి సిఎం, మంత్రి లోకేష్

>> నంద్యాల జిల్లాల్లో ప్రధాని మోడీ పర్యటించనున్నారు. జిఎస్టీ సంస్కరణలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు కర్నూలు నగరంలో ప్రధాని రోడ్‌షో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో సిఎం చంద్రబాబు, డిప్యూటి సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ తోపాటు ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలూ పాల్గొంటారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాలు, ఇప్పటికే పూర్తి చేసిన పలు పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా ప్రధాని మోడీ శ్రీశైలంలోని మల్లికార్జునస్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఓర్వకల్లు సమీపంలోని ప్రధాని సభ ఏర్పాటుకు అనువైన స్థలం కోసం జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికే పరిశీలిస్తున్నారు. కాగా, ఓర్వకల్లు సమీపంలో 415 ఎకరాల విస్తీర్ణంలో జైరాజ్ ఇస్పాత్ ఉక్కు పరిశ్రమను ప్రధాని ప్రారంభించనున్నారని తెలుస్తోంది.

# రిజిస్టర్ పోస్టుకు స్వస్తి

>> 22వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. దీనివల్ల ప్రజలకు మెరుగైన సేవలు సులభంగా, వేగంగా అందనున్నాయి. గతంలో హెడ్ పోస్టాఫీసుల్లో మాత్రమే అమల్లో ఉన్న యూపీఐ చెల్లింపులు ఇప్పుడు ప్రతిచోటా అమల్లోకి వచ్చాయి. పోస్టల్ సేవింగ్స్ బ్యాంక్ సేవలు మినహా, మిగితా అన్ని ఇతర చెల్లింపులను యూపీఐ ద్వారా చేయవచ్చు. పార్సిళ్లు, రిజిస్టర్ పోస్టులు, డెలివరీ వంటివి కూడా 'ఏపీటీ'తో సులభతరం కానుంది. గతంలో లాగా మధ్యలో ఎటువంటి మరో మజిలీ లేకుండా ఈ విధానంలో బీట్‌ల వారీగా వాటి వివరాలు నేరుగా పోస్ట్‌మెన్ మొబైల్ నంబర్లకే వెళతాయి. కస్టమర్ల నుంచి డిజిటల్ సంతకం తీసుకుని డెలివరీ చేస్తారు. డెలివరీ సమాచారం ఎప్పటికప్పుడు అప్ డేట్ అవుతుంది. డాక్ సేవా యాప్ ద్వారా స్పీడ్ పోస్టు, పార్సిల్, రిజిస్టర్ పోస్టు, బల్క్ బుకింగ్‌లను మనం ఉన్నచోటు నుంచే యాప్ ద్వారా బుక్ చేసుకుని డబ్బు చెల్లించవచ్చు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్య టైం స్లాట్ ఆధారంగా పోస్ట్‌మెన్ మన ఇంటి వద్దకే వచ్చి వాటిని తీసుకెళతారు.నామమాత్రపు రుసుము మాత్రమే మన వద్ద నుంచి వసూలు చేస్తారు. లేదంటే బుకింగ్, చెల్లింపులు యాప్‌లో పూర్తిచేసి సమీపంలోని పోస్టుఫీసులో ఉత్తరాలు ఇవ్వొచ్చు. దీనివల్ల సమయం కూడా ఆదా అవుతుంది. ఈ యాప్‌లో పోస్టల్ శాఖ సేవలన్నీ పొందవచ్చు. సేవల్లో ఏమైనా లోపాలు ఉంటే, దీని ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. వీటితో పాటు, చిరునామాలను కచ్చితంగా గుర్తించేందుకు త్వరలోనే డిజి పిన్ అందుబాటులోకి వస్తుందని ఆంధ్రప్రదేశ్ సర్కిల్ పోస్టల్ సర్వీసెస్ డైరెక్టర్ సంతోష్ నేత తెలియజేశారు.

# భారీ సినీ పైరసీ గుట్టురట్టు

>>హై ఎండ్ కెమెరా సెల్‌ఫోన్ల ద్వారా రికార్డింగ్ చేస్తారని, ఆ తరువాత వీటిని ఇతర ప్రాంతాలలో వుండే తమ అనుచరులకు పంపి టెలిగ్రామ్ ఛానల్స్, టొరెంట్స్ ద్వారా నిమిషాల వ్యవధిలో పైరసీ సిడిల తయారు చేస్తున్నారని ఆయన వెల్లడించారు. హైఎండ్ కెమెరా సెల్‌ఫోన్లను తమ ప్యాంట్ జేబులో లేదా పాప్ కార్న్ ప్యాకెట్లలో వుంచి థియేటర్లలోకి తీసుకువెళతారని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం అధునాతన యాప్‌ను నిందితులు వాడుతున్నారని ఆయన చెప్పారు. కాపీ రైట్ రక్షణ పొందిన సినిమాలను టొరెంట్లు, వెబ్ సైట్ల ద్వారా వీరు కాపీ చేయడంతో పాటు పంపిణీ చేస్తున్నారని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం టొరెంట్ వెబ్‌సైట్లు, టెలిగ్రాం ఛా నెల్స్, అక్రమ స్ట్రీమింగ్ వేదికలను వాడుతున్నారని ఆయన తెలిపారు. దీని తరువాత ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వెబ్‌సైట్ నిర్వాహకులు తమ వేదికలను వీటి ప్రచారానికి వాడుకునేం దుకు అవకాశం ఇస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో నిందితులు వ్యక్తిగత గుర్తింపును దాచడానికి వర్చువల్ మెషిన్లను ఉపయోగించి వైబ్‌సైట్‌లను నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కేసులో ఒక నిందితుడైన సిరిల్ రాజ్ ఒక సర్వర్ హోస్టింగ్ కంపెనీ నుంచి పారిస్ లొకేషన్ గల రెండు ప్రత్యేక వర్చువల్ యంత్రాలను కొనుగోలు చేసి పైరసీ వాడాడని ఆనంద్ తెలి పారు. దీనిని అన్ని పైరసీ సిని మాలను నిలువ చేయడానికి వాడుతున్నాడని, ఇందుకోసం తమిల్ బ్లాస్టర్ వెబ్‌సైట్‌తో పాటు టెలిగ్రామ్ అప్లికేషన్, జి మెయిల్ ఖాతాలు, ప్రోటాన్ మెయిల్ ఖాతాలు, విఎం వేర్ అను యాప్‌ను వాడారని ఆయన తెలిపారు. దీంతో పాటు డిజిటల్ మీడియా కంపెనీల ప్రధాన సర్వర్లను హ్యాక్ చే యడం ద్వారా స్టూడియో కాపీల నుంచి హెచ్‌డి సినిమాలను అక్రమంగా చలామణి చేస్తున్నారని ఆయన వెల్లడించారు. వీటిని కూడా బెట్టింగ్ యా ప్, ఆన్‌లైన్ గేమింగ్ నిర్వాహకులతో కలిసి అమ్ముకున్నారని ఆయన చెప్పారు. తమ నేరకలాపాలు బయటకు తెలియకుం డా వుండేందుకు నేరగాళ్లు వేరు వేరు యూజర్ ఐడిలతో వేరు వేరు టెలిగ్రామ్ ఛానెళ్లకు ఉపయోగించారని, ఇక పైరసీ సిడిలకు సంబంధించిన చెల్లింపులన్నీ క్రిప్టో కరెన్సీ ద్వారా జరిగాయని ఆనంద్ తెలిపారు. ఇందుకోసం క్రిప్టో ప్లాట్ పాంలను వాడారని ఆయన వెల్లడించారు. ఈ కేసులో అశ్విని కుమార్ కీలక నిందితు డు కాగా ఇతను సినిమాలు థియేటర్లలో విడుదల కాకముందే హెచ్‌డి క్వాలిటీలో లీక్ చేయడంలో సిద్ధహస్తుడని తేలిందని ఆయన తెలిపారు. ఇత ను అనేక సంస్థల డిజిటల్ మిడియా కంపెనీల ప్రధాన సర్వర్లను హ్యాక్ చేసి హెచ్‌డి సినిమాలను కాపీచేసి ఇతర టెలిగ్రామ్ వినియోగదారులకు పం పేవాడని ఆనంద్ చెప్పారు. ఈ క్రమంలో పైరసీ సినిమా గ్రూపులకు సంబంధించిన హెచ్‌డి మూవీస్ ఫిల్మీజ్‌యాప్, వరల్డ్ 4 ఫ్రీ అనే చట్ట వ్యతిరే కమైన సంస్థల్లో చేరాడని ఆయన తెలిపారు. మిగతా నలుగురు నిందితులు ఇతని సహచరులేనని ఆయన తెలిపారు. తమతో పాటు పైరసీలకు పాల్పడే ఇతర ఆపరేటర్లతో కలిపి వ్యాపారం పెంచుకుంటున్నారని ఆయన తెలిపారు. సినిమాలను థియేటర్లో రికార్డు చేయడానికి ఒక్కో దానికి 150 రూపాయలను ఏజెంట్లకు ఇస్తుంటారని ఆనంద్ తెలిపారు. ఈ ముఠా 2020 నుంచి సుమారు 500 సినిమాలను పైరసీ చేసినట్లు తేలిందని ఆయన తెలిపారు. దీనివల్ల ప్రధాన నిందితుడు రెండు కోట్ల రూపాయలను సంపాదించాడని కమిషనర్ తెలిపారు. దక్షిణాది భాషలతో పాటు తెలుగులో ఈ ముఠా 300కు పైగా సినిమాలను పైరసీ చేసినట్లు నిర్ధారణ అయ్యిందని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోనే వంద సినిమాలను ఈ ముఠా పై రసీ చేసినట్లు కమిషనర్ తెలిపారు. ఈ ముఠా నుంచి సినిమాలను పైరసీ చేసేందుకు వాడిప హై ఎండ్ సెల్‌ఫోన్లతో పాటు డిస్కులు, లాప్‌టాప్‌లు, పెన్ డ్రైవ్‌లు, మెమరీ కార్డులు ఇంకొన్ని ఉపకరణాలను జప్తు చేసినట్లు ఆయన తెలిపారు. కాగా సినిమాల పైరసీ వల్ల నిర్మాతల కష్టం వృధా అవుతుందని, దీనివల్ల మొత్తం చిత్రసీమ నష్ట పోతోందని ఆనంద్ తెలిపారు. 2023లో దేశ వ్యాప్తంగా చిత్ర పరిశ్రమ 22,400 కోట్ల రూపాయలను పైరసీ వల్ల నష్ట పోయిందని, ఇది చాలా తీవ్రమైన విషయమని ఆయన అన్నారు. 2024 లో తెలుగు సినీ పరిశ్రమ 3700 కోట్ల రూపాయలను నష్ట పోయిందని, వీటన్నింటిని దృష్టిలో వుంచుకుని పైరసీపై ఫిర్యాదు అందిన వెంటనే రంగంలో దిగి భిన్న కోణాల్లో విచారించి పెద్ద ముఠాను పట్టుకున్నామని ఆయన తెలిపారు.

# శ్రీశైలం డ్యాంకు 6లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

## 10గేట్లు 23అడుగులు ఎత్తి సాగర్‌కు నీటివిడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు కృష్ణానదీ పోటెత్తుతున్నది. దీంతో కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. శ్రీశైలం డ్యాం నిండుకుండలా మారింది. సోమవారం సాయంత్రం 6గంటల సమాచారంమేరకు డ్యాం నీటిమట్టం 885 అడుగులకు గాను 883.20 అడుగులకు చేరింది. డ్యాం సామర్థ్యం 215.8070టీఎంసీలకు 205.6627టీఎంసీలకు చేరింది. జలాశయానికి జూరాల స్పిల్‌వే ద్వారా 560183క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 35,380క్యూసెక్కులు, హంద్రీ నుంచి 4,800క్యూసెక్కుల వరద వచ్చి చేరుతున్నది. శ్రీశైలం జలాశయంలోని ఎడమ, కుడి విద్యుదుత్పత్తి కేంద్రాలకు 64,441 క్యూసెక్కులు విడుదల చేశారు. డ్యాం 10గేట్లు 23 అడుగులు ఎత్తి 5,22,040 క్యూసెక్కుల వరద దిగువకు విడుదల చేస్తున్నారు. జలాశయం నుంచి మొత్తంగా 6,00363క్యూసెక్కుల వరద నాగార్జున సాగర్‌కు విడుదల అవుతున్నది.

## వారం - వర్జ్యం

30-09-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆశ్వయుజ మాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
అష్టమి సా.6.02
మూల ఉ.6.17
వర్జ్యం : సా.4.36-6.19
దు.ఉ.8.22-9.10, 2)రా.10.47-11.35
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

- **మేషం :** దూరప్రాంతాల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. భూ వివాదాలు తీరుతాయి
- **వృషభం:** రాజకీయ, కళా రంగాల వారికి యోగదాయకం. కాంట్రాక్టులు లాభిస్తాయి.
- **మిథునం:** గతం కన్నా వృద్ధి బాగుంటుంది. అనేకాంశాలు అనుకూలంగా ఉంటాయి.
- **కర్కాటకం :** ఆరోగ్యం వాహనాల విషయంలో నిర్లక్ష్యం తగదు. క్రయవిక్రయాలలో ప్రోత్సాహం.
- **సింహం:** ఇంటాబయటా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వ్యాపారాలలో లాభాలు.
- **కన్య :** కుటుంబ సభ్యుల సహాయ సహకారాలు అందుకుంటారు. భూ వివాదాలకు దూరంగా ఉండండి
- **తుల :** అమ్మకాలు కొనుగోలు సంబంధించిన వ్యవహారాలు స్తబ్దతగా ఉంటాయి.
- **వృశ్చికం:** జీవిత భాగస్వామితో సంయమనం పాటించి సానుకూల ఫలితాలు సాధిస్తారు.
- **ధనుస్సు:** సంతాన పురోభివృద్ధి బాగుంటుంది. వృత్తి, వ్యాపారాలలో లాభాలు పొందుతారు.
- **మకరం:** ఆర్థికంగా కొంత వెనుకబాటు కనబడిన కనీస అవసరాలకు లోటు ఉండదు.
- **కుంభం:** మిత్రలతోటి చర్చించి కొన్ని నిర్ణయాలు తీసుకుంటారు. ఉద్యోగులకు అనుకూలం.
- **మీనం :** వివాదాస్పదమైన అంశాలను వదిలివేయడం మంచిదని గ్రహించండి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోటి, హైదరాబాద్

# న్యాయవిచారణ జరిపేంతవరకూ చర్చల్లేవ్

## లడఖ్ సంయుక్త అలయన్స్ స్పష్టీకరణ

**లేహ్, సెప్టెంబరు 29:** లడఖ్‌కు రాష్ట్రహోదా కల్పించాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలని డిమాండ్‌చేస్తున్న లడఖ్ వాసుల డిమాండ్‌పై కేంద్ర ప్రభుత్వం నిర్వహించ తలపెట్టిన చర్చలను లడఖ్ అపెక్స్ సొసైటీ వ్యతిరేకించింది. తమ నాయకుడు సోనమ్ వాంగ్‌ఛుక్‌పై ప్రజాభద్రతా చట్టం కింద కేసులు నమోదుచేయడం, అంతేకాకుండా దేశ విద్రోహి అని, జాతి వ్యతిరేకుడని ముద్రవేయడాన్ని లడఖ్ వాసులు జీర్ణించుకోలేకపోతున్నారు. అలాగే ఈనెల 24వ తేదీ జరిగిన పోలీస్ ఫైరింగ్‌లో అనేక మంది యువకులు తీవ్ర గాయాల పాలుకావడం, మరికొందరుచనిపోవడం వంటి సంఘటనలపై వారు తీవ్ర నిరసన వ్యక్తంచేస్తున్నారు. వచ్చేనెల ఆరవ తేదీ ఢిల్లీలో లేహ్‌నుంచి వచ్చే ప్రతినిదిబృందంతో కేంద్ర హోంశాఖ చర్చలు జరపాలనినిర్ణయించింది. అయితే ఈ అపెక్స్‌సొసైటీ మాత్రం యువ నిరసనకారులపై నిర్వహించిన దమనకాండపై సమగ్రదర్యాప్తుకోసం న్యాయవిచారణ జరిపించాలని డిమాండ్‌చేస్తోంది. సిఆర్‌పిఎఫ్ దళాల దాడులు, 50 మందికిపైగా అరెస్టులు వారిపై అనరకమైన కేసులు వెంటనే ఉపసంహరించుకోవాలని అప్పటివరకూ ఎలాంటి చర్చలుండవని ఈ సంఘం ప్రకటించింది. కార్గిల్ డెమొక్రటిక్ అలయన్స్‌తో చర్చలు ఎప్పుడైనే సరే నిర్వహించేందుకు సిద్ధమేనని కేంద్రం ప్రకటించింది. లడక్ ఎపెక్స్‌బాడీ, కెడిఎ, హైపవర్డ్ కమిటీ వంటి వాటితో జరిపిన చర్చలు సత్ఫలితాలిచ్చాయని కేంద్రం ప్రకటించింది. లడక్‌లో ఎస్టీలకు రిజర్వేషన్ల పెంపు, మహిళలకు లడఖ్ అసెంబ్లీ, హిల్‌డెవలప్‌మెంట్ మండళ్లలో స్థానాలివ్వడం, స్థానిక భాషల సంరక్షణ వంటి వాటికి హామీ ఇవ్వాలని ఈ అలయన్స్ పట్టుబడుతోంది. లడఖ్ కేంద్ర పాలితప్రాంతంలో ఇప్పటికే 1800 ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ ప్రారంభించామని కేంద్రం ప్రకటించింది. అయితే ఉద్యమకారుడుసోనమ్ వాంగ్‌ఛుక్‌కు పాక్‌తో సంబంధాలున్నాయని, బంగ్లాదేశ్‌తో కూడా సంబంధాలున్నాయని లడఖ్ పోలీస్ చీఫ్ ఎస్‌డిసింగ్‌జమ్‌వాల్ వెల్లడించారు. వాంగ్‌ఛుక్ అరెస్టుపై ఆయన భార్య గీతాంజలి జె ఆంగ్మో మాట్లాడుతూ నాలుగేళ్లనుంచే ఈకుట్రలు ప్రారంభం అయ్యాయని కేంద్రపాలితప్రాంతం అయిన లడఖ్‌కు అసెంబ్లీ హోదా ఇవ్వాలని, రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలులో చేర్చాలన్న డిమాండ్‌తోనే ఆయనపై వేధింపులు పెరిగాయని ఆరోపించారు.

# రాష్ట్రానికి పెట్టుబడుల వరద

>> వ్యాలీని స్థాపించడానికి, క్లీన్ ఎనర్జీ ఎగుమతుల్లో గ్లోబల్ లీడర్‌గా ఎదగడానికి కృషి చేస్తున్నాము. ఎపి టెక్నాలజీలో ముందంజలో ఉంది. భారతదేశంలో అత్యంత శక్తివంతమైన కంప్యూటర్ అయిన ఐబిఎం యొక్క 133 కుబిట్ క్వాంటం సిస్టం2ను ఇక్కడ ఏర్పాటు చేయనున్నాం..సింగిల్ విండో క్లియరెన్స్ విధానం ద్వారా త్వరితగతిన అనుమతులు ఇస్తూ.. డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పెట్టుబడిదారులు పారదర్శకంగా, సమర్థవంతంగా ఫ్యూచర్ రెడీ బిజినెస్ ఎన్విరాన్మెంట్ అందించే ప్రయత్నం చేస్తున్నాం.. ఆర్స్ లోర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ వంటి గ్లోబల్ స్థాయి లీడర్లు ఆంధ్రప్రదేశ్ ను ఇప్పటికే తమ పెట్టుబడులకు గమ్యస్థానంగా ఎంపిక చేసుకున్నారు.

# లోకేష్‌కు తిలక్ వర్మ ప్రత్యేక బహుమతి

>> అందులో 53 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లు) కీలక సమయంలో అద్భుత ఇన్నింగ్స్ ఆడాడు. శివమ్ దూబె (33:22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించడంతో పాకిస్థాన్‌పై భారత్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. 147 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. అఫ్రాఫ్ వేసిన 1.1వ బంతికి ఓపెనర్ అభిషేక్ శర్మ (5) భారీ షాట్‌కు ప్రయత్నించి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత వరుస ఓవర్లలోనే కెప్టెన్ సూర్యకుమార్ (1), శుభ్‌మన్ గిల్ (12) పెవిలియన్ చేరడంతో టీమ్ ఇండియా కష్టాల్లో చిక్కుకుంది. అనంతరం వచ్చిన సంజూ శాంసన్‌తో (24) కలిసి తిలక్ వర్మ ఇన్నింగ్స్ చక్కబెట్టాడు. ఆ తర్వాత శాంసన్ ఔట్ అయినా శివమ్ దూబేతో కలిసి విజయానికి చేరువ చేశారు. దాయాదిపై గెలిచి ఆసియా కప్ అందుకోవడంతో దేశవ్యాప్తంగా అభిమానులు సంబరాలు చేసు కున్నారు.

# జోగి రమేష్ అనుచరుడు కోటేశ్వరరావు అరెస్టు

## మైలవరం పోలీస్ స్టేషన్ ముందు బైటాయించిన మాజీ మంత్రి జోగి రమేష్

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** మాజీ జోగి రమేష్ అనుచరుడు కోటేశ్వరరావును పలు అభియోగాలపై మైలవరం పోలీసులు అరెస్టు చేసారు.అతన్ని విడుదల చేయాలని మాజీ మంత్రి జోగి రమేష్ పోలీసులను డిమాండ్ చేసారు.అయితే పోలీసులు కోటేశ్వరరావు ఆయా కేసులో చట్టపరిధిలో కేసులు నమోదు చేసినందున విడుదల చేయడం సాధ్యంకాదని చెప్పడంతో ఆగ్రహించిన జోగి రమేష్,ఆయన వెంట వచ్చిన వైకాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. పోలీసులకు,స్థానిక శాసనసభ్యునికి, ప్రభుత్వానికి వ్యతిరేకం వారు నినాదాలు చేసారు.వారిని పోలీసులు అక్కడి నుంచి ప్రయత్నించడంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.ఉద్రిక్తత నెలకొంది,చివరికి పోలీసులు రమేష్‌కు నచ్చచెప్పి పంపించినట్లు సమాచారం!

# భారతీయ సినిమాలపై 100% సుంకాలు

>> యని ఆయనఆరోపించారు. బలహీనమైన, అసమర్థ గవర్నర్‌తో ఉన్న కాలిఫోర్నియా ముఖ్యంగా తీవ్రంగా దెబ్బతింది అంటూ సోషల్ మీడియా ప్లాట్ ఫామ్ ట్రూత్ సోషల్‌లో పోస్ట్ పెట్టారు. ఈ దీర్ఘకాల, ఎప్పటికీ అంతం కాని సమస్యను పరిష్కరించడానికి తాను అమెరికా వెలుపల నిర్మించే అన్ని సినిమాలపై 100శాతం సుంకం విధించనున్నట్లు పేర్కొన్నారు. విదేశీ సినిమాలతో అమెరికన్ సినిమా పరిశ్రమకు 'జాతీయ ముప్పు'గా ట్రంప్ భావిస్తూ ట్రంప్ ఇలాంటి ప్రకటన చేశారు. ఇదిలా ఉండగా.. గతంలోట్రంప్ అమెరికాలో షూటింగ్ జరుపుకోని సినిమాలపై ఏకంగా వందశాతం సుంకాలు విధించనున్నట్లు గతంలో ప్రకటించారు. పలువురు నిర్మాతలతో హాలీవుడ్ నష్టపోతుందన్న ట్రంప్ విదేశాల్లో చిత్రీకరణ జరిపి అమెరికాలో రిలీజ్ అయ్యే చిత్రాలపై వెంటనే 100 శాతం సుంకాలను విధించాలని యూఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్ అంటే వాణిజ్యమంత్రికి ఆదేశాలు జారీ చేశారు. అమెరికా చలన చిత్ర పరిశ్రమను పునరుద్ధించడంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ సమయంలో ట్రంప్‌ప్రకటించారు. చాలాదేశాలు అమెరికన్ స్టూడియోలు, చిత్రనిర్మాతలను ఆకర్షించేందుకు ప్రోత్సాహకాలను అందిస్తున్నాయి. ఇది అమెరికా ఆర్థిక, జాతీయ భద్రతకు ముప్పు కలిగించడమేనని ట్రంప్ అన్నారు. అమెరికన్ సినిమా ఇండస్ట్రీ చాలా వేగంగా తగ్గుతోందని మళ్లీ అమెరికా గడ్డపై సినిమాల షూటింగ్ జరగాల్సిన రోజులు రావాలని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఇటీవల కాలంలో సినిమా, టెలివిజన్ నిర్మాణం హాలీవుడ్ నుంచి యూకే, ఆస్ట్రేలియా, న్యూజి లాండ్ వంటి దేశాలకు తరలిపోతున్నాయి. ఆదేశాలు పన్ను ప్రోత్సాహకాలు ఇస్తున్నాయి. దాంతో ఆ దేశాలకు సినిమా రంగం తరలిపోతున్నది. షూటింగ్ ఖర్చు కూడా తగ్గుతున్నది. కొన్ని సినిమాలు ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో జరుగుతుంటాయి. సినిమా ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తెచ్చినట్రంప్ సుంకాలతో ఖజానా నింపుకునే యత్నంలో భాగంగానే కొత్త ప్రకటన చేసినట్లు వాణిజ్యరంగ నిపుణులు చెపుతున్నారు. ప్రపంచంలో రెండో అతిపెద్ద చిత్ర మార్కెట్ చైనాకు ఉంది. ఇదిలా ఉండగా అమెరికాలో భారతీయ సినిమాలు పెద్ద సంఖ్యలో విడుదలవుతుంటాయి. తెలుగు సినిమాలు సైతం విడుదలయ్యే విషయం తెలిసిందే.

ట్రంప్ నిర్ణయంతో తెలుగు సినిమా ఇండస్ట్రీపై సైతం ప్రభావం పడే అవకాశం ఉంది. అక్కడ సినిమా విడుదల చేయాలంటే ఇకపై వందశాతం పన్ను చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇటీవలే ట్రంప్ భారత ఫార్మా ఉత్పత్తులపై అక్టోబర్ ఒకటి నుంచి వందశాతం శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అమెరికాలో తయారయ్యే ఫార్మా ఉత్పత్తులకు మాత్రం సుంకాలు ఉండబోవని స్పష్టం చేశారు. అయితే, ప్రతి సంవత్సరం భారత్ నుంచి అమెరికాకు 10 బిలియన్ డాలర్ల విలువైన ఫార్మా ఉత్పత్తులు ఎగుమతి జరుగుతాయి. ఫార్మాతో భారీ ట్రక్కులు, కిచెన్ క్యాబినెట్, బాత్రూమ్ వానిటీలతో పాటు పలు వస్తువులపై 50శాతం సుంకాలు విధిస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే.

# తిరుమల సమాచారం



## విజయవంతంగా ముగింపునకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు

### రేపు 'చక్రస్నాన మహోత్సవం'

**తిరుమల,సెప్టెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** సప్తగిరుల్లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామికి భక్తుల మధ్య అంగరంగవైభవంగా జరుగుతున్న తొమ్మిదిరోజుల సాలకట్ల బ్రహ్మోత్సవ వైభవం గురువారం ఉదయంతో ముగింపుకు చేరుకో నుంది. బ్రహ్మోత్సవాల్లో చివరివాహనంగా అశ్వ వాహనంకాగా, చివరిఘట్టంగా చక్రస్నాన మహోత్సవం నిర్వహించడం పరిపాటి. చక్రత్తాళ్వార్‌కు జరిగే ఈ పవిత్ర కార్యక్రమం ఆలయానికి పక్కనేవున్న శ్రీవరాహస్వామి ఆలయంకు ఆనుకుని ఉన్న స్వామిపుష్కరిణిలో జరుగుతుంది. గురువారం ఉదయం 6గంటల నుండి 9గంటల మధ్య ఈ కార్యక్రమం నిర్వహిస్తారు. యజ్ఞాంతంలో అవరోహణంగా అవభృథ స్నానమే చక్రస్నానమహోత్సవం. తొమ్మిది రోజులు ఒక యజ్ఞంగా బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. పుష్కరిణిలో చక్రత్తాళ్వార్‌కు చక్రస్నానం ముందు శ్రీమలయప్పస్వామివారికి ఉభయదేవేరులకు తిరుమంజనం నిర్వహిస్తారు. పాలు, పెరుగు, నెయ్యి,తేనె కొబ్బరిజలం ఇత్యాది పవిత్రసుగంధ ద్రవ్యాలతో ఈ అభిషేకం చేస్తారు. ధూపదీపాలతో స్వామివారు ప్రసన్నుడవుతాడు. చక్రస్నాన సమయంలో భక్తులు,అర్చకులు, అధికారులు అందరూ పవిత్ర పుణ్యస్నానం చేస్తారు. ఇప్పటికే టిటిడి అధికారులు,పోలీసు యంత్రాంగం పుష్కరిణి వద్ద గట్టి ఏర్పాట్లు చేసింది.

# చక్కటి సౌకర్యాల పర్యవేక్షణతో గరుడసేవ ప్రశాంతం

### అశేషసంఖ్యలో భక్తులకు సంతోష దర్శనం



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** దసరా సెలవులు, పెరటాసిమాసం రెండవశనివారం ఆదివారం రాత్రి ఏడుకొండల్లో జరిగిన గరుడవాహనసేవ విజయవంతంగా తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించింది. నెలరోజుల పక్కా ప్రణాళికలు, కార్యాచరణతో టిటిడి ఉద్యోగులు, తిరుపతి జిల్లా పోలీసుయంత్రాంగం, టిటిడి నిఘాభద్రత విభాగం సమన్వయంతో పనిచేయడంతో 3లక్షలమంది భక్తులకు గరుడవాహన వీక్షణం ప్రశాంతంగా చేయించారు. సాధారణంగా ఏడుకొండలపై 70వేలమంది భక్తులు పెరిగితేనే అటు స్వామివారి దర్శనం ఇటు వసతి సదుపాయం గగనంగా మారుతుంది. టిటిడి అధికారులు తలలుపట్టుకునే పరిస్థితి ఎదురవుతుంది. అలాంటిది ఒక్కసారిగా 3.50లక్షలమంది భక్తులు కిటకిటలాడినా చిన్నపాటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా నిర్వహించడం టిటిడి పనితీరు అభినందనీయం. ఆలయ మాఢవీధుల్లోని గ్యాలరీల్లో ఎనిమిదినుండి పన్నెండుగంటల పాటు నిరీక్షించినా,ప్రతి భక్తునికి శ్రీవారిసేవకులు, పోలీసులు, టిటిడి నిఘాభద్రత సిబ్బంది, ఉద్యోగులు చక్కటి సేవలందించి 14రకాల అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ,కాఫీ అందించి భక్తుల మన్ననలు అందుకున్నారు. సాధారణరోజుల్లో రోజుకు 90వేల మంది నుండి లక్షమంది వరకు భక్తులు వస్తున్న తిరుమలకొండపై 4లక్షలమందికి సేవలుచేయడం టిటిడికి పెద్ద సమస్యకాదు, అయితే ఆదివారం, దసరా సెలవులు ,ఇప్పై గరుడసేవకు విచ్చేసిన అశేషభక్తులకు నిరంతరాయంగా సకల సదుపాయాలు కల్పించడం వెనుక టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు, బోర్డు సభ్యులు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తిరుపతిజిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, సివిఎస్ఓ మురళీకృష్ణ, తమతమ సిబ్బందితో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ స్వయంగా గ్యాలరీలు, మాఢవీధులు పర్యవేక్షించారు. గరుడవాహనసేవను విజయవంతం చేసి భక్తులకు సకల సేవలందించిన టిటిడి అధికారులు,సిబ్బంది, పోలీసు,స్కౌట్స్ గైడ్స్, శ్రీవారిసేవకుల సమిష్టి పనితీరును టిటిడి ఈఓ సింఘాల్, తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రత్యేకంగా అభినందించారు.ఆదివారం మధ్యాహ్నానికే 3లక్షలమంది భారీసంఖ్యలో భక్తులు తిరుమలకొండపైకి తరలిరావడం, మాఢవీధుల్లోని గ్యాలరీల్లో దాదాపు 2.50లక్షలమంది భక్తులు వుండటం, వెలుపల మరో 50వేలు, కొండపై మరో20వేల వరకు వెలుపట్ల వేచివున్న భక్తులకు సకల సౌకర్యాలు, సేవలందించారు. కాగా సిఎం చంద్రబాబు టిటిడి అధికారుల పనితీరు,సేవలపై అభినందనలు తెలిపారు.

## 'బంగారురథం'పై మలయప్ప ఉత్సవర్లు



**తిరుమల,సెప్టెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలలో ఆరవరోజు సోమవారం సాయంత్రం శ్రీదేవిభూదేవిసమేతుడై మలయప్ప బంగారు రథంపై భక్తులకు దర్శనమిచ్చాడు. సంధ్యా సమయంలో చల్లటిగాలులు వీస్తుండగా స్వర్ణరథోత్సం ఒక విశిష్టమైన వాహనం. స్వర్ణమయమైన రథం ఆలయం వద్ద నుండిబయలు దేరుతుంది. సాయంత్రం 4గంటలకు శ్రీదేవిభూదేవిమలయప్ప స్వామివారిని అర్చకులు విశేషాభరణాలతో అలంకరించారు. విశేషించి దాసభక్తుల నృత్యాలు ఆకర్షణీయంగా కనువిందుచేశాయి. ఈ స్వర్ణరథోత్సవంలో కల్యాణకట్ట మిరాశీదారులు సమర్పించిన ఒక సువర్ణఛత్రాన్ని తొలుత రథంపై అలంకరించారు. భగవంతుడు శైల్య,సుగ్రీవ, మేఘ,పుష్ప, పలహాకా అనే నాలుగు గుర్రాలు పూన్చిన రథమెక్కి విహరించాడు. దారుకుడు ఆయన సారధి. ఈ రథంమీద పయనిస్తూన్న శ్రీవారిని దర్శించిన భక్తులు గోవిందనామంతో పునీతులయ్యారు. స్వర్ణరథాన్ని మహిళా భక్తులు లాగారు. మోక్షం సిద్ధిస్తుందని భక్తుల విశ్వాసం. స్వర్ణరథోత్సవంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, జెఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, మహిళా ఉద్యోగులు, శ్రీవారిసేవకులు, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## కోదండరామునిగా కోనేటిరాయుడు

### హనుమంత వాహనంపై మలయప్ప



**తిరుమల,సెప్టెంబరు 29 ప్రభాతవార్తప్రతినిధి:** ద్వాపర యుగంలో శ్రీకృష్ణుడిగా,త్రేతాయుగంలో శ్రీరామచంద్రుడు, కలియుగంలో శ్రీవేంకటేశ్వర స్వామిగా భక్తులను రక్షిస్తున్న స్వామివారు సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో సోమవారం ఉదయం హనుమంతవాహనంపై అభయమిచ్చాడు. శేషాచలదీశుడు రాముడు అలంకారంలో కనువిందుచేయడం విశేషం. శ్రీరాముడికి హనుమంతుడు అత్యంత విశ్వాసపాత్రుడు. ప్రియదాస భక్తుడైన ఆంజనేయుడిపై వేంకటాద్రిరాముడుగా మలయప్ప ఊరేగి భక్తులకు దర్శనమిచ్చాడు. ఉదయం నిత్యకైంకార్యలు పూర్తిచేసుకున్న తరువాత ఆలయంనుండి మలయప్పస్వామిని వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని హనుమంతవాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి ఉదయం 8గంటలకు వాహనం ఆలయమాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. స్వామివారి వాహనంముందు భక్తులు ఆదపమొక్కుల వాడా గోవిందా శ్రీనివాసా గోవిందా అంటూ నామస్మరణలతో తన్మయత్వం పొందారు. ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్న జీయర్‌స్వామి, సుప్రీంకోర్టు మాజీ సిజెఐ జస్టిస్ ఎన్‌వి రమణ దంపతులు, టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, బోర్డు సభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, నరేశ్, శాంతారాం, పనబాకలక్ష్మి,టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్ దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు,వేదపండితులు పాల్గొన్నారు.

## గజవాహనంపై గరుడాచలపతి



**తిరుమల,సెప్టెంబరు 29 ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగవైకుంఠంలో శ్రీనివాసప్రభువుకు జరుగుతున్న సాలకట్ల బ్రహ్మోత్సవాలలో ఆరవ రోజు సోమవారం రాత్రి గజవాహనంపై గరుడాచలపతి భక్తులకు దర్శనమిచ్చాడు. సాయంత్రం ఆలయంనుండి మలయప్పస్వామిని వాహనమండపం వద్దకు వేంచేపుచేశారు. ఇక్కడ వేదమంత్రోచ్చరణల నడుమ స్వామివారిని గజవాహనంపై అధిరోహింపజేశారు. కర్పూరహారతులిచ్చి రాత్రి వాహనం ఆలయ మాఢవీధుల్లో ప్రదక్షణగా బయలుదేరింది. గజవాహనంపై శ్రీనివాసప్రభువు కనువిందు చేశాడు. రాజుల పట్టాభిషేకసమయంలో గజాధిష్ఠితులను చేసి ఊరేగిస్తారు.ఈ వాహనసేవలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, టిటిడి ఈఓ అనిల్‌కుమార్ సింఘాల్ దంపతులు, జెఈఓ వీరబ్రహ్మం దంపతులు, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.




## కొల్హాపూర్ మహాలక్ష్మికి టిటిడి పట్టువస్త్రాలు

**తిరుమల,సెప్టెంబరు 29ప్రభాతవార్తప్రతినిధి:** దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కొల్హాపూర్ శ్రీమహాలక్ష్మిఅమ్మకి సోమవారం మధ్యాహ్నం టిటిడి తరపున ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. బోర్డుసభ్యులు భానుప్రకాశ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి,సౌరబ్ హెచ్ బోర ,శాంతారామ్‌తో కలసి ఆయన అమ్మవారి ఆలయం చేరుకున్నారు. ఆలయ అర్చకులు స్వాగతం పలికి పట్టువస్త్రాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## దుర్గమ్మను దర్శించుకొన్న కర్ణాటక డి.సిఎం శివకుమార్

### స్వాగతం పలికిన హోమ్ మంత్రి అనిత, ఎంపి కేశినేని శివనాథ్



బెజవాడ కనకదుర్గమ్మ దర్శించుకునేందుకు వచ్చిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు స్వాగతం పలికిన హోమ్ మంత్రి అనిత,ఎంపీ కేశినేని శివనాథ్

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** బెజవాడ ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన కనకదుర్గమ్మను కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డి.కె. శివకుమార్ సోమవారం ఉదయం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు విచ్చేసిన డీకే శివకుమార్ కుటుంబానికి ఆలయ అధికారులు, వేదపండితులు, రాజకీయ ప్రముఖులు సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హోమ్ మంత్రి వంగల పూడి అనితతో కలిసి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ ఆయనను ఆహ్వానించి, ఆలయ ప్రవేశ ద్వారం వరకు తీసుకువెళ్లారు. ప్రత్యేక క్యూలైన్ ద్వారా ఆలయంలోకి ప్రవేశించిన శివకుమార్ దంపతులు, కుటుంబ సభ్యులు అమ్మవారిని శ్రద్ధాభక్తులతో దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయ వేదపండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆశీర్వచనాలు అందించారు. అమ్మవారి శేషవస్త్రాలు, చిత్రపటం, ప్రసాదాలను ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్, హోమ్ మంత్రి అనితలు డీకే శివకుమార్‌కు దసరా శుభాకాంక్షలు తెలియ జేశారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ "విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం ఎంతో పవిత్రమైనది. అమ్మవారిని దర్శించుకోవడం మా కుటుంబానికి ఒక విశేషమైన అనుభూతి. అమ్మవారి ఆశీస్సులతో రెండు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని, సమాజం శాంతి, అభివృద్ధితో ముందుకు సాగాలని కోరుకుంటున్నాను" అని తెలిపారు. అలాగే ఈ పుణ్యక్షేత్రంలో దసరా ఉత్సవాలు ఎంతో అద్భుతంగా జరుగుతున్నాయని, దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకునేందుకు దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు, విఐపిలకు ఎలాంటి అసౌకర్యం తలెత్తకుండా ఏపీ ప్రభుత్వం పకడ్బందీగా ఏర్పాట్లు చేసిందని డీకే శివకుమార్ కొనియాడారు.

## టీమ్ ఇండియాకు సిఎం చంద్రబాబు అభినందనలు

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** టీమ్ ఇండియా ఆసియా కప్ ఫైనల్ మ్యాచ్ లో పాకిస్తాన్ పై సాధించిన విజయం అద్భుతమైద ఎపీ ముఖ్యమంత్రి చంద్రబాబు'ఎక్స్‌వేదిక' ట్వీట్ చేసారు. టీమ్ ఇండియాకు చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు.టీం వర్క్‌తో, అంకితభావంతో స్ఫూర్తినిచ్చేలా ఆడిన టీమిండియా ఆసియా కప్ చేజిక్కించుకుందన్నారు.దేశం గర్వించదగ్గ క్షణాలని అన్నారు. ఇండియన్ క్రికెట్ చరిత్రలో ఈ గెలుపు ఓ అద్భుతమైన ఘట్టంగా సీఎం చంద్రబాబు అభివర్ణించారు.

## షాట్ పుట్‌లో స్వర్ణం సాధించిన రూబేష్ బాబు




**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా కంచికచర్ల అరుంధతి కాలనీకి చెందిన పత్తిపాటి రూబేష్ బాబు ఈ నెల 27 నుండి 28 వరకు గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో విభాగంలో ఆంధ్ర ప్రదేశ్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అట్లాంటిక్ ఛాంపియన్ షిప్ 2025 420 అండర్ జరిగిన షాట్ పుట్ 20 గేమ్స్ రాష్ట్ర స్థాయి విభాగంలో మొదటి స్థానం సంపాదించడమే కాక గోల్డ్ మెడల్ కూడా వశం చేసుకున్నారు.గతంలో కూడా 419 అండర్ 19 మరియు గోల్డ్ మెడల్ మరియు అండర్ 20 గోల్డ్ మెడల్ విజయం 2021 సంవత్సరం నుండి 2025 వరకు రాష్ట్రస్థాయిలో అన్ని గోల్డ్ మెడల్స్ ను సాధించడం జరిగినది. పత్తిపాటి రూబేష్ బాబు తల్లి వ్యవసాయ కూలి కాగా తండ్రి పత్తిపాటి దాసు ఆర్డబ్ల్యూఎస్ పంపింగ్ స్కీం నందు దినసరి కూలిగా పనిచేయుచున్నారు. షాట్ పుట్ నందు గోల్డ్ మెడల్ సాధించిన ప్రత్తిపాటి రూబేష్ బాబును అరుంధతి కాలనీవాసులు పలువురు అభినందించారు. ఇలాంటిక్రీడాకారులకు ప్రభుత్వం చేయూతను ఇస్తే ఇంకా క్రీడలలో రాణిస్తారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పోలీసుల సిబ్బందికి గ్రూప్ ఇన్సూరెన్స్



పోలీసుల బీమా నిమిత్తం రూ. 7,68,50,000 ప్రీమియం చెక్కును న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ అధికారులకు అందిస్తున్న డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా

**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పోలీసు సిబ్బందికి గ్రూప్ పర్సనల్ యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ పాలసీ పునరుద్ధరణలో భాగంగా రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, బెంగళూరుతో సోమవారం డీజీపీ కార్యాలయంలో జరిగిన ఒక కార్యక్రమంలో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం పోలీస్ కానిస్టేబుల్ నుండి డీజీపీ స్థాయి వరకు ప్రమాదవశాత్తూ మరణించిన వారికి వారి ర్యాంక్ ఆధారంగా రూ. 20 లక్షల నుండి రూ.45 లక్షల వరకు, హోంగార్డులకు రూ. 10 లక్షల రూపాయల వరకు ప్రమాద భీమా కల్పించడం జరుగుతుంది. అందుకు గాను రూ. 7,68,50,000 ప్రీమియం చెక్కును డీజీపీ హరీష్ కుమార్ గుప్తా న్యూ ఇండియా అస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్, బెంగుళూరు వారికి అందజేశారు. ఈ నగదురహిత పాలసీ నేటి నుండి అందుబాటులోకి రానుంది. సంవత్సర కాలం పాటు ఉంటుంది. పోలీసు శాఖ కొరకు నిర్విరామంగా సేవలు అందిస్తూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబ సభ్యులకు అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్ రవిప్రకాష్ సెక్రెటరీ భద్రత హరికుమార్, రాజన్, న్యూ ఇండియా అస్యూరెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## వడ్డీ వ్యాపారుల నుండి రైతులకు విముక్తి

### మనీ లెండింగ్ యాక్ట్ తెచ్చిన తెలంగాణ సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రైతులను రక్షించేందుకు రాష్ట్ర సర్కార్ మనీ లెండింగ్యాక్ట్ తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఈ యాక్టు 1349ను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. పంట పెట్టుబడుల కోసం తప్పని సరి పరిస్థితుల్లో అన్నదాతతలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. వడ్డీ వ్యాపారులు వేస్తున్న అధిక వడ్డీభారంతో రైతుల అప్పులు పెరిగిపోతున్నాయని, దీంతో అసలు, వడ్డీ కలిపి చెల్లించలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని గతంలో రాష్ట్ర రైతు కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో వాటిని తీర్చలేని అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. రైతు కమిషన్ నివేదికలోని పలు అంశాలను పరిగణనలోనికి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మనీలెండింగ్ యాక్ట్ అమలు కఠినంగా చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది.

## హిందూ మనోభావాలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడుతున్న షర్మిల

### ఎపి బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్



**విజయవాడ,సెప్టెంబరు 29,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ కాంగ్రెస్ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల రెడ్డి హిందూ మనోభావాలకు విఘాతం కలిగించే విధంగా మాట్లాడారని ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఆరోపించారు. టీటీడీ నిధులతో సుమారు 5 వేల దేవాలయాలు నిర్మాణం చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేశారని గుర్తు చేశారు. దేవాలయాల నిర్మాణాలు ఆర్ఎస్ఎస్ ఎజెండా అని షర్మిల వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. దేవాలయాలపై పరిజ్ఞానం లేకుండా, అవివేకంగా షర్మిల మాట్లాడారని విమర్శించారు. ఆమెకు దేవాలయాల వ్యవస్థపై ఎటువంటి అవగాహన, ఆలోచన లేదని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన సోమవారంమీడియాతో మాట్లాడారు.వైఎస్ షర్మిల జీవితంలో ఎప్పుడైనా దేవాలయాలను సందర్శించారా అని మాధవ్ ప్రశ్నించారు. మత ప్రచారాలు స్వయంగా భర్తతో కలిసి చేశారని ఆరోపించారు. మత మార్పిడి చేయాలని పెద్ద ప్రయత్నం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. టీటీడీపై షర్మిల చేసిన వ్యాఖ్యలపై సోనియాగాంధీ, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దివంగత మాజీ సీఎం రాజశేఖర్ రెడ్డి గతంలో ఏడుకొండలు మూడు కొండలుగా మార్చాలని జీవో ఇచ్చారని గుర్తు చేశారు. తిరుమల తిరుపతి నిధు లు ఎలాంటి దుర్విని యోగం అవ్వడం లేదని స్పష్టం చేశారు. నిధులను ఆలయాల నిర్మాణాలు, ధార్మికసంస్థల నిర్మాణం, ధూప దీప నైవేద్యం కోసం ఉపయోగించుకుంటున్నారని మాధవ్ వెల్లడించారు.

## రెండునెలల్లో అందుబాటులోకి టెర్మినల్ భవనం

### దేశంలోని ప్రధాన విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రికేఫేలు : కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు



యాత్రికేఫ్‌ను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి రామ్మెహన్‌నాయుడు, యంపి కేశినేని చిన్ని

**గన్నవరం, సెప్టెంబరు 29, ప్రభాతవార్త :** విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నిర్మిస్తున్న టెర్మినల్ భవన నిర్మాణం మరో రెండు నెలల్లో పూర్తిచేసుకుని ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుందని కేంద్రపౌరవిమానయాన మంత్రి కె.రామ్మోహన్‌నాయుడు తెలిపారు. విమానప్రయాణికులకు తక్కువ ధరకు నాణ్యమైన ఆహారం అందించే ఉడాన్ యాత్రికేఫేను సోమవారం ఉదయం విజయవాడ(గన్నవరం) విమానాశ్రయంలో మంత్రి ప్రారంభించి మాట్లాడుతూ సుదీర్ఘ కాలంగా నిర్మాణం జరుగుతున్న టెర్మినల్ భవనం నిర్మాణ పనులను వేగవతం చేసామని మరో రెండునెలల్లో పనులన్ని పూర్తవుతాయన్న నమ్మకాన్ని వ్యక్తంచేసారు. పది సంవత్సరాల క్రితం దేశంలో 74 విమానాశ్రయాలు ఉండగా దేశంలోని నగరాలకు ఎయిర్ కనెక్టివిటి పెంచాలని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయంవల్ల ప్రస్తుతం విమానాశ్రయాలు సంఖ్య 160కి చేరిందన్నారు. విమానయానాన్ని సామాన్య ప్రజల ప్రయాణ సాధనంగా మార్చేందుకు కేంద్రం పలు చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి వివరించారు. ఉడాన్ యాత్రికేఫేలను దేశంలోని ప్రధాన విమానాశ్రయాలన్నిటిలోనూ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు చెప్పారు. యంపి కేశినేని చిన్ని మాట్లాడుతూ విజయవాడ విమానాశ్రయం నుండి త్వరలో వారణాసి, అహ్మదాబాద్, కొచ్చిన్, పూణే తదితర నగరాలకు విమానసర్వీసులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఏఏఐ సభ్యులు డాక్టర్ హెచ్.శ్రీనివాస్, డాక్టర్ శరద్‌కుమార్ పాల్గొన్నారు.

**WARORA-KURNOOL TRANSMISSION LIMITED**
Warangal New S/s, Zaffergadh Mandal, Jangaon, Telangana- 506 252.
(Tel: +911204247182), CIN: U40300GJ2015PLC156122
**NOTICE FOR EXTENSION**
Warora-Kurnool Transmission Limited invites bids against enquiry no. **MDF/OPGW/25-26/0925** for the following package: **"Appointment of an agent to monetize dark fiber in the Optical Ground Wire infrastructure under a unified initiative"**
The due date for submission has been extended from 30.09.2025, 11.00 Hrs. to 15.10.2025, 11.00 Hrs. Bidders are advised to visit the Tenders section of www.zrc-in.com regularly for updates, addenda, or corrigenda. No separate notification shall be issued in this regard. The bid documents will be made available to interested bidders via e-mail- tenders@zrc-in.com.

ఏ1/103/2025 ది.29-09-2025

**ఫారం నెం: VI (ఎ)**

స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ) వారి కార్యాలయం పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం

(2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి సెక్షన్ 11(1) మరియు ఆంధ్రప్రదేశ్ నియమావళి 2014 లో రూల్ (19) సబ్ రూల్ (1) ననుసరించి)

**ప్రాథమిక ప్రకటన**

ఈ దిగువ షెడ్యూల్ లో చూపబడిన ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం, రామన్నపాలెం గ్రామం నందలి భూమి ప్రజాహిత కార్యాలకు అనగా **పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు క్రింద కూనవరం మండలం, వాల్ ఫోర్డ్ పేట గ్రామం లోని గిరిజన రైతుల నుండి సేకరించిన భూమికి బదులుగా, పునరావాస, పునస్థాపనల క్రింద, వారికి భూమిని కేటాయించు నిమిత్తము** భూమి అవసరమైనట్లు శ్రీ ప్రాజెక్ట్ ఆఫీసర్ మరియు ఆర్ అండ్ ఆర్ ఆఫీసర్ , చింతూరు ,అల్లూరి సీతారామరాజు జిల్లా వారు భావించినందున 2013, భూసేకరణ, పునరావాసం, పునఃస్థాపనలలో నిష్పాక్షిక నష్టపరిహారం పొందే హక్కు, పారదర్శకత చట్టం నందలి 11 వ విభాగపు 1వ ఉప విభాగములోని నిబంధనలననుసరించి ఈ విషయం గురించి ఇందుకు సంబంధించిన యావన్మందికి తెలియజేయడం కొరకు ఇందు మూలముగా నోటీసు జారీచేయబడినది.

పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ ప్రభావం మదింపు (ఇఐఏ) క్లియరెన్స్ భారత ప్రభుత్వం వారి అటవీ మరియు పర్యావరణ మంత్రిత్వ శాఖ వారి లేఖ నెం. జె-12011/74/2005-1ఎ1, తేది.25.10.2005 ప్రకారం జారీ చేయబడినది.

చట్టంలోని విభాగం 43 (1) క్రింద ప్రభావిత కుటుంబాలకు పునరావాసం మరియు పునస్థాపన కొరకు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ సాధారణ పరిపాలన శాఖ ది. 10.05.2020వ తేదిన జారీ చేసిన జి. ఓ.యం.యస్. నెం.42 ప్రకారం ప్రాజెక్టు నిర్వాహకులు నియమించబడినారు.

ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం, తూర్పుగోదావరి జిల్లా వారు చట్టంలోని విభాగము 12 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించేందుకు స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు , వారికి, వారి సిబ్బందికి ఇందుమూలముగా అధికారము యిచ్చియున్నారు.

పై చట్టంలోని సెక్షన్ 11(4) ననుసరించి, ఈ ప్రాథమిక ప్రకటన వెలువడిన తేదీ నుంచి ప్రత్యేక కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం/స్పెషల్ డిప్యూటీ కలెక్టరు (భూసేకరణ), పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, చింతూరు యూనిట్-I, చింతూరు వారి ముందస్తు అనుమతి లేనిదే ఏ వ్యక్తి ఈ ప్రకటనలో తెలిపిన భూమిని ఏ విధమైన అమ్మకం/కొనుగోలు (క్రయ, విక్రయాలు) లేదా ఏ విధమైన లావాదేవీలు జరపరాదని తెలియజేయడమైనది.

పై చట్టంలోని సెక్షన్ -15 ననుసరించి భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు / ఆక్షేపణలు ఉన్న యెడల సంబంధించిన వ్యక్తి/వ్యక్తులు ఈ ప్రకటనను ప్రచురించబడిన తేది నుండి 60(అరువది) దినములలోగా కలెక్టరు/ ప్రత్యేక కలెక్టరు, పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు, రాజమహేంద్రవరం వారి ఎదుట అభ్యర్థనలు దాఖలు చేసుకొనవచ్చును.

**షెడ్యూల్**

జిల్లా:ఏలూరు — మండలం : జీలుగుమిల్లి — గ్రామం : రామన్నపాలెం

| వరుస సంఖ్య | సర్వే నంబరు | భూమి తరగతి | మొత్తం విస్తీర్ణం | భూసేకరణ విస్తీర్ణం | రైతు పేరు(తండ్రి/ భర్త పేరు) | హద్దులు: తూర్పు | హద్దులు: పడమర | హద్దులు: ఉత్తరం | హద్దులు: దక్షిణం | చెట్లు, నిర్మాణాలు మొదలైనవి ఏవైనా ఉంటే వాటి వివరాలు. |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 |
| 1 | 26-1C | జ.డి | 4.38 | 4.38 | చక్రాతి సావిత్రి భర్త వెంకటేశ్వరరావు | 26-1B | 27 | 23 | 26-1D | పామాయిల్ ,బోర్-1 |
| Total | | | 4.38 | 4.38 | | | | | | |

సి.చంద్రశేఖర్
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్టు
చింతూరు యూనిట్-1
చింతూరు

సం/- యస్.సరళా వందనం
స్పెషల్ కలెక్టర్ (భూసేకరణ)
పోలవరం ఇరిగేషన్ ప్రాజెక్ట్, రాజమహేంద్రవరం

అభ్యుదయాన్ని సాధించాలి అంటే చరిత్రను పునరావృతం చేయడం కాదు. కొత్త చరిత్రను సృష్టించాలి.

- మహాత్మా గాంధీ

# చేతికందినా నోటికందలేదు!

జీ.ఎస్.టి 2.0తో అద్భుతాలు సృష్టించాల నుకున్న కేంద్ర ప్రభుత్వ వ్యూహానికి ఆదిలోనే హంసపాదు పడింది. కేవలం 5 శాతం, 18 శాతంగా రెండేరెండు శ్లాబ్‌లలో జనరల్ సేల్స్‌టాక్స్ పద్ధతి నిజంగానే అటు వ్యాపారస్తులకు కానీ వినియో గదారులకు వీలైన సహేతుక విధానం. గతంలో ఎన్నోరకాల పన్నులతో సుంకాలతో విసిగి వేసారిన వినిమయదారులు ఈసారి జిఎస్‌టి నూతన విధానంతో కాస్త తేలికపడ్డారనే చెప్పాలి.దీపావళి నుంచి జిఎస్‌టి శ్లాబులతో వస్తున్నట్లు ప్రకటించి ఆఘమేఘాల మీద అమల్లోకి తెచ్చేసరికి, దానిని పర్యవేక్షించే యంత్రాంగం సిద్ధంగా లేకపోవడంతో జిఎస్‌టి సౌకర్యాలు ప్రజలకు పూర్తిస్థాయి లో అందుబాటులోకి రాలేదు. ప్రభుత్వ ప్రయత్నాల లోపం వలన కేంద్రం ఆశించిన మేరకు జిఎస్‌టి 2.0 అక్కరకు రాలేదనే చెప్పాలి. చాలా నిత్యావసర వస్తువుల దుకాణాల్లో పాత సరుకుల చెలామణీ కాకుండా కొత్త సరుకులు తెప్పించుకోలేం కదా. పాత సరుకులకు పాత పన్నులు చెల్లించే తెచ్చాం కనుక పాత రేట్లకే ఇవ్వగల మని తగ్గింపులేమీ ఉండవని 'నో' చెప్పేస్తున్నారు. హతాశులై తిరిగిరావడం వినియోగదారుల వంతయ్యింది. తదుపరితరం వస్తుసేవల పన్నుల సంస్కరణలతో ఇప్ప టికిప్పుడు వినియోగదారులకు చౌకధరలకు సరకులు అందుతాయని, దాంతో వారు సంతుష్టలౌతారని ప్రధాని మోడీ అంచనా.కానీ క్షేత్రీయంగా చూస్తే అలాంటి ఆచూకీ ఏదీ కనబడడం లేదు. వాహనాలు, బైకులకు అయితే అవి లెక్కించుకునేందుకు అతి తేలికే కనుక వాటి మీద గతంలో వాహనం ఒక్కింటి అదనంగా చెల్లించిన జిఎస్‌టి భాగాన్ని తిరిగి డీలర్లకు జమ చేసే ఆలోచనా విధానంపై ఒప్పందం ఉన్నందున వాహనాలు, బైకుల మీద పెద్ద మొత్తంలోనే రాయితీ లభించింది. తక్కువ ధరకే వాహనాలు లభిస్తున్నాయి. తాజాగా ఈ కామర్స్ షాపుల్లో జిఎస్టీ తగ్గించి విక్రయాలు చేస్తున్నందున 25శాతం అమ్మకాలు పెరిగాయి. తక్కువ ధరకే వాహనాలు లభిస్తున్నాయి. కిరాణా సరుకుల విషయంలో ఎలాంటి 'చౌక' పాలు కనపడలేదు.దాంతో ప్రజలు జిఎస్టీ తగ్గింపు సౌకర్యం అందిపుచ్చుకోలేకపోయారు. జిఎస్‌టి పొదుపు ఉత్సవాలు సంతోష సంబరాలు పేరిట తగ్గింపుల నజ రానా కేవలం కార్లకే పరిమితమయ్యాయి. కిరాణా తది తర షాపులపై రూ.12లక్షల దాకా వచ్చే ఆదాయంపై పన్నులు మినహాయించినందున జిఎస్‌టికి సంస్కరణలు ప్రతి దుకాణాదారునికి లాభించాయని ప్రధాని మోడీ స్పష్టించారు. 2017లో ప్రారంభించిన జిఎస్‌టి సంస్కరణలతో ఒకే దేశం, ఒకే పన్ను పేరిట పన్నులను పునర్వి భజన చేశామని చెప్పారు. గతంలో రకరకాల పన్నులు సుంకాల వల్ల వ్యాపారులకు వినియోగదారులకు పన్నుల భారం పడేది. ఈ రీత్యా ప్రస్తుతం 2శ్లాబులే ఉంచారు. పన్నుల విధానం మీద ఏర్పడుతున్న అవరోధాలను తొలగించుకున్నారు. పన్ను సంస్కరణలతో సూక్ష్మ, చిన్నమధ్య తరహా పరిశ్రమలు సైతం ప్రయోజనం పొందుతాయి.వస్తూత్పత్తి మనమే చేసుకుంటాం కనుక జిఎస్‌టి సంస్కరణలు బాగా వినియోగపడడంతో లబ్ధి చేకూరుతుంది. గతంలో 12 శాతం పన్నుశ్లాబ్‌లగా ఉన్న 99శాతం వస్తువులను 5 శాతం పన్ను శ్లాబులోకి మార్చినట్లు తెలిపారు. ఫలితంగా ఆయా వస్తువుల ధరలు గణనీయంగా తగ్గుతాయనిప్రధాని దేశ ప్రజలందరికీ నచ్చచెప్పారు. క్షేత్రస్థాయిలో జిఎస్టీ అమలు చూసినప్పుడు కొత్తస్టాకు, పాత స్టాకు,పాత ధర, కొత్త ధర,పాత పన్ను,కొత్త పన్నులు. అనే అంశాలు వినియోగదారుని గందరగోళపరిచాయి.జిఎస్టీ రెండో అంకంతో రెండే శ్లాబుల పన్నుల విధానం స్వాగతించదగినవే.అధిక పన్ను రేటు శ్లాబ్‌లోకి చాలా వస్తువులే వెళ్లాయి. ఇలా తగ్గిన పన్నుభారం వినిమయదారునికి ఉద్దీపనగానేభావించాలి. ఎన్నో ప్రధానమైన వినియోగ వస్తువులు తక్కువ పన్ను విధానంలోకి మారడం వలన ఆయా ప్రభుత్వాలకి రాబడి తగ్గిపోయింది. ఆ రాబడిలోటును కేంద్ర ప్రభుత్వమే భరించేందుకు సిద్ధమై నందున రాష్ట్ర ప్రభుత్వాలు ఈ సంస్కరణలకు అంగీకరించాయి. పెట్రోలు, విద్యుత్ వంటివి జిఎస్టీ పరిధిలోకి రాలేదు. దీని వలన ఏ వర్గాల నుంచీ ఎలాంటి ఆందోళనలు లేకున్నాహడావుడిగా ప్రవేశపెట్టిన జిఎస్టీ విధానం ఇప్పుడిప్పుడే ప్రజలకుఅందుబాటులోకి వస్తోంది. చేనేతను జిఎస్‌టి తగ్గింపులోకి తీసుకురాకపోవడం వల్ల ఆయావర్గాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఉండగా అమలు చేస్తున్నట్లు ప్రకటించి, తక్షణ సౌకర్యం పొందగలరని ఆశపెట్టిన అంశాలకు సంబంధించి వినియోగదారులు అసంతృప్తిగా ఉన్నారు. వ్యాపారుల అధిక లాభాలను నియంత్రణ చేసే అధికార యంత్రాంగం కదలిరాకపోవడంతో పాత స్టాకున్నంత వరకు పాత ధరకేనన్న భావనతో వ్యాపారం సాగిస్తున్నారు. అమలులో కాస్త అటు ఇటూగా ఉన్నాసంక్షేమ బాటలకు అడుగులు పడడం మంచిదే. ఒకపక్క జిఎస్‌టి పొదుపు ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ సెప్టెంబరు 22 నుంచి కొన్ని వస్తువులకు మాత్రం 'ఆదా' ధరలకే లభిస్తున్నాయి. నిత్యావసర వస్తువులు సరుకుల ధరల విషయంలో వ్యాపారులెవరైనా అధికంగావసూలు చేస్తే తమకు ఫిర్యాదు చేయాలని అధికారులు హడావుడి చేయడమే తప్ప ప్రత్యేకించి చెక్ చేస్తున్న సందర్భాలేవీ కనపడటం లేదు. దీనికితోడు అక్టోబరు 16న ప్రధాని మోడీ తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ముఖ్యనేతలు తెలుగు రాష్ట్రాలలో జిఎస్టీ సంస్కరణోద్యమాన్ని ముందుకు తీసు కెళ్లేందుకు ఆయా ప్రాంతాల్లో పర్యటించడడం ఉత్సాహం కలిగించే విషయం.



సువాసన వెదజల్లే అత్తరులు, తళతళ మెరిసే అలంకారాలు, సంపదలు వీటన్నిటి కన్నా ఉత్తమ సంస్కారమే మంచి సంపద, మంచి అలంకారం.

అరిస్టాటిల్



పనిచేసే తత్త్వమూ, పని పట్ల విశ్వాసమూ విజయానికి మూలకారణాలు.

హెన్రీఫోర్డ్

# ప్రజావాక్కు



## సినిమా టిక్కెట్ ధరలు తగ్గించాలి

ఇటీవలి కాలంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమలో కొత్త సినిమాలు విడుదలైన తొలి మూడు రోజుల పాటు టికెట్ ధరలనుపెంచడం ఒకప్రధాన చర్చనీయాంశంగా మారింది. ఈవిధానం నిర్మాతలకు లాభదాయకమై ఉంటే, సామాన్య ప్రేక్షకులపై తీవ్రమైన భారాన్ని మోపుతోంది. నేటి తరం పెద్ద బడ్జెట్ సినిమాల నిర్మాణ వ్యయం భారీగా పెరగడంతో, తొలి వారాంతంలో అధిక ధరలు వసూలు చేసి పెట్టుబడి త్వరగా తిరిగిపొందాలని నిర్మాతలు ప్రయత్నిస్తున్నారు. అధిక టికెట్ ధరల వలన తొలి రోజు కలెక్షన్లు భారీగా నమోదై, సినిమా బ్లాక్‌బస్టర్‌గా ప్రచారం పొందుతుంది. సాధారణ మధ్యతరగతి కుటుంబం నాలుగు టికెట్లు కొనుగోలుచేయాలంటే, అధిక ధరలు భారంగా మారతాయి. ఫలితంగా వారు సినిమా చూడకపోవచ్చు లేదా ఓటీటీ విడుదల కోసం వేచి చూడవచ్చు. ఈ పరిస్థితి థియేటర్ యజమానులకు కూడా కష్టాలు తెస్తోంది

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## మండుతున్న లద్దాక్

లద్దాక్ తన అస్తిత్వంనిలుపుకోవడం కోసం మండుతోంది. తన వనరులపైన తన ఆధిపత్యం నిలుపుకోవడం కోసం మండుతోంది. తెలంగాణ ఏమో ఇతరుల ఆధిపత్యంకు వ్యతిరేకంగా కొట్లాడితే లద్దాక్ ఏమో తన స్వేచ్ఛ కోసం పోరాడుతుంది. కేంద్రం చేతిలో బంధి కావడం ఇష్టం లేక కొట్లాడుతోంది స్వేచ్ఛ వాయువులు పిల్చిన ఆ నెలలోకి అభివృద్ధి పేరుతో ఆధిపత్య ధోరణులు రాకూడదని పోరాడుతోంది.అభివృద్ధి సమ్మిళితంగా ఉండాలి అని ప్రాథమిక రంగం కేంద్రంగా అభివృద్ధి ఉండాలి.

- భారత అవినాష్, జనగామ

## గ్రామీణ వైద్యులకు శిక్షణ అవసరం

గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేద ప్రజలకు ప్రథమ చికిత్స చేస్తున్న ఆర్ఎంపి పిఎంపీల గ్రామీణ వైద్యులకు తెలంగాణ ప్రభుత్వం శిక్షణ తరగతులు నిర్వహించి గుర్తించాలి. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ఆర్ఎంపి పిఎంపీలకు శిక్షణ తరగతులను నిర్వహించేందుకు ఉత్తర్వులు జారీచేసి తరగతులు సైతం ప్రారంభించారు.కోర్టువివాదాల కారణంగా ఆగిపోయింది.

- ముడితనపెల్లి ప్రభాకర్, భూపాలపల్లి జిల్లా

## క్రమశిక్షణ పాటించాలి

ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా ప్రకృతి ప్రకోపాన్ని నిరోధించడం అసాధ్యం. కాని మానవ తప్పిదాలను తప్పించుకోవచ్చు. అయితే ప్రజలలో క్రమశిక్షణలోపిస్తే అదిప్రమాదాలకు, విషాదాలకు దారి తీస్తుంది. ఈలోపాలవల్ల ఎన్నో ప్రాణాలు గాలిలో కలసి పోతున్నాయి. కన్నవారికి కన్నీళ్లు మిగులుస్తున్నాయి. ఈ నెల 27న తమిళ సూపర్ స్టార్, తమిళ వెట్రి కజగమ్ అనే నూతన పార్టీని ప్రారంభించిన విజయ్ జోసెఫ్ తమిళనాడు లోని కరూర్‌లో తనమెగా మీటింగ్ పెట్టిన సందర్భంలో వేలకు పైగా అభిమానులు గుమ్మిగూడారు. ఒకపద్ధతి ప్రకారం పాటించవలసిన క్రమశిక్షణ లోపం ద్వారా తొక్కిసలాట జరిగి ఇప్పటికీ 39 మంది మరణించగా మరో50మందికి పైగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారు. పరిహారాలు ఇస్తారు. పోయిన ప్రాణాలను తిరిగి తీసుకురాలేరెవరు. ప్రభుత్వాన్ని, పోలీసు యంత్రాగాన్ని బాధ్యతను పాటించని ప్రజలు మాత్రమే తిట్టి పోస్తారు.

- ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

## బతుకమ్మ పాటలనే పాడుకుందాం

ప్రకృతిలోని పూలను బతుకమ్మగా పేర్చి భక్తితో గౌరమ్మను కొలుసుకుంటూ చారిత్రాత్మక కథలను తీరొక్క పాటలుగా అల్లి గుండ్రంగా బతుకమ్మ సుట్టూ అమ్మలక్కలు సేరి సప్పట్లు కొడుతూ ఆడే ఆట బతుకమ్మ ఆట.. గిప్పుడేమో బతుకమ్మ కాడా పొంతనలేని గేయాలేట్టి..మన ఆచార సాంప్రదాయాలను మంటగలుపుతున్నారు. ఈ బతుకమ్మ పాటల్లో ఎంతో అంత రార్థం దాగి ఉందనే విషయాన్ని తెల్వకపాయే. ఎన్నో ఒడిదుడుకులతో సాగిన కుటుంబం మానవీయ విలువలతో దాగి ఉండేటి పాటలు ఒగ్గేసి ఇష్టం అచ్చినట్లు సౌండ్ బాక్స్‌ల్లో పాటలు పెట్టి ఎగురుతున్నారు.ఇకనైనా బతుకమ్మ పాటలను పాడుకొని ఆడుకుందాం మానవ బంధాలను పెంచుకుందాం.

-కాల్వ నిఖిత, సిద్ధిపేట

## జనావాసాలకు దూరంగా మద్యం షాపులు

ఇటీవల ఏపిలో కొత్తగా ఏర్పాటుచేసిన మద్యం విక్రయ కేంద్రాలు కొన్ని నగరాలలో జన వాడల మధ్య ఉంటున్నాయి.దీనికి తోడు వివిధ జంక్షన్‌లోకి వచ్చేజనం ఆమార్గం గుండా వస్తారు. మద్యం సేవకులు మోతాదు ఎక్కువై అక్కడ ఇతరుల తో ఘర్షణలు శృతిమించి కొట్టుకుంటూ ఆ దృశ్యం భయం కలుగుతున్నది. ఇకపై కొత్త షాప్ లకు ప్రదేశం కాస్త దూరంగా ఉంటే ఈ సమస్య కొంత తగ్గుతుంది.

-బొల్లోజు మేఘానాథ్, విశాఖపట్నం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)


# 'ప్రాథమిక విద్య'కు గాంధీజీ పరిష్కారాలే శరణ్యం

**గాంధీజీ ప్రతిపాదించిన విద్యా విధానాన్ని స్వాతంత్ర్యం సమపార్జనంతరం అమలుపరిస్తే ఏనాడో మన దేశం సంపూర్ణ అక్షరాస్యత సాధించి అభివృద్ధి చెందిన దేశాల సరసననిలిచేది. విద్యార్థుల్లో విలువలు అభివృద్ధి చెంది నేటి విషసంస్కృతి విస్తరించేది కాదు. పని విద్య అమలువరచడం ద్వారా పిల్లలకు పనిపట్ల గౌరవం సమకూరేది.నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడేది చదువుతో పూర్తిప్రయోజనం పొందేవారు 'మాతృ భాషలోనే ప్రాథమిక విద్యా బోధన' అని నిర్దుష్టంగా సిఫారసు చేసినందున కొనసాగుతున్న వివాదానికి ఏనాడో పరి ష్కారం చేకూరేది. స్వాతంత్ర్యానంతరం ప్రాథమిక విద్యారంగ ప్రాముఖ్యత గుర్తించి ఎన్నో కమిషన్లు కమిటీలు వేసినా మరెన్నో సిఫార్సులు చేసిన మౌలిక సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నవి.**



కొల్లు మధుసూదన రావు

స్వాతంత్ర్యం సముపార్జించుకొని 78 సంవత్సరాలు గడిచినా బ్రిటిష్ వారు రూపొందించిన విద్యా విధానమే నేటికి కొనసాగుతున్నది. విద్యారంగానికి మూలమైనది ప్రాథమిక వ్యవస్థ. అది పటిష్టవంతంగా ఉన్నప్పుడే యావత్ విద్యారంగం ఆదర్శవంతంగా, అభ్యుదయకరంగా ఉంటుంది. కానీ ప్రధానమైన సమస్యలు నేటికీ కొనసాగడం విచారకరం. బ్రిటిష్ విద్యా విధానానికి ప్రత్యామ్నాయంగా మహాత్మా గాంధీజీ 1937లో బేసిక్ ఎడ్యుకేషన్ 'నయీ తాలీమ్' అనే నూతన విద్యావిధానాన్ని ప్రతిపాదించారు. ఈ వ్యవస్థను ప్రత్యక్షంగా అమలుచేయని కారణాన ప్రాథమిక విద్యా రంగంలో అతి మౌలికమైన, ప్రధానమైన సమస్యలు నేటికీ కొనసాగడం అత్యంత దురదృష్టకరం. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో 6 నుండి 14 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికీ ఉచిత, నిర్బంధ, ప్రాథమిక హక్కు అందించాల్సిన బాధ్యత రాజ్యంపై ఉందని పేర్కొనినా, ఉచిత నిర్బంధ విద్యాహక్కుకు బాలల హక్కు చట్టం 2009లో 35 ఆఫ్ 2009 రూపొందించినా అమలులో ఘోరంగా విఫలమయ్యాం. భారతదేశ అక్షరాస్యత రేటు 2023-24లో 80.9 మాత్రమే, ఇంకా మనదేశంలో 19.1 నిరక్షరాస్యులుగానే కొనసాగుతున్నారు. సాక్షర భారతం సాకారం చేసుకోలేకపోయాం. మనకన్నా అతి చిన్న వెనుకబడిన దేశాలు అండోర, గ్రీన్ లాండ్, నార్వే, లక్సెంబర్గ్, నార్త్ కొరియా,యుక్రెన్, యుజిబికిస్థాన్ మొదలగునవి సంపూర్ణ అక్షరాస్యత సాధించడమైనది. మన దేశంలో చదువుకున్నందువల్ల పూర్తి ప్రయోజనం కలగడం లేదని, బతుకు తెరువు చూపడం లేదని. జీవనోపాధికి తోడ్పడడం లేదని, నిత్య జీవితానికి ఉపయోగపడడం లేదనే భావనతో పిల్లలు వివిధ దశలలో చదువుకు స్వస్తి చెప్పి నిరుద్యోగులుగానే కాదు నిష్ప్రయోజకులుగా సమాజానికి భారంగా రూపొందుతున్నారు. మానవ జీవితం అత్యంత ఉన్నతమైనది, ఉద్దేశపూర్వకమైనది. భారతీయ సంస్కృతి సామాజిక నిబంధనలతో కూడిన వేల సంవత్సరాల ఆచారాలు, సాంప్రదాయాలు, ఆధ్యాత్మిక విశ్వాసాల సమ్మేళనం. ఇది జన్మనిచ్చిన తల్లిదండ్రులు, పెరిగిన ప్రాంతం, ఎదిగిన వాతావరణంలో అలవడుతుంది. ఒక వ్యక్తి భావనతో కూడి విలువల ప్రాధాన్యత వ్యక్తమవుతుంది.వారి ప్రవర్తన సంబంధాలు పెంపొందించి జీవితంలో ఉపయోగపడతాయి. విద్యార్థులకు అలవడాల్సిన విలువలు సత్యము, సత్ప్రవర్తన, శాంతి, ప్రేమ, అహింస,నిజాయితీ, సమైక్యత, సహకారం, క్రమశిక్షణ, సృజనాత్మకత, సేవా దృక్పథం మొదలగునవి. బాల్యంలోనే విలువలు అంకురిస్తాయి. తల్లిదండ్రులు సహాయకుల్ని చూసి, విని తెలుసుకొని ఎదుగుతాయి. ప్రస్తుతం విష సంస్కృతి విస్తరిస్తోంది. పిల్లలు నైతిక విలువలు కోల్పోయి విద్వేషాలు, వివక్షతలతో, క్రమశిక్షణరాహిత్యం, అవినీతి అక్రమాలు, అసత్యానికి అలవాటుపడి నీతి బాహ్య చర్యలకు పాల్పడుతున్నారు, నేరస్తులుగా మారుతున్నారు. అత్యధిక తల్లిదండ్రులకు ఒకే సంతానంతో అల్లారుముద్దుగా పెంచుతున్నారు. పిల్లల కోరికలుఎటువంటివైనా తీర్చుతున్నారు.ఇప్పుడు పిల్లల ప్రపంచాన్ని ట్యాబ్ లు టి.విలు ఆక్రమిస్తున్నాయి. ఆన్లైన్‌కు అడిక్ట్ అవుతున్నారు. స్మార్ట్‌ఫోన్లు, పోర్న్ సైట్లల అశ్లీలాన్ని చూసి పిల్లల మనసులో విషం నింపుకొని, రేప్‌లు, హత్యలు దొంగతనాలకు, బ్యాంకు దోపిడీలలో పాల్గొంటూ పిల్లలు నేరస్తులుగా రూపొందుతున్నారు. పిల్లలకు సంస్కృతి, నైతిక విలువలు ఇప్పుడు పాఠశాలలోనే ప్రారంభించాల్సి వస్తుంది. దీనికి



తల్లిదండ్రులు సహకారం అందించాలి. నైతిక విలువలు పెంపు జరగాల్సింది పాఠశాలలోనే, బోధించాల్సింది ఉపాధ్యాయులు. విలువలు అంటే వ్యక్తికి ప్రయోజనం కలిగించేలా ఇతరులకు హాని కలగకుండా ఉండాలి. గాంధీజీ ప్రతిపాదించిన ఆదర్శ, ఆచరణాత్మక విద్యప్రబోధనలు, నిర్బంధ సార్వత్రిక విద్య, మాతృభాషలోనే ప్రాథమిక విద్య, అక్షరాస్యత మాత్రమే కాదు స్వావలంబన, విద్య విలువల్ని పెంపొందించాలి, విద్య ద్వారా బాధ్యత గల పౌరునిగా పిల్లల్ని రూపొందించాలి, పిల్లల శారీరక, మానసిక ఆత్మవిశ్వాసం అభివృద్ధికి తోడ్పడాలి. పని, విద్యా ద్వారా ఉత్పాదిక కార్యక్రమంలో పని అనుభవం చేకూర్చి భావి జీవితానికి తోడ్పడాలి. విద్యా స్వావలంబనకు అవకాశం కల్పించి స్వతంత్రంగాను జీవనభృతి సాధించేలా ఉండాలి.మన విద్యా విధానంలో గాంధీజీ ప్రతిపాదించిన విధానాలు ప్రత్యక్షంగా అమలు చేయలేదు కానీ భారతీయ విద్యా రంగంలో అమలుపర్చిన విధానం పద్ధతులను గణనీయంగా ప్రభావితం చేశాయి. సంపూర్ణ అక్షరాస్యత సాధనకు సర్వ శిక్ష అభియాన్, సమగ్ర శిక్షఅభియాన్, బాలల హక్కుచట్టం 2009 మొదలగు కార్యక్రమాలు చేపట్టినా సంపూర్ణంగా సాధించకుండానే నిలిపివేశారు. భారత స్వాతంత్ర్యం కఠినమైన ప్రస్థానంలో ఉంది. సమాజంలో అన్ని విలువలు అణగారిపోతున్నవి గతంలో పాఠశాలల్లో మోరల్ పిరియడ్లు వారానికి ఒకటి రెండు ఉండేవి. వాటిలో నీతి కథలు చెప్పెవారు. పాఠ్యాంశాలల్లో సుమతి, వేమన మొదలగు నీతిశతకాల పద్యాలు బోధించేవారు వాటి ద్వారా నీతి బోధన జరిగేది భావి పౌరుల్ని ఉత్తమ విలువలతో రూపొందించాలి. రోజురోజుకి విలువలు దిగజారుతున్న తరుణంలోఉపాధ్యాయులు క్రియాశీల పాత్ర వహించాలి. నైతిక విలువలను పిల్లలు నీతి కథలు ద్వారానేర్చుకుంటారని టొరంటో విశ్వవిద్యాలయం పరిశోధనలో వెల్లడించడమైనది. మన దేశ నైతికసంపద పంచ తంత్రం 50 భాషలకు అనువదించబడింది. వీటిద్వారా సంస్కారమంతమైనసంపద, సంస్కృతి పలు దేశాల్లో ప్రాచుర్యంపొంది, సంరక్షణకు ఇది తోడ్పడుతుంది.వీటిని మన పాఠ్యాంశాల్లో చేర్చాలి. పాఠశాల స్థాయిలో నీతి బోధనకు ప్రతిరోజు ఒక పీరియడ్ కేటాయించాలి.నూతన సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన కొత్త ఆవిష్కరణలు, నైపుణ్యాలు విధానాలను విద్యారంగంలో కూడా వినియోగించుకోవాలి. స్మార్ట్‌ఫోన్, డిజిటల్ టి.వి, కృత్రిమ మేధ, ప్రోగ్రామింగ్ మొదలగునవి సద్వినియోగం చేసుకుంటే సౌలభ్యం,సౌకర్యం,సౌగమ్యం,సౌముఖ్యం పరిజ్ఞానం మొదలగునవి సమకూరుతాయి. కానీ పిల్లలు సెల్‌ఫోన్, టి.వి. మొదలగు వాటిని దుర్వినియోగం చేయడంతో దుష్ప్రవర్తన, హింస,క్రమశిక్షణారాహిత్యం, చెడు విలువలు, దురాశ, దుర్మార్గానికి, దొంగతనానికి, హత్యలకు పాల్పడం జరుగుతుంది. పిల్లలు సెల్‌ఫోన్లు, ట్యాబ్లు వినియోగించకుండా కాపాడాలి లేదా పర్యవేక్షణలో వినియోగించేలా చూడాలి. దీనికి తల్లిదండ్రుల సహకారం స్వీకరించాలి. గాంధీజీ ప్రతిపాదిం చిన పని విద్యను ప్రత్యక్షంగా అమలు చేయకపోయినా కేంద్ర ప్రభుత్వం నియమించిన వివిధ కమీషన్లు, కమిటీలు కొఠారి కమిషన్ (6466) ఈశ్వరీబాబు పటేల్ కమిటీ (1977) మాల్కం ఆదిశేషయ్య కమిటీ (1977) వి.ఆర్.రెడ్డి కమిటీ (1980) పని విద్యకు ప్రాముఖ్యత కల్పించాలని, పాఠ్యాంశాల్లో భాగంగా ఉండాలని, వారానికి 6 గంటలు కేటాయించాలని సిఫార్సు చేసినా, సిఫార్సులు కాగితాలతో పరిమితం అయ్యాయి కానీ అమలుకు నోచుకోలేదు.గాంధీజీ ప్రతిపాదించిన విద్యావిధానాన్ని స్వాతంత్ర్యం సమపార్జనంతరం అమలుపరిస్తే ఏనాడో మన దేశంసంపూర్ణ అక్షరాస్యత సాధించి అభివృద్ధి చెందిన దేశాల సరసననిలిచేది. విద్యార్థుల్లో విలువలు అభివృద్ధి చెంది నేటి విషసంస్కృతి విస్తరించేది కాదు.పని విద్య అమలుపరచడం ద్వారా పిల్లలకు పనిపట్ల గౌరవం సమకూరేది.నిరుద్యోగ నిర్మూలనకు తోడ్పడేది చదువుతో పూర్తిప్రయోజనం పొందేవారు "మాతృ భాషలోనే ప్రాథమిక విద్యా బోధన' అని నిర్దుష్టంగా సిఫా రసు చేసినందున కొనసాగుతున్న వివాదానికి ఏనాడో పరి ష్కారం చేకూరేది. స్వాతంత్ర్యానంతరం ప్రాథమిక విద్యారంగ ప్రాముఖ్యత గుర్తించి ఎన్నో కమిషన్లు కమిటీలు వేసినా మరెన్నో సిఫార్సులు చేసిన మౌలిక సమస్యలు నేటికీ అపరిష్కృతంగానే ఉన్నవి. గాంధీజీ ప్రతిపాదించిన విద్యా విధానం నిర్దిష్టంగా, నిర్మాణాత్మకంగా అమలు పరిస్తే మౌలిక సమస్యలల్ని పరిష్కృతమై అత్యంత కీలకమైన ప్రాథమిక విద్యారంగం సమాజ సంరక్షణకు అభివృద్ధికి తోడ్పడి భాసిల్లే అవకాశం సమకూరుతుంది. ●

# రీసర్వే పారదర్శకం కావాలి

తరిగోపుల నారాయణస్వామి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో భూముల రీ సర్వే ప్రారంభించి ఐదేళ్లకు పైగా అవుతున్నా ఇంకా పూర్తిస్థాయిలో ఫలితాలు ప్రజలకు అందుబాటులోకి రాకపోవడం ఒక ముఖ్య సమస్యగా కనిపిస్తోంది. ఈ కార్యక్రమం ప్రభుత్వ ఉద్దేశ్యం ప్రకారం సాగి ఉంటే, భూముల యజమానులు ఆన్‌లైన్‌లో సులభంగా తమ రికార్డులు పొందగలిగేవారు. కానీ వాస్తవ పరిస్థితి ఏమిటంటే, చాలా మంది రైతులు ఇంకా ప్రతిసారి పంట రుణం రీన్యువల్ చేయాలంటే లేదా భూమి లావాదేవీలు జరపాలంటే తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. గ్రామాలలో రీ సర్వే పూర్తయ్యాక అధికారులు రైతులకు రసీదులు ఇచ్చి, ఏమైనా అభ్యంతరాలు ఉంటే నిర్దిష్ట సమయంలో రాతపూర్వకంగా తెలియచేయాలి. చాలా గ్రామాల్లో రైతులు ఎటువంటి అభ్యంతరాలు తెలపలేదు. అంటే రికా ర్డులు పూర్తిస్థాయిలో ఖరారయ్యాయి. అయితే ఈ రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడం వల్ల ప్రజలకు ఉపయోగం తక్కువగానే మిగిలింది. ప్రస్తుత పరిస్థితిలో ఒక రైతుపంట రుణం రీన్యువల్ చేసుకోవాలంటే తహసీల్దార్ దగ్గరికి వెళ్లి రాతపూర్వకంగా వన్ బి పొందాలి. ఇది ఒక విధంగా ప్రభుత్వ డిజిటలైజేషన్ ఉద్దేశ్యానికి విరుద్ధం. ముందుగా ప్రజలు మీ సేవ లేదా మీభూమి ద్వారా సులభంగా రికార్డులు పొందగలిగారు. ఇప్పుడు రీ సర్వే పూర్తయ్యాక కొత్త రికార్డులు సరిగా అప్‌డేట్ కానందువల్ల ఆ సౌలభ్యం లేకుండాపోయింది. భూమి యజమానులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్లో ముఖ్యమైనది సమయం, డబ్బు వృథాకావడం. ప్రతిసారి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లడం రైతులపై అదనపు భారమవుతోంది.ఇది గ్రామీణ ప్రజానీకానికి పెద్ద సమస్యగా మారింది. పంట పనులు చూసుకోవడమో, ఇతర కూలి పనుల కోసం వెళ్ళడమో చేయాల్సిన రైతులు ఇలా కార్యాలయాల చుట్టూ తిరగాల్సి రావడం అనవసరమైన ఇబ్బంది. రీ సర్వే అనేది చాలా ముఖ్యమైన సంస్కరణ. దశాబ్దాలుగా కొనసాగుతున్న భూముల వివాదాలు, అశుద్ధ రికార్డులు, పక్కా హద్దులు లేని సమస్యలు తొలగించడానికి ఇది గొప్ప ప్రయత్నం.ప్రజలకు ఖచ్చితమైన హక్కుపత్రాలు ఇవ్వ




డం, భూమి వివాదాలను తగ్గించడం ఈకార్యక్రమంప్రధాన లక్ష్యం. కానీ పూర్తి చేసిన రికార్డులను తక్షణమే ఆన్‌లైన్‌లో ఉంచకపోతే ఈ ప్రయోజనం రైతులకు చేరదు. ప్రజల అంచనాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. ఒకసారి రీ సర్వే పూర్తయ్యాక ఎలాంటి అభ్యంతరాలు లేవంటే, ఆ రికార్డులు వెంటనే అందుబాటులో ఉండాలి. రైతులు తాము యజమానులమని నిరూపించుకోవడానికి మళ్లీ మళ్లీ అధికారులను సంప్రదించాల్సిన అవసరం ఉండకూడదు. ఇది మాత్రమే కాకుండా, కొత్తగా భూములు అమ్ముకోవాలనుకున్నా లేదా పంట రుణాలు తీసుకోవాలనుకున్నా సులభతరం కావాలి. ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా పూర్తి చేసి, రికార్డులు అందుబాటులో ఉంచితే రైతులపై నమ్మకం పెరుగుతుంది. లేకపోతే ప్రభుత్వం చేసిన రీ సర్వే పేరు మీద కొత్త సమస్యలు మాత్రమే వచ్చాయని ప్రజలు భావిస్తారు. కాబట్టి ఆలస్యాలు తగ్గించి పూర్తి అయిన గ్రామాల రికార్డులను వెంటనే ఆన్‌లైన్‌లో ఉంచడం అత్యవసరం.ఈసమస్య పరిష్కారం కోసం అధికారులు కొన్ని చిన్న చర్యలు తీసుకుంటే పెద్ద మార్పు వస్తుంది. గ్రామాల వారీగా రీ సర్వే పూర్తి అయిన వెంటనే ఆ గ్రామానికి సంబంధించిన వన్ బి, అడంగళ్, ఎల్పీ నంబర్లు, పటాలు అన్నీ మీ సేవ లేదా మీభూమి లాంటి వెబ్‌సైట్లలో అప్డేట్ చేయాలి. అలాగే బ్యాంకులకు కూడా ఈ డిజిటల్ రికార్డులు చెల్లుబాటు అయ్యేలా మార్పులు చేయాలి. ప్రభుత్వం ఈ సమస్యను ఒక అవకాశంగా తీసుకుంటే రైతులకు మాత్రమే కాకుండా మొత్తం వ్యవసాయ రంగానికి కూడా ఊరటనిస్తుంది. డిజిటల్ రికార్డులు అందుబాటులోకి రావడంవలన భవిష్యత్తులో వివాదాలు తగ్గుతాయి,భూమి విలువ పెరుగుతుంది. పంట రుణాలు తేలికగా లభిస్తాయి. ఇవన్నీ కలిపి గ్రామీణాభివృద్ధికి దోహదం చేస్తాయి. గ్రామీణ ప్రజానీకం కూడా ఈ అంశంలో చైతన్యం కలిగి ఉండాలి. రీ సర్వే పూర్తయినా రికార్డులు ఆన్‌లైన్‌లో కనిపించకపోతే అధికారులు దగ్గర ప్రశ్నించాలి, ఫిర్యాదులు చేయాలి. పత్రికలలో, సమావేశాలలో, సంఘాల ద్వారా ఈ సమస్యను ప్రస్తావించాలి. అప్పుడు మాత్రమే ఈ వ్యవస్థ వేగంగా పనిచేస్తుంది. రాష్ట్ర స్థాయిలో ప్రభుత్వానికి ఇది పెద్ద సవాలు. ఒకవైపు పారదర్శకతను చూపించాలి, మరోవైపు రైతుల నమ్మకాన్ని పొందాలి. ఈ రెండు లక్ష్యాలను సాధించడానికి అత్యవసరంగా అవసరమైనది పూర్తి చేసిన రికార్డులను వెంటనేప్రజలకు అందుబాటులో ఉంచడం. రీ సర్వే విజయవంతమయ్యిందని చెప్పుకోవాలంటే ఇది తప్పనిసరిగా జరగాలి. ●

# రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ: మహత్తర ఘట్టం

రామ కిష్టయ్య సంగన భట్ల

స్వతంత్ర భారతదేశంలో రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఒక రాజకీయ, సాంస్కృతిక, పరిపాలనా ప్రస్థానమే కాక, దేశ సమాఖ్య నిర్మాణానికి పునాది వేసిన చారిత్రాత్మక పరిణామం. బ్రిటీష్ పాలనలో ఏర్పడిన ప్రావిన్సులు, సంస్థానాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు స్వాతంత్ర్యం వచ్చిన తరువాత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేవు. ఆ విభజనలో పార్ట్ ఏ లోని అస్సాం, బీహార్, బొంబాయి, తూర్పు పంజాబ్, మధ్యప్రదేశ్, మద్రాస్, ఒడిశా, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ వంటి బ్రిటీష్ ప్రావిన్సులు, పార్ట్ బిలోని సంస్థానాలు,పార్ట్ సిలోని చిన్న ప్రాదేశిక పాలనాయూనిట్లు, పార్ట్ డి వంటి ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతాలు అన్నీ సామ్రాజ్య అవసరాలఆధారంగా కూర్చబడ్డాయి.స్వాతంత్ర్యం వచ్చిన వెంటనే ప్రజలలో భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటుకై డిమాండ్లు పెరిగాయి. కాంగ్రెస్ పార్టీ 1920లో నాగపూర్ సమావేశంలోనే భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటును సమర్థించింది. అయితే దేశ విభజనలో జరిగిన రక్తపాతం, వలసల కల్లోలం దృష్ట్యా నెహ్రూ, పటేల్ వంటి నాయకులు కొత్త రాష్ట్రాల ఏర్పాటులో జాగ్రత్త వహించారు. 1948లో ఏర్పాటు చేసిన ధార్ కమిషన్, తదనంతరం నెహ్రూ, పటేల్, పట్టాభి సీతా రామయ్యలతో కూడిన జేవీపీ కమిటీలు భాషా ప్రాతిపదిక సరికాదని, ఇప్పుడే రాష్ట్రాలను పునర్వ్యవస్థీకరించడం సమంజసం కాదని తేల్చాయి. కానీ ప్రజల ఆకాంక్షలు ఆగలేదు.తెలుగు ప్రాంత ప్రజలు తమ రాష్ట్రం కోసం గళమెత్తారు. పొట్టి శ్రీరాములు 1952లో ఆంధ్రరాష్ట్రం కోసం చేపట్టిన నిరాహార దీక్షలో 58 రోజుల తరువాత ప్రాణత్యాగం చేయడం ఉద్యమాన్ని ఉధృతం చేసింది. ఆ త్యాగ ఫలితంగా 1953 అక్టోబర్ 1న మద్రాస్ నుండి విడిపోయి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడింది. ఇది స్వతంత్ర భారత దేశంలో భాషా ప్రాతిపదికన ఏర్పడిన తొలి రాష్ట్రం. ఈ పరిణామం ఇతర భాషా ప్రాంతాలకూ స్ఫూర్తినిచ్చింది. మహారాష్ట్ర కోసం మరాఠీలు, గుజరాత్ కోసం గుజరాతీలు, పంజాబ్ కోసం సిక్కులు, మైసూరు కోసం కన్నడిగులు ఉద్యమాలు చేపట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 1953 డిసెంబర్ 29న రాష్ట్రాల పునర్వ్య



వస్థీకరణ కమిషన్‌ను నియమించింది. న్యాయమూర్తి ఫజల్ అలీ అధ్యక్షతన, సభ్యులు పణిక్కర్, కుంజ్రూ పాల్గొన్న ఈ కమిషన్ 1955 సెప్టెంబర్ 30న నివేదిక సమర్పించింది. ఇందులో పార్ట్ ఎ,బి,సి వర్గీకరణలు రద్దు చేయాలని, సంస్థానాల ప్రత్యేక హక్కులు తొలగించాలని, చిన్న రాష్ట్రాలను విలీనం చేయాలని, భాషా, భౌగోళిక, ఆర్థిక అంశాలను సమన్వయం చేస్తూ రాష్ట్రాల కొత్త రూపకల్పన జరగాలని సూచించింది. ఈ నివేదిక ఆధారంగా 1956లో పార్లమెంట్ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ చట్టం ఆమోదించి, ఏడో సవరణ రాజ్యాంగంలో అమలులోకి తెచ్చింది. 1956 నవంబర్ 1న 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాలు ఏర్పడ్డాయి. ఈ పునర్వ్యవస్థీకరణలో ఆంధ్ర, రాయలసీమ, తెలంగాణ కలసి ఆంధ్రప్రదేశ్ ఏర్పడింది. భాషా ప్రాతిపదికన రాష్ట్రాల ఏర్పాటు ప్రజల్లో సాంస్కృతిక, భాషా గౌరవాన్ని బలపరిచింది. స్థానిక సమస్యల పరిష్కారానికి సమర్థవంతమైన పాలన సాధ్యమైంది. కానీ ఈ ప్రక్రియలో ప్రాంతీయత, విభజన వాదనలు కూడా పుంజుకున్నాయి. బొంబాయి రాష్ట్ర విభజనలో మహారాష్ట్ర గుజరాత్,పంజాబ్ విభజనలో భాషామత సమస్యలు, అస్సాం విభజనలో ఈశాన్య గుర్తింపు కోసం ఉద్యమాలు చోటుచేసుకున్నాయి. అయినప్పటికీ రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రజాస్వామ్య పటిష్టతకు దోహదపడింది. రాష్ట్రాలు వరుసగా ఏర్పాటులో మహారాష్ట్ర, గుజరాత్ 1960లో, నాగాలాండ్ 1963లో, హర్యానా 1966లో, మణిపూర్, త్రిపుర, మేఘాలయం 1972లో, సిక్కిం 1975లో, మిజోరాం, అరుణాచల్ ప్రదేశ్ 1987లో,గోవా అదే ఏడాది,ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ 2000లో, తెలంగాణ 2014లో ఏర్పడ్డాయి. 2019లో ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూ కాశ్మీర్ రాష్ట్రం రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మారింది. ప్రస్తుతానికి దేశం 28 రాష్ట్రాలు, 8 కేంద్రపాలిత ప్రాంతాలుగా ఉంది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ఒక నిరంతర ప్రక్రియ. ఇది ప్రజల ఆకాంక్షలు, ప్రాంతీయ అవసరాలు, రాజకీయ పరిణామాలు కలగలసిన జీవం. భాషా గౌరవం, స్థానిక అభివృద్ధి, పాలనా సమర్థత వంటి లాభాలు లభించినప్పటికీ వనరుల పంపిక, ప్రాంతీయ వాదనలు వంటి సవాళ్లు కూడా ఎదురయ్యాయి. అయినప్పటికీ ఫజల్ అలీ కమిషన్ నివేదిక, 1956 చట్టం, పొట్టి శ్రీరాముల త్యాగంవంటి ఘట్టాలు భారతప్రజాస్వామ్య చరిత్రలో అచెంచలంగా నిలిచిపోయాయి.రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ ప్రజల భాషాసాంస్కృతిక వ్యక్తిత్వానికి, సమాఖ్య ఐక్యతకు అద్దం పట్టిన చారిత్రక ఘట్టమని చెప్పాలి. ●

Main tab page 111_Main tab page 111.qxd 9/30/2025 12:55 AM Page 1



## చీమకుర్తిలో వార్డుల పునర్విభజన ముసాయిదాని విడుదల చేసిన కమిషనర్

### - 20 వార్డుల నుంచి 27కు పెరుగుదల

**చీమకుర్తి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**



చీమకుర్తి మున్సిపాలిటీలో వార్డులను పునర్విభజన చేస్తూ ముసాయిదా విడుదల అయింది. చీమకుర్తి కమిషనర్ వై.రామకృష్ణయ్య ఈ మేరకు నోటీసులను అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోమవారం తమ సిబ్బందితో అందుబాటులో ఉంచారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటివరకు ఉన్న 20 వార్డులను 27 వార్డులుగా పెంచుతూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని కమీషనర్ అన్నారు. ఈ వార్డుల విభజన చీమకుర్తి పట్టణంలోని ఉత్తరం వైపు నుంచి ప్రారంభమై తూర్పు దక్షిణం తర్వాత పడమటి దిశ వరకు 27 ఎన్నికల వార్డులుగా నిర్ణయించడం జరిగిందన్నారు. ఆయా వార్డులకు హద్దులను నిర్ణయిస్తూ విడుదల చేసిన ఈ ముసాయిదాను మునిసిపల్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం ల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచామని తెలిపారు. ప్రజలు ఈ వార్డుల పునర్విభజనపై సలహాలు సూచనలను వచ్చే నెల 6వ తేదీ లోపుగా కమిషనర్ కార్యాలయంలో తెలియజేయాల్సిందిగా కోరారు.

## వేమా యల్లయ్య సేవలు మరువలేనివి

**చీమకుర్తి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**




సంతనూతలపాడు మాజీ శాసనసభ్యులు, రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్ పర్సన్‌గా స్వర్గీయ వేమా యల్లయ్య సేవలు మరువలేనివని చీమకుర్తి మండల వైసీపీ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు అన్నారు. వేమా యల్లయ్య 91వ జయంతి సందర్భంగా చీమకుర్తిలో ఎమ్మార్వో కార్యాలయ ప్రాంగణంలోని వేమా యల్లయ్య మెమోరియల్ ప్రాంగణంలో వారి విగ్రహానికి సోమవారం పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సంతనూతలపాడు శాసన సభ్యునిగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలతో గుర్తుండి పోయేలా శాశ్వత పనులు చేసిన మనిషి అని పమిడి వెంకటేశ్వర్లు అన్నారు. ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ చీమకుర్తి మండల అభివృద్ధిపై చెరగని ముద్ర వేసిన మహనీయుడు యల్లయ్య గారిని వారి హయాంలో ఏర్పడిన శాశ్వత ప్రభుత్వ కార్యాలయాలు నేడు ప్రజలకు పరిపాలనలో సులభతరం చేశాయని అన్నారు. అంతేకాక వారి తనయుడు చీమకుర్తి జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు వారి తండ్రిగారు పుట్టినరోజునే జన్మించడం ఎంత అదృష్టమని వారి అడుగుజాడల్లో పనిచేస్తూ జడ్పిటిసి సభ్యుడిగా ప్రభుత్వం నుండి ఇటు జిల్లా పరిషత్ నుండి అనేక రూపాల్లో నిధులు రాబట్టి చీమకుర్తి మండల అభివృద్ధిలో భాగస్వామి కావడం ఎంతో అదృష్టం అన్నారు. జడ్పిటిసి వేమా శ్రీనివాసరావు జన్మదిన సందర్భంగా మండల వైసీపీ కార్యాలయంలో నాయకులు కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి శ్రీనివాసరావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలియ జేశారు.కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు క్రిష్టిపాటి శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ గంగిరెడ్డి ఓబుల్ రెడ్డి, వైసీపీ బీసీ నాయకులు తెల్ల మేకల గాంధీ, గంగిరెడ్డి సుందరరామిరెడ్డి, వైస్ ఎంపీపీ లక్ష్మయ్య, బొడ్డు కోటేశ్వరరావు, మొగిలి శెట్టి వెంకటేశ్వర్లు, ఎర్రగుంట్ల మోహన్ పులి వెంకటరెడ్డి, ఎస్ కే భాష కూరాకుల సుబ్బారెడ్డి, రాజేంద్ర, వేమ ఎలమందయ్య బక్క సుధాకర్ పాల్గొన్నారు.

## గ్రామ బహిష్కరణ విషయంలో ఎస్సైచాకచక్యం సమస్యకు పరిష్కారం

**కొత్తపట్నం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**



ఈతముక్కల పంచాయతీ పరిధిలో చెంచు పాపాయిపాలెం పట్టపు పాలెం కు చెందిన మాజీ సర్పంచ్ బసంగారి ప్రసాద్ కుటుంబాన్ని గ్రామ బహిష్కరణ చేసిన విషయం తెలిసింది. కొత్తపట్నం ఎస్ఐ వి సుధాకర్ సంఘటన స్థలానికి సోమవారం ఉదయం చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. గ్రామస్తులు గ్రామ కాపులు తో చర్చలు జరిపి అసలు విషయం తెలుసుకొని రెండు వర్గాలను శాంతింప చేయడంలో సఫలీకృతులయ్యారు. మాజీ సర్పంచ్ ప్రసాద్ గ్రామంలో తీసుకున్న డబ్బు అరవై వేల రూపాయలను రెండు రోజుల్లో చెల్లించే విధంగా ఒప్పందం కుదిర్చి తాళాలు వేసిన గ్రామ కాపులతోనే ఇంటి తాళం తీయించడం జరిగింది. గ్రామ కాపులు ప్రసాద్ జీవనోపాధిని నిలుపుదల చేశారని బాధితుడు ఎస్సై ముందు వాపోయారు. దీంతో ఎస్ఐ సుధాకర్ అతని జీవనోపాధిని నిలుపుదల చేసే హక్కు ఎవరికీ లేదన్నారు. సూచించారు. దీంతో వివాదం సద్దుమణిగింది.

## నరహత్య చేయక యుందువు గాక: నవదిన వేడుకలు

**ఒంగోలు,ప్రభాతవార్త**



ఒంగోలు సెంట్ తెరిసాచర్చిలో నవదిన వేడుకలలో భాగంగా సోమవారం రాత్రి ముఖ్య అతిథిగా హాజరైన రెవరెండ్ ఫాదర్ ప్రదీప్ నరహత్య చేయక యుందువు గాక అనే అంశంపై మాట్లాడారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో యువత, మధ్యతరగతి ప్రజలు అనవసరమైన ప్రలోభావాలకు లోనై కుటుంబ శ్రేయస్సును మరిచి హత్యలు, ఇతర కిరాతకమైన పనులు ఊహించినటువంటి ఘోరాలు చేస్తున్నారన్నారు. కనుక తాము ఏ స్థితిలో ఈ పాపాలు చేస్తున్నామో గ్రహించలేనంత మానసిక స్థితిలో ఉన్నటువంటి పరిస్థితులు నేటి సమాజంలో నెలకొంది. ఇటువంటి పరిస్థితి రూపుమాపాలంటే ఆధ్యాత్మికంగా ప్రజలు ఏసుక్రీస్తు బోధనలు ఆచరించి మంచి క్రైస్తవునిగా జీవించాలని, పునీత చిన్నతరేసమ్మ వారి అనుగ్రహం పొందాలని తెలియజేశారు. అనంతరం దివ్యబల్లి పూజ సమర్పించి భక్తులకు సప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో చర్చి ఫాదర్ డిఎస్ పాల్ అసిస్టెంట్ ఫాదర్ హృదయ రాజు కొనియాడ పడుతున్న సలోషియన్ ఫాదర్స్, సిస్టర్స్ సంఘస్తులు యువతీ యువకులు పాల్గొన్నారు.

## దళితుల భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు తొలగించాలి

**ఒంగోలు,ప్రభాతవార్త**



దళితులకు ఇచ్చిన భూముల్లో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులు ఎలా పడతారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు బిల్లా చెన్నయ్య ప్రశ్నించారు. బాధిత గ్రామస్తులతో కలిపి సోమవారం ప్రకాశం భవనం వద్ద ఆందోళన చేపట్టారు. విషయాన్ని పరిశీలిస్తే కొమరోలు మండలంలోని బెడుసుపల్లె గ్రామ నివాసి బోయిళ్ళ వెంకటయ్య, దళిత కుటుంబాలకు కొమరోలు తహసీల్దారు వారు 4.46 సెంట్ల భూమిని 1992వ సంవత్సరంలో డి ఫామ్ పట్టా ఇచ్చారు. అప్పటినుండి ఇప్పటి వరకు సదరు బోయిళ్ళ వెంకటయ్య, కొంతమంది దళితులు ఆ భూమిని సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే ఈ మధ్యకాలంలో ఈనెల 16వ తేదీన గ్రామ రెవెన్యూ అధికారి, ఈ భూమికి సంబంధించి గతంలో దాఖలైన అట్రాసిటీ కేసులో ఉన్నటువంటి ముద్దాయిలు తోటి కలిపి ఈ భూమిలో బోర్డు పెట్టించారు. మీరు ఎవరైనా ఈ భూమిలో అడుగు పెడితే మీ మీద కేసులు పెడతాము, మిమ్మల్ని జైలుకు పంపిస్తామని ఇంటికి వెళ్లి దళితులను బెదిరిస్తున్నారు. ఈ విషయాన్ని సదరు బోయిళ్ళ వెంకటయ్య, గ్రామస్తులు మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిళ్ళా చెన్నయ్య దృష్టికి తీసుకురాగా వెంటనే సదరు మండల తహసీల్దారు వారితో మాట్లాడి ఈ విషయాన్ని వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. లేని యడల ఈ విషయం మీద ప్రకాశం జిల్లా కలెక్టర్ కి నేషనల్ ఎస్సీ కమిషన్ కి ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ వారికి ఫిర్యాదు చేయడం జరుగుతుందని తెలిపారు.

## ఘనంగా మాజీ కార్పొరేటర్ యాదాల జన్మదిన వేడుకలు

**ఒంగోలు, ప్రభాతవార్త**

మాజీ కార్పొరేటర్ యాదాల రాజశేఖర్ జన్మదినవేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ పిడిసిసి ఛైర్మన్ కండె శ్రీనివాసులు,కట్టా సుధాకర్,దాసరి ధనుంజయ, దారా జంక్షన్‌రావు, యాదాల చిట్టిబాబు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.



# ప్రకాశం వార్త



తెలుగు జాతీయ దినపత్రిక

## నల్లబర్లీ పొగాకు సాగు నిషేధంపై రైతులకు అవగాహన

**సంతనూతలపాడు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**




సంతనూతలపాడు మండలంలోని పేర్నమిట్ట గ్రామంలో సోమవారం నాడు యూరియా అవుట్ రీచ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ యూరియా అవుట్ రీచ్ కార్యక్రమంలో సంతనూతలపాడు మండల వ్యవసాయాధికారిణి పి.పావని రైతులతో మాట్లాడుతూ వ్యవసాయంలో రసాయన ఎరువులు వాడకాన్ని తగ్గించి జీవన ఎరువులను, పచ్చిరొట్ట పైర్లు వాడినట్లయితే భూమి, నీటి కాలుష్యం, మానవ ఆరోగ్యంపై దుష్ప్రభావాలు తగ్గించగలమని, అదే విధంగా భూసార పరీక్ష ఫలితాల సిఫార్సు ఆధారంగా ఎరువులు వాడినట్లయితే పెట్టుబడి ఖర్చు తగ్గడమే కాక భూమి, నీటి కాలుష్యాలను నియంత్రించగలమని తెలియజేశారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించండి







### - కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశాలు

**కనిగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

ప్రకాశం జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ పి.రాజాబాబు స్థానిక శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించి అన్ని విభాగాలను పరిశీలించారు. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. తరువాత కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి కనిగిరి- పామూరు రోడ్డులోగల నందితా శ్రీనివేదితా శ్రీ డెవలపర్స్ లేఔట్‌ను సందర్శించారు. సంబంధిత డెవలపర్స్ పీపీపీ విధానంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం నూతన భవనానికి ఉచితంగా స్థలం ఇచ్చి భవనం నిర్మిస్తుండటం పట్ల కలెక్టర్ సంతోషం వ్యక్తంచేశారు. ఈ సందర్భంలో ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, రెవెన్యూ అదికారులు పాల్గొన్నారు.

## సరస్వతి దేవి అలంకారంతో అమ్మవారు

**- చిన్నారులకు సరస్వతి పూజ నిర్వహించిన వేద పండితులు -కూచిపూడి నృత్యంతో అలరించిన చిన్నారులు**





**చీమకుర్తి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

దసరా దేవి నవరాత్రులు సందర్భంగా చీమకుర్తి శ్రీ హరిహర క్షేత్రంలో అమ్మవారి విశేష పూజా కార్యక్రమాలు ఎనిమిదవ రోజు సోమవారం నిత్య పూజలు అలంకారాలతో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. అమ్మవారు మూల నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవి తల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. దేవి శరన్నవ రాత్రులు సందర్భంగా మాజీమంత్రి శిద్దా రాఘవరావు దంపతులు క్షేత్రంలో కొలువై ఉన్న శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి దేవిని, పార్వతి దేవి అమ్మవారిని శిద్దా రాఘవరావు దంపతులు విశేష పూజలునిర్వహించి అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులకు సరస్వతి పూజ అత్యంత వైభవంగా నిర్వహించారు. సరస్వతి పూజలో పాల్గొన్న చిన్నారులకు పలక,పుస్తకం,పెన్ ను పంపిణి చేసారు. చీమకుర్తి నటరాజ డ్యాన్స్ అకాడమీ చెందిన చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం అందరినీ ఆకట్టుకుంది.మంగళవారం అమ్మవారు కన క దుర్గాదేవి అలంకరణతో భక్తులకు దర్శన భాగ్యం,వన దుర్గ అలంకరణ తో భక్తులకు దర్శన భాగ్యం కలిగిస్తారని శిద్దా రాఘవ రావు దంపతులు తెలిపారు.ఈ కార్యక్రమంలో శిద్దా పాండురంగారావు దంపతులు,శిద్దా సుధాకర్ దంపతులు,శిద్దా సాయి బాబా దంపతులు,కొణిజేటి సువర్ణ,గాదం శెట్టి లక్ష్మి,చలువాది మాధవి,కూరపాటి ధనలక్ష్మి,దాట్ల సువర్చల, ఏ.అరుణ,మహిళా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అభివృద్ధి పథంలో మల్లవరం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం

**- ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కల్యాణకట్ట శ్రీవారి సదనం, వసతి గదుల ప్రారంభోత్సవం**

**ఒంగోలు,ప్రభాతవార్త**

మద్దిపాడు మండలం మల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన శ్రీవారి సదనం కళ్యాణకట్ట,వసతి గదులను అక్టోబర్ రెండవతేది గురువారం విజయదశమి పర్వదినాన ప్రారంభిస్తున్నట్లు మల్లవరం శ్రీవారి వనం కమిటీ గౌరవ అధ్యక్షులు కావూరి వాసు,అధ్యక్షులు మార్నేని కృష్ణారావు తెలియజేశారు. ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించి కార్యక్రమ బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి పురాతన ఆలయమైన శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కళ్యాణకట్ట, శ్రీవారి సదనం,వసతి గదులను దాతల సహకారంతో ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు. శ్రీవారి వనం కమిటీ ద్వారా భక్తులు తల నీలాలు సమర్పించుకోవడం కోసం కేశఖండనశాల,గిరి ప్రదక్షణ వలయం, భక్తుల ఆకాంక్షల మేరకు ఆలయ ఉత్తరం వైపున నక్షత్ర వనం,రాశి వనము, దేవత వృక్షాలు, తదితర వాటిని అభివృద్ధి చెయ్యటం జరిగిందన్నారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వం కూడా పర్యాటకశాఖ,ప్రైవేటు సంస్థల సహకారంతో పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సన్నహాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనితోపాటు మల్లవరం శ్రీవారి వనం కమిటీ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని భక్తులు దాతలు సహకారంతో అభివృద్ధి కార్యక్రమాల వేగవంతంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. కావున రెండో తేదీ జరిగే బృహత్తర కార్యక్రమానికి ప్రజలు, భక్తులు పెద్ద ఎత్తున తరలిరావాలని వారు విజ్ఞప్తి చేశారు.మీడియా సమావేశంలో ప్రధాన కార్యదర్శి బోయపాటి రవి, కోశాధికారి మన్నం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాస్ హాస్పిటల్‌లో హార్ట్‌పై అవగాహన సదస్సు

**ఒంగోలు, ప్రభాతవార్త**

ప్రపంచ హృదయ దినోత్సవం సందర్భంగా ఉపాస్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నందు అవగాహన సదస్సు ఏర్పాటు చేసారు. ఈ కార్యక్రమమునకు పి. వరుణా రెడ్డి, అడిషనల్ సూపరింటెండెంట్, డిస్ట్రిక్ట్ జైలు సూపరింటెండెంట్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. "హృదయ స్పందనను ఏ ఒక దశలో కూడా కోల్పోకూడదు" అనే నినాదంతో వరల్డ్ హెల్త్ ఆర్గనైజషన్ 2025 వరల్డ్ హార్ట్ డే సందర్భంగా సూచించడం జరిగింది. ఉపాస్ హాస్పిటల్ మరియు ఉపాస్ హార్ట్ కేర్ సెంటర్, గుండె సంబంధిత ఆరోగ్య సంరక్షణకు స్థానిక సంస్థల ఆధ్వర్యంలో ఎప్పటికప్పుడు ఉచిత స్క్రీనింగ్ శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుందని ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ఉమాపతి చౌదరి తెలియ చేశారు. గుండె వ్యాధుల భారాన్ని తగ్గించడంలో నియంత్రణ చర్యలు, ఆరోగ్యకరమైన జీవన శైలి, ప్రారంభ దశలో గుర్తింపు కీలకమని డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్ చవల తెలియ చేశారు. సరియయిన పోషకాహారం తీసుకోవడం, క్రమంతప్పక వ్యాయామం చేయడం మరియు ధూమపానం విరమణ చర్యల వలన గుండె సంబంధ వ్యాధులు దూరం చేయవచ్చు అని డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ కాపా తెలియచేశారు. యుక్త వయసులో గుండె లయ తప్పుతుంది, గుండె నొప్పి కారణంగా యువత వున్నపళంగా కుప్పకూలి పోతున్నారు, ముందస్తు జాగ్రత్తలతో గుండెను పదిలంగా చూసుకోవాలని డైరెక్టర్ డాక్టర్ అనపర్తి శ్రీనివాస్ తెలియ చేశారు. ఉపాస్ హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్టు డాక్టర్ శ్రీధర్ చివుకుల మాట్లాడుతూ మానవ శరీరంలో అన్ని శరీర భాగాలూ కీలకమే అయినా కూడా ప్రధాన భాగమైన గుండె పోషించే పాత్ర ఎంతో ప్రత్యేకమైనది అని తెలియ చేశారు. జీర్ణాశయం పై భాగాన మరియు ఎడమ చేయి, రెండు చేతుల్లో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రాథమిక వైద్య పరీక్షలు అయినటువంటి ఈసిజి చేయించుకుని వ్యాధి నిర్ధారణ చేయించు




కోవడం ఉత్తమమైన మార్గం అని డాక్టర్ శ్రీధర్ తెలియ చేశారు. రక్తనాళాలను పరిశీలించడం, గుండె రక్తనాళాల్లోని అడ్డంకులు, అనూరిజమ్స్ లేదా ఇతర వాస్కులర్ పరిస్థితుల వంటి అసాధారణలతను గుర్తించడానికి ఉపయోగకరమైన యాంజియోగ్రామ్ ప్రొసీజర్ ను ఒక నెల రోజుల (అక్టోబర్ మాసం) పాటు కేవలం రూ: 8000 / కు మాత్రమే నిర్వహిస్తున్నట్లు ఉపాస్ హాస్పిటల్ డైరెక్టర్స్ తెలియ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ పోకూరి శ్రీనివాస్, డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ జయవర్ధన్, డాక్టర్ సాత్విక్ అల్లాడి, డాక్టర్ సువర్ణ రాజు, డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాస్, డాక్టర్ ఎస్ రాధ, డాక్టర్ మహేష్ వేమవరపు, అనస్తీషియాలజి డాక్టర్ పవన్ కుమార్ కాకాని మరియు హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాపారుల పాతపాటే

### - అమల్లోకి రాని జీఎస్టీ 2.0

**ఒంగోలు, ప్రభాతవార్త**

దసరా నేపథ్యంలో వస్త్రాలను కొనుగోలు చేసేందుకు ఒక కుటుంబం నగరంలోని ఒక దుకాణానికి వెళ్లింది. 2500లోపు ధర ఉన్న వస్త్రాలపై జీఎస్టీని 12నుంచి 5శాతానికి కేంద్రం తగ్గించింది. ఈ నేపథ్యంలో ధర తక్కువ పడుతుందని ఆశించిన ఆ కుటుంబానికి నిరాశే ఎదురైంది. ఎమ్మార్పీ ఎంత ఉంటే అంత చెల్లించాల్సిందేనని దుకాణ యజమాని స్పష్టం చేయడంతో చెల్లించి బయటపడ్డారు. జీఎస్టీ(వస్తు సేవల పన్ను) సంస్కరణల ప్రభావం నిత్యవసర వస్తువులపై కనపడటం లేదు. ధరలు తగ్గించి విక్రయించాల్సి ఉండగా పాత ఎమ్మార్పీ ధరలకే అమ్ముతున్నారు. ఈ నెల 22 నుంచి పన్ను తగ్గింపు విధానం అమల్లోకి వచ్చినా చాలా మంది దుకాణ దారులు ఎక్కడా ధరలను తగ్గించి అమ్మడం లేదు. పాత స్టాకే ఉందని కొందరు చెబుతుండగా కంపెనీల నుంచి తగ్గిన ధరల వివరాలు రాలేదని పేర్కొంటున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రతి రోజు 20 కోట్ల నుంచి రూ.25 కోట్ల వరకు వ్యాపారం జరుగుతుందని అంచనా. ఔషధాలపై గతంలో 12 శాతం ఉన్న పన్ను రేటు ప్రస్తుతం 5 శాతానికి తగ్గించి. క్యాన్సర్, ఇతర సంక్లిష్ట వ్యాధుల చికిత్సలో వినియోగించే పలు రకాల ఔషధాలపై కేంద్ర ప్రభుత్వం పన్ను పూర్తిగా తొలగించింది. ఆ మేరకు మందుల విక్రయాలు జరగడం లేదు. నగరంలోని ఒక మెడికల్ ఏజెన్సీ వద్ద ఈనెల 22వ తేదీకి ముందు కోటి రూపాయలు విలువైన సరుకు ఉంది. అందులో 12శాతం, 5 శాతం పన్ను రేట్ల సరుకు ఉంది. 12శాతం సరుకు 5 శాతానికి, 5 శాతం పన్ను సంబంధించిన సరుకును జీరో శాతానికి తగ్గించారు. కాని పాత ధరకే అమ్ముతున్నారు. కేంద్ర ప్రభుత్వం సవరించిన ధరల ప్రకారం వస్తువులను విక్రయించాలి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఈ విధానం అమల్లోకి రావడం లేదు. వాణిజ్య పన్నుల శాఖ కార్యాలయం, కేంద్ర జీఎస్టీ అధికారుల తనిఖీలు కానరావడం లేదు. నూతన జీఎస్టీపై అవగాహన కార్యక్రమాలతో సరిపెటేస్తున్నారు. కనీసం టోల్ ఫ్రీ నెంబరు, హెల్ప్ లైన్ డెస్క్‌లను ఆయా శాఖలు అందుబాటులోకి తీసుకురాలేదు. ఫలితంగా వినియోగదారులను వ్యాపారులు దోచుకుంటున్నారు. జీఎస్టీ 2.0లో భాగంగా వివిధ రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లను కేంద్రం తగ్గించింది. వాహన ఎలక్ట్రానిక్, డెయిరి కంపెనీలు మాత్రమే తమ ఉత్పత్తులను ధరలను ఈనెల 20నుంచి తగ్గించి అమ్ముతున్నాయి. మందులు, నిత్యవసరాల వస్తువులపై కొంత ధరలు ముద్రించుకున్న అమ్మే సమయంలో తక్కువ ధరలకు ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టం చేసినా క్షేత్ర స్థాయిలో అమలు కావడం లేదు. కొత్త పాత ధరలకు సంబంధించి ప్రతి దుకాణంలో బోర్డు ఏర్పాటు చేయాలని ఆదేశాలు వచ్చినప్పటికి ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని చాలా దుకాణాల్లో అమలు కావడం లేదు. పాత నిల్వలను పాత జీఎస్టీ ప్రకారం అమ్ముతున్నామని కొత్త సరుకు వచ్చాక జీఎస్టీ 2.0 అమల్లోకి వస్తుందని పలువురు వ్యాపారులు బాహాటంగా చెప్తున్నారు.

## వస్తు సేవల పన్ను తగ్గింపుపై అవగాహన ర్యాలీ

**ఒంగోలు, ప్రభాతవార్త**




వస్తు సేవల పన్ను తగ్గింపు ఫలాలు ప్రజలకు చేరేలా అవగాహన కల్పించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాల్‌కృష్ణ తెలిపారు. వస్తు సేవల పన్ను తగ్గింపుపై ఏర్పాటు చేసిన ర్యాలీని స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద సోమవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ర్యాలీ అద్దంకి బస్టాండ్ వరకు సాగింది. ఈ ర్యాలీలో మెప్మాలోని పొదుపు సంఘాల మహిళలు, వివిధ వాణిజ్య సంఘాల ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వస్తు సేవల పన్ను తగ్గింపు ఫలాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. వస్తు సేవా పన్నుల సంస్కరణలతో ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. ప్రజలకు నేరుగా ఆర్థిక లబ్ధి చేకూరుతుందని వివరించారు. ప్రజలకు అవగాహన కల్పించే లక్ష్యంతో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పేరుతో నెల రోజుల పాటు కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. నాలుగు వారాలు చేపట్టే ఈ కార్యక్రమాలను ఒక్కొక్క అంశంతో ప్రజల్లోకి తీసుకువెళ్ళనున్నట్లు వివరించారు. ప్రజలు అవగాహన పొందితే మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ వెంకటేశ్వరరావు, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

6_6.qxd 9/30/2025 12:47 AM Page 1



## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ



**యర్రగొండపాలెం,సెప్టెంబర్ 29,(ప్రభాతవార్త**

యర్రగొండపాలెం పట్టణం యర్రగొండపాలెంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది. అనారోగ్యంతో బాధపడుతూ వివిధ ఆసుపత్రులలో వైద్యం చేయించుకొని ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న 36 మంది పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి క్రింద 26 లక్షల 39వేల 242 రూపాయల చెక్కులను బాధితులకు యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు అందజేశారు. ఈ సందర్భంగా యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జి ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ వైద్యం చేయించుకుని ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దేవుడి రూపంలో అండగా నిలిచారని అన్నారు..ఆపదలో అండగా నిలిచిన ముఖ్యమంత్రి సహాయ నిధి అనిప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి చంద్రబాబు సహాయాన్ని మరువకూడదని అన్నారు..ఈ సందర్భంగా లబ్ధిదారులు అందరూ కలిసి సీఎం చంద్రబాబు నాయుడు గారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బయ్య టీడీపీ మండల అధ్యక్షుడు వెంగల్ రెడ్డి , రాష్ట్ర తెలుగు యువత విభాగం నాయకులు వేగినాటి శ్రీను , కాపునాయకులు తోట మహేశ్ నాయుడు, మండల పార్టీ నాయకులు షేక్ మస్తాన్ వలి కూటమి నాయకులు పాల్గొన్నారు.

## మెగా డీఎస్సీలో 94 మంది ఎంపిక



**యర్రగొండపాలెం,సెప్టెంబర్ 29,(ప్రభాతవార్త**

మెగా డీఎస్సీలో నియమితులైన వారిని సన్మానించిన ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు (యర్రగొండపాలెం పట్టణం )మెగా డీఎస్సీ 2025లో నూతనంగా నియమితులైన యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన 94 మందికి తెలుగుదేశం పార్టీ యర్రగొండపాలెం నియోజకవర్గ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు ఘనంగా సన్మానించారు. యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజక వర్గ పరిధిలో మెగా డీఎస్సీ 2025కి ఎంపికైన 94 మంది అభ్యర్థులకు గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని ఘనంగా సన్మానించారు .....అనంతరం విద్యాశాఖ తయారు చేసిన నియామక అభినందన పత్రాలను యంతటి ఆంజనేయులుతో కలిసి వారికి అందజేశారు ....ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ అమరావతి సచివాలయం ప్రాంగణంలో సెప్టెంబర్ 25, 2025న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్, చేతుల మీదుగా ఉద్యోగ నియమక పత్రాలను పొందిన మీరు వెనుక బడ్డ పశ్చిమ ప్రకాశంలో వెలసిన దివ్వెలని , నాణ్యమైన విద్యను ఇక్కడి విద్యార్థులకు అందించి విధ్యార్ధుల విధ్యనైపుణ్యాన్ని పెంపొందించేందుకు క్రృషిచేయలని పిలుపు నిచ్చారు , వెనుక బడ్డ ఈ ప్రాంతంలో చదువులు వెల్లివిరియాలని కష్టపడి కొలువులు సాదించిన మీరు అంతే కష్టపడి పేదవిధ్యర్దుల భవిత బాటకోసం శక్తివంచన లేకుండగా పనిచెయలని కోరారు .ఎంపికైన 94 మంది అభ్యర్థులలో దాదాపు ఎక్కువ మహిళలు ఉండటం ఈ మెగా డీఎస్సీ ప్రత్యేకత అని ఎరిక్షన్ బాబు పేర్కొన్నారు.ఈ కర్యాక్రమంలో యర్రగొండపాలెం మార్కెట్ యార్డు చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండలపార్టీ అధ్యక్షులు వెంగల్‌రెడ్డి, రాష్ట్ర తెలుగుయువత విభాగపు నాయకులు వేగినాటి శ్రీను , కాపు నాయకులు తోటా మహేశ్ నాయుడు తదితరులు ఉన్నారు ...

### ఐదో బ్లాక్ కౌన్సిలర్ శ్రీనివాసులుని పరామర్శించిన అన్నా రాంబాబు



**మార్కాపురం,సెప్టెంబర్ 29,ప్రభాతవార్త**

మార్కాపురం పట్టణంలోని 5 బ్లాక్ కౌన్సిలర్ మంగమూరి శ్రీనివాసులు గారుహాస్పిటల్‌లో చికిత్స అనంతరం వారి స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటుండగా విషయం తెలుసుకున్న గిద్దలూరు మాజి శాసన సభ్యులు,మార్కాపురం నియోజకవర్గం ఇంచార్జి అన్నా రాంబాబు గారు పరామర్శించారు.

## తిమ్మాయిపాలెం పాఠశాలలో ఎడ్యూకేషనల్ ఇంటర్న్షిప్



**అద్దంకి ,సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

తిమ్మాయపాలెం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థుల కోసం దసరాసెలవులు ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఇంటర్న్షిప్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఒకేషనల్ ట్రైనర్ అయినటువంటి షేక్ అలీ ఆటోమోటివ్ ట్రేడ్, వెంకట శివరామకృష్ణ ఎలక్ట్రానిక్స్ ట్రేడ్ఎలమంద, ఐటిఐటిఎస్ ట్రేడ్‌కు సంబంధించిన హీరో షోరూం, ఎలక్ట్రానిక్ రిపేర్ షాప్, ఇంటర్నెట్ సెంటర్ లలో విద్యార్థులను దసరా సెలవుల ఇన్టెన్షిప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం మండల విద్యాశాఖ అధికారి కెవి శ్రీనివాసరావు విజిట్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కొన్ని సలహాలు, సూచనలు ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థిని విద్యార్థులు,మూడు ట్రేడ్లఇన్స్పెక్టర్లు సీఆర్పీ పాల్గొన్నారు.

## స్మశాన సమస్య తీర్చాలని ఎంఆర్‌పిఎస్ అధికారులకు వినతి



**అద్దంకి , సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

అద్దంకి మండలం కుంకుపాడు పంచాయతీ రాళ్లపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో 150 కుటుంబాలు నివసిస్తున్నాయని వీరికి స్మశానం తరతరాలుగా ఉందని, గత రెండు సంవత్సరాల క్రితం గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు క్రింద స్మశానం పూర్తిగా పోయినది ఎంఆర్‌పిఎస్ నాయకులు పేర్కొన్నారు. అనాటి నుండి ఎస్సీ కాలనీ 150 కుటుంబాలు ప్రభుత్వ అధికారుల చుట్టు తిరుగుతూనే ఉన్నారు. సోమవారం అద్దంకి మండల ఎమ్మార్వో ఆఫీస్ లో గ్రీవెన్స్ కార్యక్రమంలో అర్జీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాళ్లపల్లి గ్రామవాసులు, ఎంఆర్‌పిఎస్ నియోజవర్గ ఇన్చార్జి పూనూర్ రమేష్, ఎమ్మార్పీఎస్ గౌరవ సలహాదారుడు పూనూరి నెహెమియా, మండల ఇన్చార్జి పాలు పోగు సుబ్బారావు పాల్గొన్నారు

## పాత శివాలయం పూజలలో పాల్గొన్న హనుమా దంపతులు



**అద్దంకి , సెప్టెంబరు 29 ,ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలోని పాత శివాలయంలో సోమవారం ఉదయం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. దసరా శరన్ననవరాత్రి ఉత్సవాలలో భాగంగా జరిగిన ప్రత్యేక పూజలలో అద్దంకి పట్టణానికి చెందిన తెలుగు యువత నాయకులు చిన్ని హనుమా దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు, హనుమా దంపతులచే ప్రత్యేక పూజలను నిర్వహింపచేసి, తీర్థ ప్రసాదాలతోపాటు ఆశ్వీరచనాలు అందజేశారు.

## వచ్చేనెల 2న క్రిష్టియన్ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో నిరసన

### - పరిమి ప్రసాద్ వెల్లడి



**అద్దంకి ,సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

ప్రభుత్వ మెడికల్ కాలేజిల ప్రవేటి కరణ ప్రతిపాధనపై రాష్ట్ర వైసిపి క్రిష్టియన్ మైనార్టీ పిలుపు మేరకు ఆక్టోంబరు 2వ తేదిన బాపట్లలో నిరసన చేపట్టాలని ఆ విభాగ రాష్ట్ర అధ్యక్షులు జాన్ వెస్లి పేర్కొన్నారు. ఈనేపద్యంలో అద్దంకి నియోజకవర్గ క్రిష్టియన్ మైనార్టీ అధ్యక్షులు పరిమి ప్రసాద్ 2వ తేది నిర్వహించే నిరసన కార్యక్రమానికి నియోజకవర్గంలోని 5మండలాలు, అద్దంకి పట్టణ ఈ విభాగ అధ్యక్షులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరు అవ్వాలని పిలుపు నిచ్చారు.

## అద్దంకిలో డిజిటల్ బుక్ అవిష్కరణ



**అద్దంకి , సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

అద్దంకి వైఎస్ఆర్సీపీ ఆఫీసులో అద్దంకి నియోజకవర్గ వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ఆదేశాలు మేరకు అద్దంకి పట్టణం,అద్దంకి మండలం వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో సోమవారం డిజిటల్ బుక్ ఆవిష్కకరణకార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా వైఎస్ఆర్సీపీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంత రావు ,అద్దంకి పట్టణ వైఎస్ఆర్సీపీ అధ్యక్షుడు కాకాని రాధా కృష్ణ మూర్తి ,అద్దంకి మండల వైఎస్ఆర్సీపీ కన్వీనర్ గుజ్జుల జగన్మోహన్ రెడ్డితో పాటు, వివిధ హోదాలలో ఉన్న వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## 8వ రోజున అన్నదాన సత్రంలో పూజలు



**అద్దంకి, సెప్టెంబరు 29 ప్రభాతవార్త**

సింగరకొండలోని వాసవీ నిత్యఅన్నదాన సత్రంలో దేవీ నవరాత్రుల సందర్భంగా 8వ రోజున సోమవారం సరస్వతీ దేవి అలంకారంలో, కాశి అన్నపూర్ణ దేవి సమేత కాశీ విశ్వేశ్వర స్వామి అలంకారం చేసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాతలు నేరేళ్ళ శేషగిరి దంపతులు, పూవ్వాడ కోటేశ్వరరావు దంపతులు, మాజేటి సత్యనారాయణ దంపతులు, సత్ర కమిటీ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. తదుపరి ప్రసాద వినియోగము, అన్న ప్రసాద్ వితరణ జరిగింది.

## 8వ రోజున దత్త పాదుకాక్షేత్రంలో పూజలు



**అద్దంకి ,సెప్టెంబరు 29,ప్రభాతవార్త**

స్థానిక నాగులబండ బజారులోని దత్తపాదుకాక్షేత్రం(దత్తగుడి)లో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలోభాగంగా సోమవారం 8వ రోజున పూజలు నిర్వహించారు. శ్రీ సరస్వతీ దేవిగా అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

### సరస్వతీ అలంకరణలో అమ్మవారు దర్శనం



**అద్దంకి ,సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీచక్రసహిత శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో 8వ రోజున ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.

## అమ్మవారి ఆలయంలో పుస్తకాల పంపిణీ



**అద్దంకి , సెప్టెంబరు 29 ,ప్రభాతవార్త**

అద్దంకి పట్టణంలో మీరా బంకువీధిలో వున్న చిన్న అమ్మవారి ఆలయంలో సోమవారం రాత్రి సరస్వతీ పుస్తకాల పంపిణీ కార్యక్రమం జరిగింది. గత 5ఏళ్ళగా భాస్కర్ సప్లైయిర్స్ అధినేత గార్లపాటి శ్రీనివాసరావు దంపతులు, ఈ ఆలయంలో పుస్తకాల పంపిణీతోపాటు, నవరాత్రుల నిర్వాహణకు అవసరమైన ఏర్పాట్లును సమకూరుస్తున్నారు. అందులో భాగంగా ఈ ఏడాది కూడ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని వారి తనయుడు గార్లపాటి హరీష్ కుమార్ సోమవారం రాత్రి పూజా కార్యక్రమాల సందర్భంగా భక్తులకు సరస్వతీ పుస్తకాలను అందజేశారు. ఆలయ పూజారులు హరీష్‌కుమార్‌కు ఆశ్వీరచనాలను, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### సైబర్ పెట్రోలింగ్‌తో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు అడ్డుకట్ట

### - డిఎస్‌పి మొయిన్



**కొరిశపాడు , సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

సైబర్ పెట్రోలింగ్ వ్యవస్థతో సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులకు అడ్డు కట్టపడుతుందని చీరాల డిఎస్పి మహమ్మద్ మొయిన్ అన్నారు. కొరిశపాడు మండలం మేదరమెట్ల పోలీస్‌స్టేషన్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా డిఎస్‌పి స్టేషన్ను పరిశీలించారు. గ్రామాలలో దొంగతనాలు జరగకుండా గస్తీ ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. స్టేషన్ రికార్డులను పరిశీలించారు. తప్పుడు ప్రచారాలు చేసే సోషల్ మీడియాలపై నిరంతర నిఘా పెట్టాలని ఆయన సూచించారు. గ్రామ సివారులలో జూదం ఆడేవారిపై డ్రోన్‌లతో నిఘా పెట్టాలని సూచించారు. జాతీయ రహదారిపై ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారు. అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా సంచరిస్తున్నట్లు సమాచారం వుందని, వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో అద్దంకి రూరల్ సి.ఐ. మల్లికార్జునరావు, మేదరమెట్ల, కొరిశపాడు ఎస్.ఐ.లు మహమ్మద్‌రఫీ, సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## సచివాలయాన్ని సందర్శించి డిప్యూటీ డిఇఒ

### - తల్లికి వందనం రాని వారి సమస్యల పరిశీలన



**అద్దంకి , సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

తల్లికి వందనం నిధులు పడని విద్యార్థుల సమస్యలు తెలుసుకోవడానికి, వాటిని పరిష్కరించడానికి సోమవారం అద్దంకిలోని గాజులపాలెం సచివాలయాన్ని చీరాల డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ డి గంగాధర్ రావు పరిశీలించారు. ఆయన వెంట అద్దంకి మండల విద్యాశాఖ అధికారి కెవి శ్రీనివాసరావు, సిఆర్పి రమేష్, పుణ్యవతి వున్నారు. ప్రధానోపాధ్యాయులు సిఆర్పీలు , సచివాలయను సందర్శించి సచివాలయ సిబ్బంది సహకారంతో తల్లిదండ్రుల యొక్క బ్యాంకు ఎకౌంటులను పరిశీలించి, తల్లికి వందనం నిధులు పడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అవసరమైతే పోస్ట్ ఆఫీస్ లో కొత్త అకౌంట్ ఓపెన్ చేయాలని అకౌంట్ కి ఈకేవైసీ ఎన్పీసీఐ జత చేసి అమోంట్ పడేవిధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు.

### హెచ్ఐవి నియంత్రణకు ఎఎన్ఎం, ఆశా వర్కర్లు కృషిచేయాలి

### - బివి సాగర్



**అద్దంకి , సెప్టెంబరు 29 ,ప్రభాతవార్త**

ప్రతి ఏఎన్ఎం ఆశా వర్కర్ వారు పని చేసే ప్రాంతాల్లో హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి భాధిత గర్భిణీ స్త్రీలు ఎవరైనా ఉంటే గుర్తించి వారికి మెరుగైన వైద్య సేవలు అందించడంలో కృషి చేయాలని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టి.ఐ. ప్రాజెక్టు డైరెక్టర్ బివి సాగర్ పేర్కొన్నారు. అలాంటి వ్యాధి గ్రస్తుల బిడ్డకు వ్యాధి సంక్రమించకుండా మందులు వాడుకునే పద్ధతులు ఉన్నాయని, వారికి తెలియజేయాలన బాధ్యత వుందని పేర్కొన్నారు. అద్దంకి పట్టణంలోని గరటయ్య కాలనీలో హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టి ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ బివి సాగర్ ఆధ్వర్యంలో ఇంటెన్స్ ఫైడ్ ఐఇసిలో ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా బివి సాగర్ మాట్లాడుతూ ఏఎన్ఎంల అవగాహన కార్యక్రమం హెచ్ఐవి ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనలో, మాదకద్రవ్యాల నిర్మూలలో, మనందరం సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. టోల్ ఫ్రీ 1097, పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగించాలని కూడ ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎం. పి.హెచ్. ఏ. కె. సంతకుమారి, హెల్ప్ టి ఐ అద్దంకి ఔట్రిచ్ వర్కర్ టి. దుర్గ భవాని, పి పార్వతి, ఎం పి హెచ్ ఎ ఎం సుబ్బులు, డి.వి సుజాత, ఫార్మసిస్టు బాలసరి, స్టాఫ్ నర్స్ మేరీ తదితరులు పాల్గొన్నారు.

### జాగర్లమూడి వారిపాలెం వద్ద ప్రమాదం - ఒకరికి గాయాలు



**అద్దంకి ,సెప్టెంబరు 29,ప్రభాతవార్త**

జె.పంగులూరు మండలం జాగర్లమూడి వారిపాలెం వద్ద ద్విచక్ర వాహనం డివైడర్‌ను సోమవారం ఢీకొట్టింది. ఈ సంఘటనలో ద్విచక్ర వాహన చోదకునికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుని 108 వాహనంలో ఒంగోలులోని రిమ్స్‌కు తరలించారు. పూర్తి వివరాలు తెలియల్సి వుంది.

## ప్రజలకు ఉత్తమ సేవలందించండి



**మార్కాపురం,సెప్టెంబర్ 29,ప్రభాతవార్త**

ఉత్తమ సేవలు అందించి ప్రజా మన్ననలను పొందాలని మండల టిడిపి కన్వీనర్ కాకర్ల శ్రీనివాసులు కోరారు. ఎంపీడీఓగా నూతన బాధ్యతలు చేపట్టిన బాల చెన్నయ్యను మండల టిడిపి నాయకులు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. కాకర్ల శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు మంచి సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలన్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. ఎంపీడీఓను కలిసిన వారిలోమిట్టమీది పల్లె సొసైటీ అధ్యక్షులు గొలమారి నాసర్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మాఖం అబ్రహం,కొత్తపల్లి సర్పంచ్ మట్టం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## దుర్గాష్టమి సందర్బంగా ప్రత్యేక పూజలు

**అద్దంకి , సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో దుర్గాష్టమి సందర్భంగా మంగళవారం కుమారి, సుహాసని పూజలు ఉదయం 10గంటలకు జరుగుతాయని భక్తులు అధిక సంఖ్యలో ఈ పూజలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించగలరని ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపారు.

## సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**సంతమాగులూరు ,సెప్టెంబరు 29 ప్రభాతవార్త**

దసరా నవరాత్రులలో భాగంగా ఏడవరోజు రోజైన సోమవారం గ్రామాలలో నవరాత్రుల వేడుకలకై ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్ళలలో అమ్మవారిని మహా సరస్వతిదేవిగా అలంకరిచి భక్తులకు కనువిందుగా అమ్మవారి దర్శనం లభించింది. మండల కేంద్రమైన సంతమాగులూరు శివాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన నవరాత్రుల వేడుకల్లో అమ్మవారినిమహా చండీ దేవిగా చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. సంతమాగులూరు ఆర్యవైశ్యసంఘంతో పాటు గ్రామస్తులందరూ ఐఖ్యంగా ఈవేడుక నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటి తెలిపింది.

## సరస్వతి దేవిగా అలరించిన అమ్మవారు



**బల్లికురవ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం సరస్వతి దేవిగా అమ్మవారు భక్తులను కనువిందు చేశారు. మండల కేంద్రమైన బల్లికురవ, కొండాయపాలెం, గొర్రెపాడు గ్రామాలలో నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి సుధీర్ శర్మ మాట్లాడుతూ మహాకాళి, మహాలక్ష్మీ మహా సరస్వతి అని పూజించుకునే ముగ్గురు అమ్మలలో సరస్వతి దేవి బాలచంద్రుని సిగలో పూవుగా ధరించి ఉంటుందని వివరించారు. మనిషి రెండు కళ్ళతో ప్రపంచాన్ని చూడగలిగితే, విద్య అనే మూడో కంటితో లోకంలోని మంచి చెడులను తెలుసుకుంటూ ముందుకెళ్తారని అలాంటి చదువులకు సరస్వతి దేవి అది దేవత అన్నారు. వేదాలు, పురాణాలు, ఇతి హాసాలు,సరస్వతి దేవికి నిలయాలని, హంసవాహనంపై ఆమె విహరిస్తుందన్నారు. విద్యార్థులంతా ఆ తల్లికి శరణాగతులై ఉండాలి. ఏ ఇంట సరస్వతి అమ్మను పూజిస్తారో ఆ ఇల్లు సిరి సంపదలకు, శాంతికి నిలయం అవుతుందన్నారు. అందుకే విద్యా రూపే విశాలాక్షి, విద్యాందేహి నమోస్తుతే, అని ప్రార్థించి తల్లి ఆశీస్సులు పొందాలన్నారు. సాయంత్రం వేళ ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

## రామయ్యను తాకిన సూర్యనారాయణ కిరణాలు



**బల్లికురవ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

దక్షిణాయనం ప్రారంభమైనంది మొదలు, ప్రతి శుభదినం శుభ ఘడియలలో అందునా మూలా నక్షత్రం పర్వదినం రోజున మండలంలోని కొత్తపాలెం కోదండ రామాలయంలో సోమవారం సూర్య నారాయణ కిరణాలు రామయ్య పాదాలను తాకాయి. ఈ సందర్భంగా ఆలయ పూజారి ఆయినవోలు సుబ్బాచార్యులు, శివ సాయిలు మాట్లాడుతూ దక్షిణాయనం ప్రారంభమైంది మొదలు ముగిసే వరకు ప్రతి పర్వదినం రోజున ఈ విధంగానే సూర్యనారాయణ కిరణాలు రామయ్యను పలకరిస్తాయని వివరించారు. ఈ సందర్భంగా మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారికి పంచామృత అభిషేకము, హరిద్రా చూర్ణాలేపనం, అష్టోత్తర శతనామ అర్చన, దివ్యమంగళ హారతి కార్యక్రమాలు కొనసాగాయి. సాయంత్రం వేళ సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ కొనసాగింది.

## వాగ్వివాదాల మధ్య సర్వసభ్య సమావేశం




**పొన్నలూరు,సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

సోమవారం జరిగిన పొన్నలూరు మండల సర్వసభ్య సమావేశం వాగ్వివాదాల మధ్య కొనసాగింది. ఎంపిపి కొండాబత్తిన మాధవరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా ఆయన మాట్లాడుతూ అధికారులు పార్టీలకు అతీతంగా ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు అందించాలని అన్నారు. యూరియా అధికార పార్టీలోని కొందరికే ఇస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో పార్టీలకు అతీతంగా సేవలు అందజేయడం జరిగిందని ఆ విషయాన్ని అధికారులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంలో చెరుకూరు పిడిసిసి అధ్యక్షులు వడ్డే మాల్యాద్రి ఎంపిపి మాటలను ఖండించారు.గతంలో చెరుకూరు సచివాలయం పరిధిలో మిరప పంట వేసిన రైతులు కొందరికి ఎటువంటి లబ్ధి చేకూరలేదని, ఎంపిపి గా అలా మాట్లాడటం తగదన్నారు. గత ప్రభుత్వంలో కూడా మీరే ఉన్నారని అన్నీ తెలిసి కూడా అలా మాట్లాడటం సరికాదన్నారు.బోగనంపాడు ఎంపిటిసి రామాంజనేయులు మాట్లాడుతూ గతంలో ఇసుక 7,000 పైన అమ్మిన మాట వాస్తవం కాదా అని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత వైసిపి ప్రభుత్వంలో ఏ విధంగా మేలు చేకూరిందో తెలియజేయాలని టిడిపి సభ్యులు నిలదీశారు. ఈ చర్చ కొనసాగుతుండగా జడ్పిటిసి బెజవాడ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎరువులు,విత్తనాలు తప్పుదోవ పడుతున్నాయని , అదేవిధంగా ఉపాధి హామీలో అక్రమాలు , ఇసుక తరలింపులపై సమస్యలు మా దృష్టికి వచ్చాయని వివరిస్తూ ఉండటంతో టీడీపీ సభ్యులు మరలా తీవ్ర స్థాయిలో వాగ్వివాదానికి దిగి ఆరోపణలు, ప్రత్యారోపణలు చేసుకున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన అవినీతి, అభివృద్ధి పై ప్రస్తుతం జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చకు రావాలని వాదించారు. వివాదం పెద్దదవుతుండటంతో నాయకులకు ఎంపిడివో, కార్యాలయ సిబ్బంది సర్దిచెప్పడంతో సమావేశం కొనసాగింది.ఈ కార్యక్రమంలో కొండపి ఏఎంసి చైర్మన్ కర్నా తిరుపతమ్మ, ఎంపిడివో సుజాత, ముప్పాళ్ళ, విప్పగుంట పి ఏ సి ఎస్ అధ్యక్షులు మన్నెం రమణయ్య, ఉన్నం కొండలరావు, సర్పంచ్ షేక్ చిన మస్తాన్, రంగారావు, కొండారెడ్డి, మండలం స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలకు అండగా నిలిచేందుకు డిజిటల్ బుక్



**పొన్నలూరు,సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

అన్యాయానికి గురైన వైసిపి కార్యకర్తలకు అండగా నిలిచేందుకు డిజిటల్ బుక్ పనిచేస్తుందని జడ్పీటీసి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. పొన్నలూరులోని జడ్పీటీసి నివాసంలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంపిపి కొండాబత్తిన మాధవరావుతో కలిసి డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జడ్పీటీసి, ఎంపిపి మాట్లాడుతూ అన్యాయానికి గురైన కార్యకర్తలకు అండగా ఉండాలనే సంకల్పంతో వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ తీసుకొచ్చారని అన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని కార్యకర్తలందరికి చేరువచేసే దానిలో భాగంగా డిజిటల్ బుక్ ఆవిష్కరణ జరిగిందన్నారు. ఈ డిజిటల్ బుక్ రెండు విధాలుగా పని చేస్తుందని డిజిటల్ బుక్ పోర్టల్ లో ఫోటోలు , ఆధారాలను అప్లోడ్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని, రెండో విధానముగా ఐ వి ఆర్ ఎస్ ఫోన్ నెంబర్ ద్వారా కూడా కార్యకర్తలు ఫిర్యాదు చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి అనుమోలు శివయ్య,వైసిపి నేతలు పల్నాటి వెంకటేశ్వర రెడ్డి,పిల్లి తిరుపతిరెడ్డి, దాసరి రవి, గడ్డం మాల్యాద్రి,మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఈపురుపాలెంలో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్



**చీరాల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య ఆదేశాలతో ఆరోగ్యకరమైన కుటుంబాల కొరకు మహిళలకు ప్రత్యేకంగా అన్ని రకాల పరీక్షలు స్క్రీనింగ్ టెస్టులు కొరకు ఈపురుపాలెం పంచాయతీ నందు మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు గుద్దంటి చంద్రమౌళి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ పరిధిలోని మహిళలు, వృద్ధులకు పరీక్షలు చేసి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం అక్టోబర్ 2 వరకు కొనసాగుతుందని, నియోజకవర్గంలోని ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగపరుచుకుని కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ ఆశా వర్కర్స్ వైద్య సిబ్బంది, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకలో కదిరి పార్థసారథి



**సీఎస్‌పురం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

శీలంవారిపల్లి గ్రామానికి చెందిన కంటె వేణు నూతన గృహ ప్రవేశ కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ గృహ ప్రవేశ వేడుకలో కదిరి బాబురావు వ్యవసాయ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి పాల్గొని వేణు కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు మునగల నారాయణ రెడ్డి, మూరం కాశిరెడ్డి, ముడిమాల నారాయణరెడ్డి, తికణం లక్ష్మీ నారాయణ, మునగల సుధాకర్‌రెడ్డి, డాక్టర్ వెంకటేశ్వర్లు, కొట్టే శ్రీను, ఇరగని మాధవరావు, నున్నా నారాయణ, వ్యవసాయ కళాశాల ఇంజనీర్ నిమ్మల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

7_7.qxd 9/30/2025 12:48 AM Page 1



# డిజిటల్ బుక్ ఆవిష్కరించిన దేవినేని



**బల్లికురవ, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
స్థానిక వైసీపీ కార్యాలయంలో సోమవారం మండల కన్వీనర్ దేవినేని కృష్ణబాబు డిజిటల్ బుక్ ను ఆవిష్కరించారు. నియోజకవర్గ సమన్వయకర్త చింతలపూడి అశోక్ కుమార్ ఆదేశాల మేరకు అద్దంకి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండల కార్యాలయాలలోనూ డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ కార్యక్రమంలో మండలంలోని అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.

## కొలలపూడిలో స్వస్థ్ నారీ - సశక్త్ పరివార్ కార్యక్రమం



**మార్టూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
మండలంలోని కొలలపూడి విలేజ్ హెల్త్ క్లినిక్ లో స్వస్త్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైద్యాధికారి డెల్సిన్ పాల్గొని షుగర్, బీపీ వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. మహిళల్లో వచ్చే వ్యాధుల గురించి వివరించారు. క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ బేబి, విజయభారతి, సర్పంచ్ మోపరాతుల సతీష్,ఆరోగ్య సిబ్బంది మౌనిక, గంగాభవాని, అంగన్వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మార్టూరులో ఉచిత మెగా వైద్య శిబిరం



**మార్టూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
అంతర్జాతీయ హృదయ దినోత్సవం సందర్భంగా మార్టూరు గ్రామంలోని గవర్నమెంట్ హాస్పిటల్ నందు ప్రభుత్వం చేపట్టిన ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు300 మందికి వైద్య పరీక్షలు చేశారు. మందులు అందజేశారు. వచ్చిన వారికి రోటరీక్లబ్ వారు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అశోక్కుమార్రెడ్డి, రోటరీ అధ్యక్షులు మాదాల సాంబశివరావు, కార్యదర్శి దెందుకూరి నాగేశ్వరరావు, కోశాధికారి గోనుగుంట్ల రవికుమార్, అసిస్టెంట్ గవర్నర్ రావి అంకమ్మ చౌదరి, మాజీ అధ్యక్షులు జాష్టి వెంకట మోహన్రావు, జాష్టి సాంబశివరావు, శానంపూడి లక్ష్మయ్య, మద్దుమాల కోటేశ్వరరావు, రోటేరియన్స్ మోటుపల్లి అంకయ్య, కొల్లపాటి సుబ్రహ్మణ్యం, డాక్టర్ విష్ణు, తేజ, డాక్టర్ భానుచందర్ నాయుడు, చింతల సుబ్బారావు, గరిమిడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# సరస్వతీదేవి అలంకారణలో అమ్మవారు



**యర్రగొండపాలెంరూరల్,సెప్టెంబర్29,ప్రభాతవార్త**
దసరా నవరాత్రులలో భాగంగా యర్రగొండపాలెం నియోజకవర్గ కేంద్రంలోని శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు సరస్వతిదేవి అలంకారణతో సోమవారం అమ్మవారు భక్తులను కనువిందు చేశారు.అమ్మవారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు కుంకుమార్చనలు అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణలు చేయటం జరిగింది.ఈ పూజలలో భక్తులు దంపతి సమేతంగా ఉదయం సాయంత్రం పాల్గొని పూజలు నిర్వహించి అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.అధ్యక్షులు కొత్తమాసు ఆనంత వెంకట సుబ్రమణ్యం,ప్రధాన కార్యదర్శి వీడేళ్ల సుబ్రమణ్యం,కోశాధికారి చలువాది శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించకపోతే పోరుబాట తప్పదు

### - సచివాలయ ఉద్యోగులు



**వేటపాలెం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న వివిధ శాఖల ఉద్యోగులు పోరుబాట పడుతున్నారు. వారు తమ జాబ్ చార్ట్ ప్రకారం తమ తమ డిపార్ట్మెంట్ వారీగా విధులు నిర్వహించుకుంటామనడంనా వేటపాలెం మండల పెన్షన్ పంపిణీ, డోర్ టు డోర్ సర్వే వంటి పనులు అప్పగించడం వలన తీవ్ర అసంతృప్తి, మానసిక ఆందోళనకు గురవుతున్నామని, పలు శాఖల అధికారుల ఆజమాయిషీ వీరిపై ఎక్కువ అవ్వడంపై తీవ్ర ఆందోళనకు గురవుతున్నామన్నారు. ఈ సమస్యలపై పలు మార్లు ఉన్నతాధికారుల వద్ద ఏకరువు పెట్టినా ఫలితం శూన్యమన్నారు. వీరిని మాతృ సంస్థలకు అప్పగించాలని, ప్రమోషన్ ఛానల్ కల్పించాలని తదితర డిమాండ్లతో రాష్ట్ర స్థాయి కార్యచరణ రూపొందించారు. అందులో భాగంగా ఈనెల 29 లోపు ప్రభుత్వ వర్గాలు జరిపి తమ సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షాన అక్టోబర్ 1న జరిగే సామాజిక పెన్షన్ పంపిణీ చేయబోమని జేఏసీ రాష్ట్ర స్థాయిలో నోటీసులు ఇచ్చింది. వారి కార్యాచరణలో భాగంగా వారి వారి అధికారిక వాట్సప్ గ్రూపుల నుంచి నిష్క్రమించడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వేటపాలెం మండల సచివాలయ సిబ్బంది అందరూ ఎంపీడీవో ఎం.రాజేష్బాబు, ఎమ్మార్వో జి.గీతారాణిని కలిసి తమ యొక్క వినతిపత్రం అందజేశారు.

## దర్శి మున్సిపాలిటీ నందు 27 ఎలక్షన్ వార్డులుగా పునర్విభజన



**దర్శి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
దర్శి మున్సిపాలిటీ నందు గల 20 ఎలక్షన్ వార్డులను 27 ఎలక్షన్ వార్డులుగా పునర్విభజన చేసినట్లు దర్శి మున్సిపల్ కమిషనర్ వై.మహేశ్వరరావు తెలిపారు. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విడుదలైన పత్రంతో ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన విలేకర్లకు తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీ చట్టం 1995 మేరకు వార్డు విభజన విధులు జీవో ఎంఎస్ నెంబరు 31 ఎంఏ అండ్ యుడీ (ఎలక్షన్), 03-02-1995, జీవో ఎంఎస్ నెంబరు 61 ఎంఏ, యుడీ(ఎలక్షన్), 03-02-1995 ప్రకారం వార్డు విభజనలో పురపాలక సంఘం వార్డులు ఉత్తరమున ప్రారంభమై తూర్పు దక్షణము తరువాత పడమర దిశకు క్లాక్ వైజ్ దిశకు పూర్తి చేస్తా.. 27 ఎలక్షన్ వార్డులు ఏర్పడినవి అనెడు ప్రకటనలు ముసాయిదా విభజన హద్దులను దర్శి పురపాలక సంఘం కార్యాలయం, సబ్ రిజిస్టర్ వారి కార్యాలయం, దర్శి తహసీల్దార్ కార్యాలయం, దర్శి ప్రధాన తపాలా కార్యాలయం, దర్శి పరిధిలోని అన్ని వార్డు సచివాలయాల నోటీసు బోర్డు నందు ప్రజల సౌకర్యార్థం ఉంచినట్లు తెలిపారు. ముసాయిదా వార్డు విభజనకు సంబంధించి ప్రజల సూచనలు, సలహాలను వచ్చే నెల 6వ తేదీ లోపల దర్శిలోని పురపాలక సంఘం కార్యాలయం నందు సమర్పించాలని కోరారు.

## స్వచ్ఛతాహి కార్యక్రమం పరిశుద్ధతే ప్రధాన ప్రథమ కర్తవ్యం



**దర్శి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
ప్రజల ఆరోగ్య రక్షణ, పట్టణ అభివృద్ధి కోసం స్వచ్ఛత హి కార్యక్రమాన్ని వార్డు స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని దళిత బహుజన రిసోర్సు సెంటర్ దర్శి ఏరియా కోఆర్డినేటర్ గుంటూరు నాగమణి తెలియజేశారు. సోమవారం దర్శి బహుజన రిసోర్సు సెంటర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి నిర్వహించిన కార్యక్రమం దర్శి మండల పురపాలక సంఘం పరిధిలోని సాయి నగర్ నందు నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ప్రజలకు పరిశుభ్రత ప్రాముఖ్యత గురించి వివరిస్తూ, శుభ్రమైన పరిసరాలు ఉండటం వలన రోగాలు దూరం అవుతాయన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, వార్డులోని ప్రజలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ కౌన్సిల్ సమావేశం





**చీరాల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
చీరాల మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశం సోమవారం జరిగింది.ఈ సమావేశానికి ఛైర్మన్ మించాల సాంబశివరావుఅధ్యక్షత వహించారు. నియోజకవర్గ అభివృద్ధి పనుల కోసం అజెండాలో పొందుపర్చిని అంశాలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఆమోదించారు.సమావేశానికి ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కౌన్సిల్ హాల్లో జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే కొండయ్య మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా చీరాల తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు ఆదేశించారు..ఇటీవల జరిగిన అసెంబ్లీలో చీరాల నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులపై చర్చించడం జరిగిందని, ముఖ్యంగా కుందేరు, రైల్వే ఓవర్ బ్రిడ్జి, తీర ప్రాంతాలను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దే అంశాలపై ప్రస్తావించడం జరిగిందని నియోజకవర్గ అభివృద్ధికి సీఎం చంద్రబాబు కృషి చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని అన్నారు.

## రైతులకు ఎల్లప్పుడు అండగా ఉంటా - ఎమ్మెల్యే మద్దులూరి





**చీరాల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
చీరాల మండలం బోయినవారిపాలెంలో తోటవారిపాలెం లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్కీం ద్వారా పంట పొలాలకు నీటిని మోటార్ల ద్వారా అందించేందుకు బటన్ నొక్కి ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ప్రారంభించారు. అనంతరం రైతులతో ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య ఆత్మీయ సమావేశం నిర్వహించారు. గత వైసీపీ ప్రభుత్వంలో లిఫ్ట ఇరిగేషన్ స్కీంలను మూత వేసి రైతులను తీవ్ర సంక్షోభంలో నెట్టివేశాడని, సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగాతిరిగి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంలను ప్రారంభిస్తూ రైతులకు అండగా ఉంటున్నారని చీరాల నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తానని ఎమ్మెల్యే కొండయ్య అన్నారు.

### తప్పిపోయిన పాపను తల్లిదండ్రులకు అప్పగించిన వన్‌టౌన్ పోలీసులు



**చీరాల టౌన్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
చీరాల క్లాత్ మార్కెట్ వద్ద తప్పిపోయిన పాపను చీరాల ఒకటో పట్టణ పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా సీఐ సుబ్బారావు మాట్లాడుతూ జె.పంగులూరు గ్రామానికి చెందిన ఆరాధ్య అనే నాలుగు సంవత్సరాల పాప చీరాల క్లాత్ మార్కెట్ వద్ద తప్పిపోగా మా సిబ్బంది శక్తి టీం ని అలర్ట్ చేసి సాంకేతికత పరిజ్ఞానంతో గంటవ్యవధిలో పాపని గుర్తించి వారి తల్లిదండ్రులకు అప్పగించామన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు పోలీసుల వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్సై రాజ్యలక్ష్మి, శక్తి టీమ్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### పేద విద్యార్థికి ఆర్థిక సహాయం అందించిన పర్చూరు రోటరీ ప్రతినిధులు



**పర్చూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ ఆధ్వర్యంలో సోమవారం ఇంజనీరింగ్ చదువుతున్న పేద విద్యార్థికి రూ.40వేలు రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ జాగర్లమూడి గ్రామానికి చెందిన పేద విద్యార్థి పల్లపు బాలాజీ ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థికి ఆర్థిక సహాయం అందించడం జరిగింది. ఈ సహాయం దాత సాంబశివరావు సహకారంతో వారి చేతుల మీదుగా విద్యార్థికి అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థి భాగా చదివి అభివృద్దిలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు మానికొండ శ్రీనివాసరెడ్డి, ఏజీ నాగభైరవి శ్రీనివాసరావు, విద్యార్థి అయిన బాలాజీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### అక్షర ఆంధ్రలో అందరూ భాగస్వాములు కావాలి - ఎంపీడీవో అజిత



**తాళ్లూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
సంపూర్ణ అక్షరాస్యత సాధనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఉల్లాస్ అక్షర ఆంధ్ర కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీవో పి.అజిత అన్నారు. వాలంటరీ టీచర్ల మండల స్థాయి శిక్షణా కార్యక్రమం స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో రెండో విడతలో 3073 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే లక్ష్యంతో మండల పరిధిలోని బొద్దికూరపాడు, వెలుగువారిపాలెం, శివరాంపురం, మన్నేపల్లి సచివాలయం పరిధిలో ఈ కార్యక్రమం నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు వయోజన విద్య పర్యవేక్షకులు వై.చౌడీరెడ్డి వివరించారు. శిక్షణకు హాజరైన స్వచ్ఛంద ఉపాధ్యాయులకు వయోజన విద్యశాఖ ద్వారా సరఫరా చేయబడిన అక్షరాంధ్ర పాఠ్యపుస్తకాలు, వర్కు బుక్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవరాజు, ఎంఈఓ జి.సుబ్బయ్య, సొసైటీ అధ్యక్షులు గొంది రమణారెడ్డి(సమర), నాయకులు శివనాగిరెడ్డి, ఐ.శ్రీనివాసరెడ్డి, సుజాత, సీసీలు, వీఏఓలు పాల్గొన్నారు.

# సరస్వతిదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు



**హనుమంతునిపాడు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
మండలంలోని చిన్న ముప్పళ్ళపాడు గ్రామంలో వెలసిన శ్రీఎశ్రీ బాలత్రిపుర సుందరి సంగమేశ్వర స్వామి వారి ఆలయంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు ఆలయ పూజారి పాపరాజు సుబ్రహ్మణ్య శర్మ, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో భక్తి శ్రద్ధల మధ్య అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. నిత్యం అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. దసరా శరన్నవరాత్రుల 8వ రోజు సందర్భంగా సోమవారం శ్రీశ్రీశ్రీ బాలత్రిపుర సుందరి దేవీ అమ్మవారు సరస్వతి దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారి, సుబ్రహ్మణ్యశర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

## సూపర్‌జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమం



**కొనకనమిట్ల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
పలు రకాల వస్తువులు సేవలపై జీఎస్టీ తగ్గించటంపై సోమవారం అవగాహన కార్యక్రమం మండల పరిషత్ సమావేశపు హాల్‌లో నిర్వహించారు. వైద్య పరికరాలు, వ్యవసాయ పనిముట్లు, వివిద రకాల పోషకాహార పదార్థాలపై తగ్గించిన పట్టికలో పొందుపరిచిన జీఎస్టీ వివరాలపై అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.శ్రీదేవి, డీసీటీఓ సుమన్, సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సరస్వతి దేవి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా

## ఘనంగా సామూహిక అక్షరాభ్యాస వేడుకలు



**సంతనూతలపాడు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
మూలా నక్షత్రం చదువుల తల్లి సరస్వతి దేవి జన్మదినోత్సవ వేడుకల్లో భాగంగా సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో సోమవారం నాడు ఘనంగా సామూహిక అక్షరాభ్యాస వేడుకలు నిర్వహించారు. ఆలయ డైరెక్టర్ సన్నమూరి వెంకట సుశీల, సుబ్బనాచారి దంపతుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మొదట ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో సరస్వతి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి చిన్నారులకు అక్షరాభ్యాసం పూజలను చేపట్టారు. పూజ్య గురువర్యులు కోదాటి కోటేశ్వరరావుచే చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని నిర్వాహకులు సన్నమూరి సుబ్బానాచారి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయాల ఛైర్మన్‌లు దుంపా సుబ్బారెడ్డి, శిఘాకొల్లి ఉమామహేశ్వరరావు, మాజీ ఎంపీపీ దుంపా చెంచిరెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు సాదినేని శ్రీరామమూర్తి, ఆలయాల డైరక్టర్లు, ఆనాల శ్రీనివాసరావు, మద్దిరాల శ్రీనివాసరావు, గుంటూరి రంగనాయకులు, మద్దిరాల అంజమ్మ, గ్రామస్తులు, మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

### త్రిపురాంతకస్వామి వారి ఆలయంలో ఘనంగా మూలా నక్షత్ర వేడుకలు





**సంతనూతలపాడు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
మూలా నక్షత్రాన్ని పురష్కరించుకుని సంతనూతలపాడులోని త్రిపురాంతక స్వామి వారి ఆలయంలో సోమవారం నాడు దేవీ నవరాత్రి ఉత్సవ వేడుకల్లో భాగంగా ఆలయ అర్చకులు ఎస్.బుజ్జిబాబు శర్మ ఆధ్వర్యంలో స్వామి వాళ్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండోమెంట్, దాతలు ఆధ్వర్యంలో ఈ వేడుకలు జరుగుతున్నాయి. మూల నక్షత్రాన్ని పురష్కరించుకుని ఉభయ దాతలుగా శిఘాకొల్లి వెంకటేశ్వరరావు కుమారుడు పవన్‌కుమార్, సత్యవతి దంపతులు, సీనియర్ జర్నలిస్టు శిఘాకొల్లి శ్రీనివాసరావు, విజయలక్ష్మి దంపతులు, ఎస్.తిరుమలరావు శ్రీవల్లి దంపతులు, ఎస్.వెంకట సురేష్ కుమార్, నోము లక్ష్మి దంపతులు, ఎస్.శ్రీనివాసరావు, నోము లక్ష్మి దంపతులు, వేమా చిన్న వెంకట కృష్ణారావు, సుజాత దంపతులు, వెల్లంపల్లి వెంకట నాగలక్ష్మి నరసింహప్రసాద్,లక్ష్మి జ్యోతి దంపతులు సన్నమూరి సుబ్బనాచారి కుమారుడు అరుణ్ కుమార్, లతా దంపతులు పూజలలో కూర్చున్నారు. ఎండోమెంట్ ఈవో ఎన్.నారాయణరెడ్డి, ఆలయ ఛైర్మన్ ఎస్.ఉమామహేశ్వరరావు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో ఈ వేడుకలను పర్యవేక్షించారు. సరస్వతి దేవి జన్మదినంలో భాగంగా దాతలు ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులను పంపిణీ చేశారు. ఉభయదాతలు ఆధ్వర్యంలో వేడుకలకు విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాదాలను పంపిణీ చేశారు.మూల నక్షత్రం వేడుకల్లో భాగంగా అధిక సంఖ్యలో వందలాది మంది భక్తులు తరలివచ్చారు.

### పెద్దదోర్నాలలో శ్రీ సరస్వతి దేవి అలంకరణలో అమ్మవారి వైభవ దర్శనం





**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
శరన్నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా పెద్దదోర్నాల శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో సోమవారం అమ్మవారు శ్రీ సరస్వతి దేవి అలంకరణలో భక్తులకు వైభవంగా దర్శనమిచ్చారు. విద్యా జ్ఞానాల ప్రసాదుకురాలిగా వర్ణించబడే సరస్వతి మాత రూపంలో అమ్మవారిని దర్శించుకోవడం భాగ్యమని భావించిన భక్తులు వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఆలయానికి తరలివచ్చి పూజలందుకున్నారు. వస్త్రాభవరణాలతో పుస్తకం, వీటణ జపమాలతో అలంకరించబడిన అమ్మవారు అద్భుతంగా వెలిగారు. సరస్వతి నమస్తుభ్యం వరదే కామరూపిణి అని ఆలయ అర్చకులు బీదరే రామప్రసాద్ శర్మ మంత్రోచ్ఛరణలతో మార్మోగింది. అమ్మవారి కటాక్షం పొందేందుకు భక్తులు బారులు తీరారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు బీదరే రాంప్రసాద్ శర్మ మాట్లాడుతూ సరస్వతి అలంకరణలో అమ్మవారిని దర్శించుకోవడం విద్య, జ్ఞానము, వాక్పటిమ కలిగించే మహోన్నత శక్తిని ప్రసాదిస్తుందని తెలిపారు.

# మహిషాసుర మర్దనిగా త్రిముఖ దుర్గాదేవి





**సీఎస్‌పురం, సెప్టెంబర్29, ప్రభాతవార్త**
ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం భైరవకోనకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 8వ రోజు సోమవారం ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుండి భక్తులు పోటెత్తారు. త్రిముఖ దుర్గాదేవి మహిషాసుర మర్దని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాల నారాయణరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతీరెడ్డిలు త్రిముఖ దుర్గాదేవి, భర్గలేశ్వర స్వామివార్లకు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే విధంగా జిల్లా ఫీప్ సొసైటీ ఛైర్మన్ తోడేటి గోపి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో డి.వంశీకృష్ణారెడ్డి, ముప్పాళ్ల శ్యామ్ సుందర్ రాజుల ఆధ్వర్యంలో అన్నప్రసాదం వసతి భక్తులకు ఏర్పాటు చేశారు.

# దుర్గమ్మను దర్శించుకున్న కదిరి బాలకృష్ణ



**సీఎస్‌పురం, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి దంపతులతో కలిసి కదిరి బాలకృష్ణ దంపతులు కనకదుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు శాలువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్, తనూజ, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

### అభివృద్ధి లక్ష్యంగా ముందుకు

#### - మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య

**దర్శి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
దర్శి మున్సిపల్ ఛైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య ఆధ్వర్యంలో మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు. భారీ వర్షాలు పడుతుండటంతో సైడ్ డ్రైన్లు, అలానే మేజర్ కాలువ పూడిక తీత, అలానే ఇప్పుడు వచ్చే సీజన్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అంటువ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రతి వార్డులలో మురుగునీరు లేకుండా చూడాలని, బ్లీచింగ్‌ను చల్లాలని ఆయన తెలిపారు. అలానే 20 వార్డులను 27 వార్డులుగా పెంచడం జరిగిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ మహేశ్వరరావు, వార్డు కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



# గోశాల నిర్మాణానికి శంకుస్థాపన పూడికతీత పనులకు శ్రీకారం

### - పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాం - ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



**మార్కాపురం,సెప్టెంబర్ 29,ప్రభాతవార్త**
మార్కాపురం పట్టణ సమీపంలోని కొండపల్లి రోడ్ లో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి గోశాల నిర్మాణానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. చెన్నకేశవ స్వామి ఆలయం ఆధ్వర్యంలో నిర్మించిన గోశాల నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ఎంతో ఆనందంగా ఉంది అన్నారు. అనంతరం గుండ్లకమ్మ వాగు నుంచి మార్కాపురం చెరువు సప్లై ఇచ్చారు సప్లై ఛానల్ పూడిక తీత పనులకు శ్రీకారం పెట్టారు. సప్లై ఛానల్ లో కూడికను పూర్తిస్థాయిలో తొలగించే పనులకు ఎమ్మెల్యే ప్రారంభోత్సవం చేశారు. పటం నడిబొడ్డున ఉన్న సప్లై ఛానల్ లో పేరుకుపోతున్న కూడుక తీర్థ వల్ల దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రమిలే ప్రమాదం ఉన్నందున సత్వరమే పూడికతీతను చేపట్టాలని ఆదేశించడం జరిగిందన్నారు. పూర్తిస్థాయిలో సప్లై ఛానల్‌లో ఉన్న కూడికను తీసివేయడం జరుగుతుందన్నారు. సప్లై ఛానల్ నుంచి వచ్చే దుర్గంధంతో వ్యాధులతో ప్రమాదం ఉన్నంతన అంటువ్యాధులు ప్రమల కొండ చర్యలు తీసుకున్నామన్నారు. పెద్ద ఎత్తున పారిశుధ్య పనులకు శ్రీకారం చుట్టడం జరిగిందని, ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం కృషి చేస్తున్నమన్నారు. సప్లై ఛానల్ పరిసర ప్రాంత ప్రజలు చెత్త చెదారని సప్లై ఛానల్ వేయకుండా మీ ఇంటి వద్ద డబ్బాల వేసుకొని మున్సిపాలిటీ పారిశుధ్య కార్మికులకు అప్పజెప్పాలన్నారు. ఎక్కడపడితే అక్కడ చెత్త వేయడం వల్ల పేరుకుపోయి దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రముల ప్రమాదం ఉందని ప్రతి ఒక్కరూ పారిశుద్ధం విషయంలో ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మార్కాపురం పట్టణంలో కేవలం 20 రూపాయలకే భోజనం సరఫరా చేసే హోటల్ ను ఎమ్మెల్యే ప్రారంభించారు. న్యాయవాది గజ్జి అనిల్ కుమార్ కార్యాలయాన్ని కూడా ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే తో పాటు మార్కెట్ కమిటీ ఛైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి,వాణిజ్య విభాగం జిల్లా మాజీ అధ్యక్షులు వక్కలగడ్డ మల్లికార్జునరావు, అల్లుడు కౌన్సిలర్లు, మున్సిపల్ ఉద్యోగులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



# సరస్వతీ దేవీ అలంకార దర్శనం

- ఆకట్టుకున్న ఎనిమిదో రోజు ఉత్సవాలు... అలరించిన కోలాటాలు ..
- విరివిగా పాల్గొన్న భక్తులు




**మార్కాపురం, సెప్టెంబర్ 29,ప్రభాతవార్త**
శరన్నవరాత్రుల ఎనిమిదవ రోజు ప్రకాశం జిల్లా మార్కాపురం లోని విజయ థియేటర్ సమీపాన ఉన్న పెద్దమ్మ శ్రీ నాగేంద్ర కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారు సరస్వతీ దేవి అవతారంలో దర్శనమిచ్చారు. అర్చకులు పోచంబొట్ల ఉదయ్ కిరణ్ శర్మ, అప్పలాచార్యులు ఆధ్వర్యంలో అభిషేకం, అలంకారం, నైవేద్యం, దీపారాధనలు ఘనంగా నిర్వహించ బడ్డాయి. శరన్నవరాత్రులలో అమ్మవారు ప్రతిరోజూవిభిన్నంగా అలంకరించ బడ్డారు. కనకదుర్గాదేవి, బాలత్రిపురసుందరి,అన్నపూర్ణా, వైష్ణవి మాత, రాజరాజేశ్వరి,కాత్యాయనీ, సంతానలక్ష్మి అవతారాల్లో భక్తులకు దర్శన మిచ్చారు. ఆలయంవిద్యుత్ దీపాలతో, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించబడింది. మహిళలు సంప్రదాయబద్ధంగాకుంకుమార్చనలు నిర్వహించగా, భవానీ భక్తులు మాలధారణతో పూనకాలు, కీర్తనలు,నృత్యాలు చేసి భక్తులను ఆకట్టుకున్నారు. చిన్నారుల పాటలు,శ్లోకాలు, కోలాటాలు, పెద్దల సహకారంతో నిర్వహించిన పోటీలు సందడి చేశాయి.ఈ ఉత్సవాల నిర్వహణను దేవస్థానం కమిటీ శ్రద్ధగా చేపట్టింది. అధ్యక్షులు చదలవాడ అల్లూరి రెడ్డి, కార్యదర్శి భోదనపు వెంకటరెడ్డి, కోశాధికారి పబ్బిశెట్టి ఆదినారాయణ, గురుభవానులు మేడా రంగ సత్యనారాయణ, దాసరి హరిబాబు పర్యవేక్షణలో అన్ని ఏర్పాట్లు జాగ్రత్తగా చేపట్టారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పానీయం, ప్రసాదం, దర్శన సదుపాయాలు అందుబాటులో ఉంచారు.

## పత్రికలకు సమాచారం ఇవ్వని అధికారులపై చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ రాజాబాబుకు ఫిర్యాదు చేసిన జర్నలిస్టులు



**కనిగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
కనిగిరి మండలంలోని పలు ప్రభుత్వ శాఖల అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వకపోవడం పట్ల జర్నలిస్టులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం పవిత్ర ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబుకు వినతిపత్రం అందజేస్తూ అధికారులు పత్రికలకు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గ్రామీణ నీటి సరఫరా(ఆర్‌డబ్ల్యూఎస్), రోడ్స్ అండ్ బ్రిడ్జెస్(ఆర్‌అండ్‌బి), ఎక్సైజ్, అటవీ, మత్స్య, ఇరిగేషన్, ఆర్డీఓ, పంచాయతీ రాజ్, వెలుగు, ప్రజా ఆరోగ్య- వైద్యశాఖ, హౌసింగ్, సామాజిక సంక్షేమ, విద్యుత్, అగ్ని మాపక, పశుసంవర్ధక, పౌర సరఫర, పట్టణ పేదరిక నిర్మూలన(మెప్మా), కార్మిక, విద్యాశాఖ అధికారులు మీడియాకు అవసరమైన సమాచారాన్ని ఇవ్వడం లేదని జర్నలిస్టులు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు కూడా లేకపోవడం విచారకరమని తెలిపారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజల్లో సందిగ్ధం నెలకొంటోందని దరఖాస్తులలో తప్పిదాలు జరుగుతున్నాయని, నిజమైన లబ్దిదారులు పథకాలను సద్వినియోగం చేసుకోలేకపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు మీడియాకు సమాచారం అందిస్తే, పథకాల అమలు మరింత పారదర్శకంగా జరిగి ప్రజలకు నేరుగా లబ్ది చేకూరుతుందని జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. అధికారులు సమయానికి పత్రికలకు సమాచారం అందించేలా ఆదేశాలు జారీ చేయాలని, పథకాల అమలు, అర్హతలు, లబ్దిదారుల వివరాలు పత్రికలకు నిరంతరంగా అందే విధానాన్ని ఏర్పాటు చేయాలని, అవసరమైతే నెలకోసారి మీడియా బ్రీఫింగ్‌లు నిర్వహించేలా చూడాలని కలెక్టర్‌ను కోరారు. జర్నలిస్టుల వినతిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ పి.రాజాబాబు ఈ అంశాలపై సమగ్ర విచారణ జరిపి అవసరమైన చోట్ల సంబంధిత అధికారులకు స్పష్టమైన సూచనలు ఇస్తానని హామీ ఇచ్చారు. మీడియాతో సమన్వయం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

# 8వ వార్డు సమస్యలపై కలెక్టర్‌కి విన్నపం

- డంపింగ్ యార్డు తొలగించి అంగన్‌వాడీ నిర్మించాలి



**కనిగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
కనిగిరి మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు షేక్ ఫిరోజ్ నేతృత్వంలో 8వ వార్డు అధ్యక్షుడు షేక్ రీటా ఫయాజ్ సమస్యలు పరిష్కరించాలని విన్నపం సోమవారం పవిత్ర ఫంక్షన్ హాల్లో ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్ పి.రాజాబాబుకు సమర్పించబడింది. 8వ వార్డు ప్రజలు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సహా వార్డు అధ్యక్షుడు షేక్ రీటా ఫయాజ్ గ్రంధాలయం పక్కనున్న డంపింగ్ యార్డును తొలగించి ఆ ప్రదేశంలో అంగన్‌శాడీ కేంద్రాన్ని నిర్మించాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు దీర్ఘకాలంగా ఎదుర్కొంటున్న పర్యావరణం, ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో తక్షణ చర్యలు తీసుకోవాలని విన్నపం చేశారు.

## బాలాజీ ఫిజియోథెరపీ రిహాబిటేషన్ క్లినిక్ ప్రారంభించిన యారవ శ్రీనివాసులు



**పామూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
పామూరు పట్టణంలో సోమవారం నెల్లూరు రోడ్డు నందు నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ బాలాజీ ఫిజియోథెరపీ రిహాబిటేషన్ క్లినిక్‌ని యారవ శ్రీనివాసులు ప్రారంభించారు. క్లినిక్‌ని సందర్శించి అక్కడ కల్పించిన సౌకర్యాల గురించి డాక్టర్ మహేష్‌ని అడిగి తెలుసుకున్నారు. యారవ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇక్కడకు వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి వారి మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఫిజియోథెరపి రిహాబిటేషన్ సెంటర్‌ను ప్రారంభించిన డాక్టర్ మహేష్‌ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు బొల్లా నరసింహారావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, టౌన్ అధ్యక్షులు అమీర్ బాబు, ఉపాధ్యక్షులు ఇర్రి కోటిరెడ్డి, వరికుంటపాడు జడ్పీటీసీ రావెళ్ల నాగేంద్ర, దారపనేని రాజేశ్వరరావు, గడ్డం శేషాద్రి, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పేద రోగులకు ఆపన్నహస్తం.. స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు




**కనిగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం స్నేహహస్తం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో రోగులు, వారి బంధువులు, పేదవారికి ఉచిత భోజన వసతి కల్పించారు. ట్రస్టు సభ్యులు స్వయంగా భోజనం పంపిణీ చేస్తూ ప్రేమ- పరమార్ధంతో ఆదుకోవాలనే సంకల్పాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు కన్వీనర్ సుధీర్ బాబు మాట్లాడుతూ పేదవారికి ఆహారం సమకూర్చడం చాలా ఆనందం అనినిస్తోంది. మనం చేసిన చిన్న సహాయం కూడా ఎన్నో కుటుంబాల్లో ఆశ నింపగలదు. ఈ ప్రయత్నం నిరంతరంగా కొనసాగుతూ మరెందరికో ఉపశమనం కలిగించాలని కోరుకుంటున్నాం అని అన్నారు. ఆసుపత్రిలో చేరిన అనేక మంది రోగులు, వారి బంధువులు, అలాగే ఆహార వసతి లేక ఇబ్బంది పడే పేదవారు ప్రతి సోమవారం జరిగే ఈ సేవలతో ఆనందం వ్యక్తం చేశారు. ట్రస్టు సభ్యులు ఈ సందర్భంగా భవిష్యత్తులోనూ పేదలకు భోజన వసతి, వైద్య సహాయం అందిచేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాల సిబ్బంది, స్నేహహస్తం సభ్యులు వెంకటేశ్వర్లు, గౌస్ కాశింపీరా, ఇమామ్ హుస్సేన్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## గింజాల వారి గృహప్రవేశానికి హాజరైన
# వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జీ దద్దాల నారాయణ



**కనిగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
కాకినాడ వలసపాకలలో సోమవారం న్యాయమూర్తి గింజాల గంగరాజు- పద్మ నూతన గృహ ప్రవేశ వేడుకకు కనిగిరి నియోజకవర్గం వైఎస్సారీసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్ హాజరై కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ మీ కొత్త ఇంటిలో ఆనందం, ప్రేమ, శాంతి, శ్రేయస్సు ఉండాలని కోరుకుంటున్నాను అని ఆకాంక్షించారు. వివిధ సంఘాల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. వీరిలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు లాకా వెంగళరావు యాదవ్, కార్యదర్శి గోన గురవయ్య యాదవ్, రాజమండ్రి సిటీ యాదవ సంఘం అధ్యక్షులు కుండల సాయికుమార్ యాదవ్, పాండిచ్చేరి యాదవ సంఘం అధ్యక్షులు సురేష్ యాదవ్, సైకం ఏడుకొండలురెడ్డి, అలాగే పలువురు జడ్జీలు, డాక్టర్లు పాల్గొన్నారు.



## నూతన జీఎస్టీ విధానంతో పేద, మధ్య తరగతి వర్గాలకు అధిక ఆదా

**నాగులుప్పలపాడు,సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
నాగులుప్పలపాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో, మండల వెలుగు సమైక్య కార్యాలయంలో విడివిడిగా నూతన జీఎస్టీ పాలసీ గురించి పేద మధ్య తరగతి వర్గాలకు వనగూరే ఆదాయ లబ్దిని గురించి సమీక్షించడం జరిగింది. రోజువారి ఉపయోగించే చాలా వస్తువులపై నూతన జీఎస్టీ పాలసీలో 0శాతం నుంచి 5 శాతం వరకు ప్రధానంగా రెండు పనులు మాత్రమే అమలు చేయనున్నారు. 99శాతం వస్తువులు, సేవలపై పన్ను రహితంగా ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు అక్టోబర్ 18వ తేదీ వరకు అన్ని గ్రామ పంచాయతీలలో డోర్ టు డోర్ క్యాంపెయిన్ ద్వారా జీఎస్టీ ఫలితాలపై అవగాహన కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం నుండి బస్టాండు సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటుచేసి ఈవిషయంపై పలువురు మాట్లాడటం జరిగింది.ఈకార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి తేళ్ల రవికుమార్, జీఎస్టీ టిఅసిస్టెంట్ కమీషనర్ టి.ఏడుకొండలు, డిప్యూటీ ఎంపీడీవో ఎన్.మురళీ మోహన్,ఏపీవో డి.రవిబాబు,ఏపీఎం బి.నరేంద్ర ,సచివాలయ సిబ్బంది, మహిళా సమైఖ్య సభ్యులు,ఉపాధి హామీ పథకంసిబ్బంది, ఎంపీడీవో కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# అన్యాయాలు, అక్రమ కేసులకు భయపడం..

- కూటమి ప్రభుత్వ దాష్టీకానికి గుణపాఠం తప్పదు..
- కార్యకర్తలపై జరిగే ప్రతి ఘటన నమోదు ఇబ్బందులకు గురి చేసే ఏ ఒక్కరూ తప్పించుకోలేరు
- డిజిటల్ బుక్ ఆవిష్కరణలో మాజీ ఎమ్మెల్యే, వైకాపా ఇన్చార్జి అన్నా






**మార్కాపురం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**
అన్యాయాలు, అక్రమ కేసులకు ఏ ఒక్కరూ భయపడే ప్రసక్తే లేదని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైకాపా ఇన్చార్జ్ అన్నా వెంకట రాంబాబు హెచ్చరించారు. మార్కాపురం పట్టణంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం జరిగిన డిజిటల్ బుక్ ఆవిష్కరణలో రాంబాబు మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్యాయాలు అక్రమ కేసులు పెరిగిపోయాయి అన్నారు. భౌతిక దాడులు, అక్రమ కేసులు,బెదిరించడం వంటి సంఘటనలకు కూటమిప్రభుత్వం హయాంలో జరుగుతున్నా యన్నారు. అన్యాయాన్ని ప్రశ్నిస్తే దాడులు, ఇదేమిటని నిలదీస్తే అక్రమ కేసులు, వైకాపా శ్రేణులపై భౌతిక దాడులు ఇటువంటి దాష్టీకానికి కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వైయస్సార్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కార్యకర్తలు, నాయకులపై జరిగే సంఘటనలపై డిజిటల్ బుక్ లో నమోదు చేయించడం జరుగుతుందన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో కార్యకర్త ,నాయకులు పై జరిగే ప్రతి ఘటనను నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. పాలకులు, అధికారులు నుంచి ఎదురయ్యే ప్రతి ఘటన డిజిటల్ బుక్‌లో న్యాయం కోసం నమోదు చేసుకోవడం జరుగుతుందన్నారు. తప్పుడు విధానాలను,ఎదురయ్యే అన్యాయాలను ఎప్పటికప్పుడు నాయకులు కార్యకర్తలు డిజిటల్ బుక్‌లోని క్యూర్‌ఆఫ్ కోడ్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు.కూటమి ప్రభుత్వం రెడ్ బుక్ ద్వారా నాయకులను ,కార్యకర్తలను , అధికారులను వేధించడం పనిగా పెట్టుకుంది అన్నారు. రెడ్ బుక్కు విధానంతో అరాచకాలను సృష్టిస్తూభయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. బాధిత నాయకులు, కార్యకర్తలు డిజిటల్ బుక్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషీర్ అలీ బేగ్,మండల పార్టీ కన్వీనర్లు మురారి,సలీం,ఎంపీపీలు రామసుబ్బారెడ్డి, మురళీ కృష్ణ యాదవ్, కృష్ణారెడ్డి,జడ్పిటిసి నారు బాపన్ రెడ్డి, చెంచిరెడ్డి, శ్రీశైలం దేవస్థానం పాలకమండలి మాజీ డైరెక్టర్, కౌన్సిలర్ డాక్టర్ కనకదుర్గ, కౌన్సిలర్లు నాగరాజు, వైయస్సార్ పార్టీ నాయకులు గోలమార్ శ్రీనివాస్ రెడ్డి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

# ప్రజల వద్దకే అధికారులు

- పీజీఆర్ఎస్ కార్యక్రమంలో 814 అర్జీలు స్వీకరణ
- తక్షణ పరిష్కారానికి కలెక్టర్ రాజాబాబు ఆదేశాలు
- అధికారులు ప్రతి అర్జీదారుని సమస్యను పరిష్కరించాలి - ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర
- సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ కరపత్రాల ఆవిష్కరణ




**కనిగిరి, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం ప్రకాశం జిల్లాలో చురుకైన రీతిలో కొనసాగుతోంది. ఈ క్రమంలో కనిగిరి డివిజన్ కేంద్రంలో సోమవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు స్వయంగా హాజరై ప్రజల అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, కనిగిరి మున్సిపల్ చైర్మన్అబ్దుల్ గఫూర్, జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, ఆర్డీఓ కేశవర్ధన్‌రెడ్డి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు శ్రీధర్‌రెడ్డి, పార్థసారధి, జాన్సన్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలు విస్తృతంగా హాజరై తమ సమస్యలను నేరుగా అధికారులకు అందజేయడం విశేషం.

### 814 అర్జీలు.. రెవెన్యూ సమస్యలే ఎక్కువ :
జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో మొత్తం 814 అర్జీలు స్వీకరించామని, వాటిలో 763 అర్జీలు రెవెన్యూ సంబంధిత సమస్యలుపైన ఉన్నాయని వివరించారు. మిగతా అర్జీలు ఇతర విభాగాలకు చెందినవని అన్నారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సంబందిత శాఖ అధికారులకు అప్పగించి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి అర్జీ వెనుక ఒక కుటుంబం ఆశలు ఉంటాయి. ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం ఉండరాదు. ప్రతి అర్జీపై క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి నాణ్యమైన పరిష్కారం చూపాల్సిన బాధ్యత అధికారులపై ఉందని కలెక్టర్ స్పష్టం చేశారు.

### ప్రజలకు చేరువగా ప్రభుత్వం :
ప్రకాశం జిల్లా విస్తీర్ణం ఎక్కువగా ఉండటంతో ప్రజలు జిల్లా కేంద్రానికి చేరుకోవడం కష్టతరం కావడంతోనే పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ఈ విధానం వల్ల ప్రజలకు ప్రయాణ వ్యయాలు, ఇబ్బందులు తగ్గి, వారు సులభంగా అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకురావచ్చని చెప్పారు. ప్రతి వారం ముఖ్యమంత్రి కార్యాలయం ఉన్నతాధికారులు పీజీఆర్ఎస్ అర్జీల పరిష్కారంపై ప్రత్యేకంగా సమీక్ష నిర్వహిస్తున్నారని, జిల్లా స్థాయి అధికారులు దీనిని అత్యంత ప్రాముఖ్యంగా తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

### రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు :
జిల్లాలో ఎక్కువ అర్జీలు రెవెన్యూ సమస్యలపై రావడంతో రెవెన్యూశాఖ అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి వేగంగా పరిష్కారం చూపించేలా చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వివరించారు. భూమి వివాదాలు, పత్తా రికార్డులు, వారసత్వ సమస్యలు, సర్వే ఇబ్బందులు వంటి అంశాలపై ప్రధానంగా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు.

### సూపర్ జీఎస్టీ.. సూపర్ సేవింగ్స్ :
ఈ సందర్భంగా కలెక్టర్ పి.రాజాబాబు ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ పేద, మధ్య తరగతి వర్గాలకు కేంద్ర ప్రభుత్వం జెస్టీ తగ్గింపుతో సూపర్ గిఫ్ట్ అందించిందని అన్నారు. ఈ లబ్ది ప్రతి వినియోగదారునికి చేరేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. సూపర్ జీఎస్టీ- సూపర్ సేవింగ్స్ పేరుతో అవగాహన కార్యక్రమాలను గ్రామ స్థాయి వరకు విస్తరించాలని , ప్రతి కుటుంబం ఈ లబ్దిని అనుభవించేలా చూడాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి కలెక్టర్ కరపత్రాలను ఆవిష్కరించారు.

### ప్రజల సమస్యలపై ఎమ్మెల్యే దృష్టి :
కనిగిరి నియోజకవర్గానికి సంబంధించిన వివిద సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి కూడా ప్రత్యేక అర్జీలను జిల్లా కలెక్టర్‌కు అందజేశారు. ప్రజల తరుపున సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని ఆయన పేర్కొన్నారు. అధికారులు ప్రతి అర్జీ దారుని సమస్యను అర్ధం చేసుకొని పరిష్కరించాలని కోరారు.

### కలెక్టర్ సందేశం :
జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలు విని, సత్వర పరిష్కారం చూపడం మా బాధ్యత. రాబోయే రోజుల్లో అర్జీల సంఖ్య పెరగకుండా, వచ్చిన అర్జీలకు తక్షణ పరిష్కారం చూపడం ద్వారా అర్జీల సంఖ్య తగ్గాలి. పీజీఆర్ఎస్ అనేది ప్రజలకు అండగా నిలిచే వేదిక. అధికారులు దానిని అత్యంత శ్రద్దతో నిర్వహించాలి అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి నుండి డివిజన్, మండల స్థాయికి చెందిన అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రజలు సమర్పించిన అర్జీలను అదే వేదికలో సంబంధిత అధికారులకు అందజేసి, పరిష్కారానికి మార్గం సుగమం చేశారు.

# హెచ్ఐవీ ఎయిడ్స్‌పై అవగాహన



**నాగులుప్పలపాడు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
హెచ్ఐవీ ఎయిడ్స్ నిర్మూలనకు, మాదక ద్రవ్యాల నిర్మూలన కొరకు గ్రామప్రజలు, గ్రామ సర్పంచ్‌లు, వార్డుమెంబర్లు అందరూ సమిష్టిగా కృషి చేయాల్సిన బాధ్యత ఉందని హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ప్రాజెక్టు డైరక్టర్ బీవీ సాగర్ పేర్కొన్నారు. సోమవారం ఆంధ్రప్రదేశ్ ఏపీ నినియంత్రణ సంస్థ బాపట్ల జిల్లా హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణ సమీకృవ్యూహం దిషా హెల్ప్ స్వచ్ఛంద సంస్థ టీఐ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడు మండలంలోని నాగులుప్పలపాడు తహసీల్దార్ కార్యాలయం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో బీవీ సాగర్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్ వ్యాధి ఎలా సోకుతుంది, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత చూపించకూడదని అన్నారు. అదే విధంగా మాదక ద్రవ్యాల వినియోగం వల్ల చాలా జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాలకు బానిస కాకూడదని తెలియజేశారు. అనంతరం ప్రజావేదికలో పాల్గొన్న ప్రజలను పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హెల్ప్ టీఐ ఔట్రిచ్ వర్క్ ఎం.మల్లేశ్వరి పాల్గొన్నారు.

# సరస్వతి దేవి అలంకారంలో వల్లూరమ్మ



**టంగుటూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
టంగుటూరు మండలం వల్లూరు గ్రామం నందు వెలసిన శ్రీ వల్లూరమ్మ అమ్మవారి దేవస్థానం నందు శ్రీ వల్లూరమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు కుంకుమార్చనలు అమ్మవారికి పూలతో ప్రత్యేక అలంకరణలు చేయటం జరిగింది. దేవి శరన్నవరాత్రులలో భాగంగా శ్రీ వల్లూరమ్మ అమ్మవారు ఎనిమిదవ రోజు శ్రీ సరస్వతి దేవి అలంకారంలో దర్శనం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.రమేష్ తెలిపారు.

# శ్రీశైల మహిమలు





**పెద్దదోర్నాల, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**
దసరా నవరాత్రి ఉత్సవాల్లో దిగువ శ్రీశైలంగా పేరొందిన పెద్దదోర్నాలకు ఎగువ ఉన్నది మహా పుణ్యక్షేత్ర శ్రీశైలం. అత్యంత మహిమోపేతమైన శ్రీశైల మహాక్షేత్రాన్ని లక్షలాది మంది భక్తులు దరిశస్తుంటారు. ఈ క్షేత్రాన్ని దర్శించే విషయంలోనూ సమయంలోనూ ఎందరో భక్తులకు ఎన్నెన్నో అనుభూతులు కలుగుతూ ఉంటాయి. కొందరు భక్తులకు ప్రత్యక్షంగాను, మరికొందరిని పరోక్షంగాను శ్రీశివ క్షేత్ర సందర్శనకు మల్లన్న ముందుకు నడుపుతాడు. శ్రీశైల మల్లిఖార్జున మహిళలు అనంతం. స్వామివారు భక్తులకు వివిధ రూపాలలో దర్శనమిస్తుంటాడు. నల్లమల అరణ్యాల గుండెల్లో ఆవిష్కృతమైన శ్రీశైలం భారతదేశంలోనే అత్యంత ప్రాచీనమైన పుణ్యక్షేత్రాలలో ఒకటి. ఇది ద్వాదశ జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీ మల్లిఖార్జున స్వామి ఆలయం, అలాగే అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటైన శ్రీ భ్రమరాంబ దేవి ఆలయం కలసిన ఏకైక దివ్య క్షేత్రం. అందుకే శ్రీశైలం శివశక్తులు కలిసిన స్థలముగాభక్తుల హృదయాలలో నిలిచిపోయింది.

### పురాణ ప్రాముఖ్యత :

**శివపార్వతుల క్షేత్రం :**
పరమేశ్వరుడు స్వయంగా మల్లిఖార్జున రూపంలో అమ్మవారు భ్రమరాంబ రూపంలో స్థిరించిన పుణ్యస్థలం ఇది.

**పాండవుల తపస్సు :**
మహాభారత యుగములో పాండవులు ఇక్కడ తపస్సు చేసి స్వామి కటాక్షం పొందినట్లు పురాణాలు చెబుతాయి.

**శ్రీకృష్ణదేవరాయల గౌరవం :**
విజయనగర మహారాజులు ఈ దేవాలయానికి అపారమైన కానుకలు సమర్పించి, విస్తృతమైన గోపురాలు మండపాలు నిర్మించారు.

**ప్రకృతి శోభ :**
నల్లమల కొండల నడుమ కృష్ణానది తీరంలో వెలసిన ఈ క్షేత్రము భక్తులకు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి సౌందర్యాన్ని అందిస్తుంది. అరణ్యవాసులే పల్లకి సేవలు, గిరి ప్రదక్షిణలు, కృష్ణానది జలతరంగాలు మొత్తం కలిపి శ్రీశైలానికి అపురూపమైన ఆధ్యాత్మిక కాంతిని ఇస్తాయి.

### భక్తి విశేషాలు :

**జ్యోతిర్లింగ దర్శనం :**
మల్లిఖార్జున స్వామి జ్యోతిర్లింగాన్ని దర్శించుకున్న వారు పునర్జన్మలకు అతీతుల వుతారని నమ్మకం.

**భ్రమరాంబ అమ్మవారి ఆశీస్సులు :**
శక్తిపీట దర్శనం చేసి స్త్రీలు సంతాన సాఫల్యం, కుటుంబ సౌభాగ్యం పొందుతారని విశ్వాసం. పర్వతాలు చుట్టూ చేసే గిరి ప్రదక్షిణలు అత్యంత పవిత్రములుగా భావించబడతాయి.

**కుందుల గుహలు :**
పురాణ మహర్షులు తపస్సు చేసిన ఈ గహలు ఇప్పటికే భక్తి వైభవాన్ని చాటుతాయి.

**ఆధ్యాత్మిక కాంతి :**
శ్రీశైలం దర్శించిన వారికి భక్తి ప్రవాహం మాత్రమే కాదు,ఒక దివ్యానుభూతి కలుగుతుంది. శివశక్తుల కృపతో పాపాల నివృత్తి, మనసుకు శాంతి, జీవితంలో ఆనందం లభిస్తాయని భక్తుల విశ్వాసం. శ్రీశైల మహిమలు ఎంత వర్ణించినా తక్కువే. అది కేవలం క్షేత్రం కాదు. భక్తి, శ్రద్ద, ఆధ్యాత్మికత కలిసిన మహోన్నత పుణ్యక్షేత్రం. కృష్ణానదిలో(పాతాళగంగ) స్నానం చేయాలి.

**పాపనాశన తీర్థ స్నానం :**
ఈ స్నానం చేసిన వారు పూర్వజన్మ పాపాలు తొలగి శారీరక మానసిక తొలుగుతాయని పురాణాలు చెబుతున్నాయి.

**గిరి ప్రదక్షణ :**
నల్లమల పర్వతాలను చుట్టి చేసే గిరి ప్రదక్షణ(సుమారు 35 కి.మీ) అత్యంత పవిత్రమైంది. ఇది సాధ్యం కాని వారు ఆలయం చుట్టూ ప్రదక్షణ చేయవచ్చు.

**మల్లిఖార్జున స్వామి దర్శనం :**
జ్యోతిర్లింగాన్ని శివలింగ రూపంలో ప్రత్యక్షంగా స్పృశించి దర్శించవచ్చు. అభిషేక(పాలు, తేనె, గంగాజలం), రుద్రాభిషేకం, సహస్రనామార్చన.

**భ్రమరాంబ అమ్మవారి దర్శనం :**
అమ్మవారు శక్తిపీఠ రూపంలో కూర్చున్నారు. చండీ హోమము, కుంకుమార్చన, లలిత సహస్రనామ పూజ, చేస్తారు.

**రుద్రాభిషేకం :**
పాప పరిహారము, ఆరోగ్య సుఖం కోసం చేస్తారు.

**కళ్యాణోత్సవం :**
సంతాన సాఫల్యం, దంపతుల సౌభాగ్యం కోసం చేస్తారు.

**లఘు రుద్ర హోమం :** కష్ట నివారణకు

**చండీ హోమం :**
శక్తి సాధన, శత్రు నివారణకు, ధన సమృద్ధి కోసం చేస్తారు.

**సహస్రలింగార్చన :** అశేష పుణ్యఫలాన్ని పొందడానికి చేస్తారు.

**కుంకుమార్చన(అమ్మవారికి) :** గృహ శాంతి, ఐశ్వర్యం కోసం చేస్తారు.శ్రీశైలం దర్శించిన వారికి అష్టైశ్వర్యాలు, శాంతి, సౌభాగ్యం లభిస్తాయి. జీవితంలో ఉన్న కష్టాలు తొలగిపోతాయి. పూర్వజన్మ పాపాలు నివృతిఅవుతాయి. పునర్జన్మ కు అతీతులవుతారని పురాణాలు చెబుతున్నాయి.

MN 9_30-9Pg5.qxd 9/29/2025 10:38 PM Page 1



# ఢాకా నియోజకవర్గంలో 80 వేల ముస్లిం ఓట్లు తొలగింపు..

## బిజెపి స్థానిక నాయకుల నుంచే సిఇఒకు ఫిర్యాదులు




**పాట్నా, సెప్టెంబరు 29:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఓట్‌చోరీ నినాదం మరింతగా ఊపందుకుంది. ఎన్నికల్లో ఒకే ఒక్క నియోజకవర్గంలో ఉన్న ముస్లిం ఓటర్లను భారీ సంఖ్యలో తొలగించాలని బిజెపినుంచే ఎన్నికల సంఘానికి డిమాండ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి ఆధారాలతోసహా విపక్షాలు ఎన్నికల సంఘానికి నివేదించాయి. తూర్పుచంపారన్ జిల్లాలోని ఢాకా నియోజకవర్గంలో సుమారు 80వేల మంది ముస్లిం ఓటర్లను జాబితాలనుంచి తొలగించారన్న దుమారం రేగింది. ఇందుకు సంబంధించి ఈ ఓట్లు తొలగించాలని బిజెపి పాట్నాలోని రాష్ట్ర కార్యాలయంనుంచే లేఖ వచ్చిందని ఎన్నికల సిఇఒకు ఈ లేఖను పంపిస్తూ వారంతా భారతీయ ముస్లింలు కాదని, బోగస్ ఓట్లని తొలగించాలని డిమాండ్‌చేసినట్లు తేలింది. కాషాయపార్టీ బూత్ స్థాయి ఏజెంట్ ధీరజ్‌కుమార్, బిజెపి ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకకుడు పవన్‌కుమార్‌జైస్వాల్‌లనుంచి కూడా ఈసికి ఇవే డిమాండ్లు వచ్చాయని తేలింది. ఓటర్ల జాబితానుంచి 130 మంది ముస్లింల ఓట్లు తొలుత తొలగించారు. ముసాయిదా జాబితా ప్రకటించేందుకు ముందే ఈ తొలగింపు జరిగింది. బీహార్‌లో నిర్వహించిన సర్‌మరింత వివాదాస్పదం అయిందనడానికి ఇదే ఉదాహరణ. ఆగస్టు 19 నుంచి ఈ ఓట్ల తొలగింపు యధేచ్ఛగా సాగిందని విపక్షాలు ఆరోపించాయి. ఢాకాలోని బూత్ స్థాయి ఏజెంట్ తాను ఇచ్చిన ఆధారాలన్నీ సమగ్ర పరిశీలన తర్వాతనే చేసామని ప్రజాప్రాతినిధ్య చట్టం 1950కింద అవసరమైతే శిక్షార్హం ఉన్న సెక్షన్ 31గురించి కూడా తనకు తెలుసునని అన్నారు. ధీరజ్‌కుమార్ ఒక్కరే 78,384ముస్లిం ఓట్లు తొలగించాలని సిఇఒకు ఫిర్యాదులు చేసారు. ఫిర్యాదుతోపాటు వారి పేర్లు ఎపిక్ నంబర్లు కూడా ఇచ్చారు. ఆ తర్వాత బిజెపి స్టేట్ ఆఫీస్‌నుంచి కూడా సిఇఒకు లేఖ వెళ్లింది. ఈ మొత్తం ఓటర్లను తొలగించాలని వీరంతా భారతీయ పౌరులు కాదని తెలిపింది. బీహార్ ఎన్నికల మేనేజ్‌మెంట్ విభాగం తిరుహత్ ప్రమండల్ ప్రభారి నుంచి లోకేష్ అనే పేరుతో ఈ లేఖ వచ్చింది. అయితే తర్వాత ఆరాతీస్తే లోకేష్ అనవారి పేరు పార్టీ ఆఫీసులోనే ఎవ్వరూ లేరని తేలింది. అయితే బిఎల్‌ఎ దాఖలుచేసిన లేఖను మాత్రం బిజెపి నాయకులు కొట్టివేయలేక పోతున్నారు. ఢాకా ఎమ్మెల్యే పవన్ జైస్వాల్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలోనే 80వేల ముస్లిం ఓట్లను తొలగించే కుట్రలు చేసారని ఫుల్వారియా పంచాయత్ సర్పంచ్ ఫిరజ్ ఆలమ్ పేర్కొన్నారు. అలాగే బిజెపి ఫిర్యాదులో చందన్‌బారా గ్రామంలో కూడా ఐదువేల ఓట్లు తొలగించాలని సూచించారు. ఢాకా నియోజకవర్గం ఇండోనేపాల్ సరిహద్దులో ఉంది. వాస్తవానికి కాంగ్రెస్ పట్టున్న ఈ ప్రాంతంలో తర్వాత ఆర్జేడి పట్టుసాధించింది. ఆతర్వాత బిజెపి చేతుల్లోకి వెళ్లింది.

## గ్యాంగ్‌రేప్‌పై వాయవ్యబంగ్లాదేశ్‌లో హోరెత్తిన నిరసనలు




**చిట్టగాంగ్, సెప్టెంబరు 29:** బంగ్లాదేశ్‌లో ఓ గిరిజన బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం స్థానికంగా జాతుల మధ్య చిచ్చు రాజేసింది. ఆదివాసీ తెగలకు, వలస వచ్చిన బెంగాలీ వర్గాలకు మధ్య చెలరేగిన తీవ్ర ఘర్షణల్లో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా, సైనికులు, పోలీసులు సహా పదుల సంఖ్యలో ప్రజలు గాయపడ్డారు. భారీగా భద్రతా బలగాలను మోహరించినా హింస అదుపులోకి రాకపోవ డంతో ఆగ్నేయ బంగ్లాదేశ్‌లోని పలు ప్రాంతాల్లో భయానక వాతావరణం నెలకొంది. భారత్‌మయన్మార్ సరిహద్దుల సమీపంలోని చిట్టగాంగ్ కొండ ప్రాంతమైన ఖగ్రాఛారి జిల్లాలో మంగళవారం ఎనిమిదో తరగతి చదువుతున్న ఓ గిరిజన బాలిక ట్యూషన్ నుంచి ఇంటికి తిరిగి వస్తుండగా సామూహిక అత్యాచారానికి గురైంది. అర్ధరాత్రి సమయంలో అపస్మారక స్థితిలో ఉన్న ఆమెను గుర్తించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశాయి. శనివారం నుంచి నిరసనలు ఉద్ధృతం చేసి, టైర్లు కాల్చి, చెట్లను అడ్డంగా వేసి రహదారులను దిగ్బంధం చేశాయి. దీంతో ఆదివారం నాటికి ఈ ఆందోళనలు హింసాత్మక ఘర్షణలుగా మారాయి. ఖగ్రాఛారి జిల్లా కేంద్రంలో మొదలైన అల్లర్లు క్రమంగా ఇతర ప్రాంతాలకూ వ్యాపించాయి. ఇరు వర్గాల వారు ఒకరి వ్యాపార సముదాయాలపై, ఇళ్లపై మరొకరు దాడులు చేసుకుంటూ నిప్పు పెట్టారు. దీంతో జిల్లా కేంద్రానికి 36 కిలోమీటర్ల దూరంలోని గుయిమారా ప్రాంతంలో పరిస్థితి చేయిదాటింది. అక్కడ జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారని డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ అహ్సన్ హబీబ్ మీడియాకు తెలిపారు. మృతదేహాలను ఖగ్రాఛారి సదర్ ఆసుపత్రికి తరలించినట్లు ఆయన చెప్పారు. మృతులు ఏ వర్గానికి చెందినవారో అధికారులు వెల్లడిం చలేదు. ఈ ఘర్షణల్లో 13 మంది సైనికులు, ముగ్గురు పోలీసులు కూడా గాయపడినట్లు హోం మంత్రిత్వ శాఖ ప్రకటించింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు జిల్లా యంత్రాంగం ఖగ్రాఛారి పట్టణంలో, సమీప ప్రాంతాల్లో సెక్షన్ 144 విధించింది. సైన్యం, సరిహద్దు భద్రతా దళం (బిఎస్‌ఎఫ్), పోలీసులు గస్తీ కాస్తున్న ప్పటికీ, ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయ పడుతున్నారు. అక్కడ కర్ఫ్యూ వాతావరణం నెలకొందని స్థానిక జర్నలిస్టులు తెలిపారు. ఈ ఘటనపై విచారం వ్యక్తం చేసిన బంగ్లాదేశ్ హోం శాఖ, తక్షణమే దర్యాప్తు జరిపి దోషులను కఠినంగా శిక్షిస్తామని హామీ ఇచ్చింది. ప్రజలం దరూ సంయమనం పాటించాలని కోరింది. కాగా, బాలికపై అత్యాచారం కేసులో సైన్యం సహాయంతో ఓ బెంగాలీ యువకుడిని అరెస్టు చేసిన పోలీసులు, కోర్టు ఆదేశాలతో ఆరు రోజుల కస్టడీకి తీసుకుని విచారిస్తున్నారు.

## హోంవర్క్ చేయలేదని విద్యార్థిని తలకిందులుగా వేలాడదీసి చిత్రహింసలు

**పానిపట్, సెప్టెంబరు 29:** హర్యానా రాష్ట్రంలో దారుణ ఘటన చోటు చేసుకుంది.



హోమ్‌వర్క్ చేయలేదన్న కారణంతో ఓ చిన్నారిని కిటికీకి తలకిందులుగా వేలాడదీసి చితకబాదారు. ఈ అమానవీయ ఘటన పానిపట్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చోటు చేసుకుంది. ముఖిజా కాలనీకి చెందిన ఓ కుటుంబం తన ఏడేళ్ల బాలుడిని స్థానిక ప్రైవేట్ పాఠశాల లో చేర్పించింది. రెండో తరగతి చదువుతున్న ఆ చిన్నారి హోమ్‌వర్క్ పూర్తి చేయకపోవడంతో ప్రిన్సిపాల్ రీనా ఆగ్రహం వ్యక్తం చేసింది. స్కూల్లో డ్రైవర్‌గా పనిచేస్తున్న అజయ్ అనే వ్యక్తికి చిన్నారిని శిక్షించమని ఆదేశించింది. ప్రిన్సిపాల్ ఆదేశాలతో సదరు డ్రైవర్ బాలుడిని తాళ్లతో పాఠశాల కిటికీకి తలకిందులుగా వేలాడదీశాడు. అనంతరం చిన్నారిని దారుణంగా కొట్టాడు. అంతటితో ఆగని అజయ్ చిన్నారిని కొడుతున్న దృష్యాలను తమ ఫ్రెండ్స్‌కు వీడియో కాల్ చేసి మరీ పైశాచిక ఆనందాన్ని పొందాడు. ఈ తతంగాన్ని అక్కడే ఉన్న వారు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయగా అదికాస్తా ప్రస్తుతం వైరల్‌గా మారింది. అంతేకాదు, పాఠశాల ప్రిన్సిపాల్ రీనా స్వయంగా చిన్న పిల్లల్ని కొడుతున్న వీడియో కూడా బయటకు వచ్చింది. ఈ వీడియోలు బయటకు రావడంతో స్థానికంగా తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. పాఠశాలల్లో విద్యార్థుల భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది. పలుసార్లు పిల్లలను శిక్షగా టాయిలెట్లను కూడా శుభ్రం చేయిస్తున్నారని పలువురు ఆరోపించారు. ఈ అమానవీయ ఘటనపై బాధిత కుటుంబం పోలీసులను ఆశ్రయించింది. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న మోడల్ టౌన్ పోలీసులు చర్యలు చేపట్టారు. పలు సెక్షన్ల కింద ప్రిన్సిపాల్, ఇతర సిబ్బందిపై కేసు నమోదు చేశారు.




## మెలోనీ ఆత్మకథకు మోడీ ముందుమాట

### మన్ కీబాత్ శీర్షిక నుంచి ప్రేరణ పొందిన పుస్తకం

### ప్రధాని మోడీ ట్వీట్... సోషల్ మీడియాలో వైరల్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** ప్రధాన మంత్రి నరేంద్ర మోడికి ప్రపంచ దేశాధినేతలతో మంచి సంబంధాలు ఉన్నాయి. ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, నరేంద్రమోడి మంచి స్నేహితులన్న విషయం తెలిసిందే. పలు అంతర్జాతీయ వేదికలపై వీరు ఇరువురూ ఎంతో ఆప్యాయంగా పలకరించుకుంటూ అందరినీ ఆకర్షిస్తుంటారు. తాజాగా ఇటలీ ప్రధానమంత్రి మెలోని జీవిత 'ఐయామ్ జార్జియా- మై రూట్స్, మై ప్రిన్సిపల్స్' పేరిట మెలోనీ ఆత్మకథ రాసింది. అందులో ఆమె తన చిన్ననాటి జ్ఞాపకాలు, రాజకీయ, వ్యక్తిగత జీవితం, తల్లిదండ్రులు.. ఇలా తన జీవితంలో జరిగిన సంఘటనలను పొందుపరిచారు. అంతేకాదు, తాను ఎదుర్కొన్న సవాళ్లు, ఎన్నికల ప్రచార సమయంలో గర్భిణిగా, సింగిల్ పేరెంట్‌గా ఎదుర్కొన్న ఇబ్బందులను ప్రస్తావించారు. ఈ ఆత్మకథ 2021లో తొలిసారి మార్కెట్‌లోకి వచ్చి బెస్ట్ సెల్లర్‌గా నిలిచింది. ఇటీవలే అమెరికాలో కూడా ఇది విడుదలైంది. ఇప్పుడు భారత్‌లో అందుబాటులోకి తెచ్చేందుకు మెలోనీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆమెతో ఉన్న స్నేహబంధంతో ప్రధాని మోడి, మెలోనీ పుస్తకంలో ముందుమాట రాశారు. ఈ సందర్భంగా మెలోని ఆత్మకథను 'హర్ మన్ కీ బాత్' గా ప్రధాని అభివర్ణించారు. ఈ పుస్తకంలో ముందుమాట రాయడం తనకు గొప్ప గౌరవంగా పేర్కొన్నారు. ఈ జీవిత చరిత్రకు భారత్‌లో మంచి ఆదరణ లభిస్తుందని మోడి ఆశాభావం వ్యక్తం చేశారు. తన రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' శీర్షిక నుంచి ప్రేరణ పొందిన పుస్తకం ఇది అని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. ప్రస్తుతం ఆ పోస్ట్ వైరల్ కావడంతో మెలోడీ మూమెంట్ మరోసారి తెరపైకి వచ్చింది. మెలోని పుస్తకాన్ని రూపా పబ్లికేషన్స్ ప్రచురించింది. జార్జియా మెలోని ఆత్మకథ భారతీయ ఎడిషన్ త్వరలో దేశంలో అందుబాటులోకి రానుంది.

## కన్సల్టెంట్‌గా రూ.241కోట్లు సంపాదించా: ప్రశాంత్‌కిశోర్



**పాట్నా, సెప్టెంబరు 29:** ఎన్నికల వ్యూహకర్త నుంచి రాజకీయ నాయకుడిగా మారిన ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్ సురాజ్ నిధుల గురించి బీజేపీ ఎంపీ సంజయ్ జైస్వాల్ ప్రశ్నించారు. షెల్ కంపెనీల ద్వారా ఆయన కోట్లు సేకరించారని ఆరోపించారు. 'నష్టాల్లో నడుస్తున్న కంపెనీలు ప్రశాంత్ కిషోర్‌కు మాత్రమే కోట్ల రూ పాయలు ఎందుకు ఇస్తాయి కాంగ్రెస్ పాలనలో(కేంద్రంలో) ప్రతి గ్రామస్తుడికి 'స్కామ్' అనే పదం తెలిసినట్లే, ప్రశాంత్ కిషోర్ ద్వారా రౌండ్‌ట్రిప్పింగ్ అంటే ఏమిటో అందరికీ తెలుస్తుంది' అని అన్నారు. ప్రశాంత్ కిషోర్ ఈ వ్యాఖ్యలపై స్పందించారు. పార్టీ నిధులు పారదర్శకంగా, క్లీన్‌గా ఉన్నాయని తెలిపారు. పలు సంస్థలకు తాను కన్సల్టెంట్‌గా పనిచేసి మూడేళ్లలో రూ.241కోట్లు సంపాదించినట్లు తెలిపారు. 'నేనురూ.31కోట్లు జీఎస్టీగా, రూ.20 కోట్లు ఆదాయపు పన్నుగా చెల్లించా. రూ. 98కోట్లు చెక్ చెల్లింపు ద్వారా జన్‌సురాజ్‌కు విరాళంగా ఇచ్చా'అన్నారు. పార్టీ ఖాతాలకు చెల్లింపులన్నీ చెక్కుల ద్వారా జరిగాయని తెలిపారు. ఇతర వనరుల నుంచి కూడా విరాళాలు అందినట్లు చెప్పారు. మరోవైపు సొంత రాష్ట్రమైన బీహార్‌ను మార్చాలన్న లక్ష్యంతోనే రాజకీయాల్లోకి వచ్చి నట్లు ప్రశాంత్ కిషోర్ తెలిపారు. 'నేను డబ్బు సంపాదించడానికి బీహార్ రాలేదు. నా దగ్గర ఉన్న ప్రతి రూపాయి ప్రభుత్వ పర్యవేక్షణలో ఉన్నది. ఈ వ్యవస్థ మారే వరకు పదేళ్ల పాటు నేను బీహార్‌లోనే ఉంటా' అని అన్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని స్థానాల్లో తన పార్టీ పోటీ చేస్తుందని ఇప్పటికే ఆయన స్పష్టం చేశారు.



## అహల్యనగర్‌లో ఐలవ్ మహ్మద్ ముగ్గులు

### పోలీసులతో నిరసన కారుల వాగ్వాదం

### 30 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

**ముంబయి, సెప్టెంబరు 29:** మహారాష్ట్రలోని అహల్యానగర్‌లో ఒక రోడ్డుపై వేసిన రంగోలిలో ఐలవ్ మహ్మద్ అని రాయడంతో తీవ్ర ఉద్రిక్తతలకు తావచ్చింది. కొంతమంది నిరసనకారులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పరిస్థితిని అదుపుచేసేందుకు పోలీసులు స్వల్ప లాఠీఛార్జికూడా చేయాల్సి వచ్చింది. వెంటనే పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదుచేసి 30 మందిని అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మాట్లాడుతూ శాంతిని భగ్నంచేసేందుకు కొందరు ఈ కుట్రలకు పాల్పడినట్లుగా ఉందని, సమగ్ర దర్యాప్తుచేయాల్సిన అవసరం ఉందన్నారు. పోలీసుల వివరాలప్రకారం అహ్మద్‌నగర్‌లో ఒక రోడ్డుపై వేసిన రంగోలిలో ఐలవ్ మహ్మద్ అని రాసారు. నవరాత్రి వేడుకల సందర్భంగా వేసిన రంగోలిలో కొందరు అభ్యంతరకర వ్యాఖ్యలు చేసారని ముస్లిం సమాజానికి వ్యతిరేకంగా రంగోలిల్లో వ్యాఖ్యలున్నాయన్నారు. ఆ కులస్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదుచేసారని, ఒక వ్యక్తిని అరెస్టుచేసామని, అయితే నిరసన కారులు శాంతించక హైవేను బ్లాక్‌చేయడంతో పోలీస్ చర్యకు దిగాల్సి వచ్చిందన్నారు. మతఘర్షణలు రెచ్చగొడితే కఠిన చర్యలు తప్పవని మహారాష్ట్ర సీఎం హెచ్చరించారు. ప్రస్తుతం తాను ప్రయాణంలో ఉన్నాన,ఇ వివరాలు తెలుసుకుని సగ్ర దర్యాప్తునకు ఆదేశిస్తామన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇలాంటి చర్యలకు కొందరు దిగారని, వాటిని కూడా అణిచివేసామని గుర్తుచేసారు. అంతకుముందు యూపిలో ఈ స్లోగన్ వెలుగులోకి వచ్చింది. యుపిలోని కాన్పూర్‌లో ఐలవ్ మహ్మద్ అన్న నినాదాలతో బోర్డులు వేలాడదీయడంతో అక్కడ ఎఫ్ఐఆర్ నమోదు చేసి 24మందిని అరెస్టుచేసారు. ఈద్‌మిలాద్ ఉన్‌నబీ ఊరేగింపు సందర్భంగా ఈ సంఘటన జరిగింది. హిందూ సంస్థలు ఈ తీరును తీవ్రంగా వ్యతిరేకించాయి. ఇది కేవలం రెచ్చగొట్టే వైఖరి మాత్రమేనని అన్నారు. ఇదే అదునుగా ఐలవ్‌ముహమ్మద్ పోస్టర్లు దేశంలో పలుచోట్ల వెలిసాయి.

# రాహుల్ ఛాతీలో బుల్లెట్ దించుతా!

### బిజెపి నేత వివాదాస్పద వ్యాఖ్యలు

### అమిత్ షాకు కెసి వేణుగోపాల్ లేఖ

### బిజెపి- ఆర్ఎస్ఎస్‌పై నేతల ఆరోపణలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 29:** 'రాహుల్ గాంధీని ఛాతిలో బుల్లెట్ దించి చంపుతా' అంటూ ఏబీవీపీ కేరళ మాజీ చీఫ్, బీజేపీ అధికార ప్రతినిధి ప్రింటు మహదేవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తిరువనంతపురంలో ఓ టీవీ చర్చా వేదికలో ప్రింటు మహదేవ్ చేసిన వ్యాఖ్యలు రాజకీయ దుమారం లేపాయి. లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీకి బహిరంగంగా హత్య బెదిరింపులు రావడం దేశ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. టీవీ చర్చా వేదికలో మహదేవ్ చేసిన వ్యాఖ్యలు పొరపాటున వచ్చినవి కావని, ఉద్దేశపూర్వకంగా చేసినవేనని పేర్కొన్నారు. 'ఇది లోక్‌సభ ప్రతిపక్ష నేతలకు ఇచ్చిన అత్యంత భయంకరమైన, దారుణమైన హత్య బెదిరింపు. అధికార పార్టీకి చెందిన అధికార ప్రతినిధి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం రాహుల్ గాంధీ ప్రాణాలకు తక్షణ ముప్పు కలిగించడమే కాకుండా, రాజ్యాంగాన్ని, శాంతిభద్రతలను కూడా బలహీనపరుస్తుంది' అని వేణుగోపాల్ ఆందోళన వ్యక్తం చేశారు. రాహుల్‌గాంధీ భద్రతకు సంబంధించి సీఆర్‌పీఎఫ్ ఇప్పటికే పలుమార్లు హెచ్చరికలు జారీ చేసిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు రాసిన లేఖ కూడా మీడియాకు లీక్ కావడం వెనుక ఉన్న ఉద్దేశాలపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. 'బీజేపీ సృష్టించిన విద్వేషపూరిత వాతావరణం కారణంగానే వారి నేతలు ఇలాంటి బెదిరింపులకు పాల్పడేంత ధైర్యం చేస్తున్నారు. దీని వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది' అని కేసీ వేణుగోపాల్ ఆరోపించారు. వీటిపై ప్రభుత్వం తక్షణం స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే, ఈ హింసను మీరు ప్రోత్సహిస్తున్నట్లుగానే భావించాల్సి ఉంటుందని అమిత్ షాకు రాసిన లేఖలో వేణుగోపాల్ స్పష్టం చేశారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబం నుంచి వచ్చిన రాహుల్‌గాంధీకి ఇలాంటి బెదిరింపులు రావడం ప్రజాస్వామ్య స్ఫూర్తిపై జరిగిన దాడిగా అభివర్ణించారు.
రాహుల్‌గాంధీని లక్ష్యంగా చేసుకుని ప్రింటు మహదేవ్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ మండిపడింది. బీజేపీ- ఆర్ఎస్ఎస్‌పై తన దాడిని తీవ్రతరం చేసింది. సైద్ధాంతిక యుద్ధంలో ఓడిపోతున్న వారు, వారి దొంగతనం బయటపడిన వారు ప్రతిపక్ష నాయకుడి నోరు మూయించడానికి కుట్ర పన్నుతున్నారని ఆరోపణలు గుప్పించింది. మహదేవ్ వ్యాఖ్యలు హేయమైనవి, హత్య బెదిరింపు అని కాంగ్రెస్ మీడియా సెల్ ఇన్‌చార్జి పవన్ ఖేరా ధ్వజమెత్తారు. తక్షణమే అతడిపై చట్టప్రకారం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


# 'సర్'తో ప్రజల హక్కులకు హాని కలిగించొద్దు

### ఎన్నికల సంఘాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం

**తిరువనంతపురం, సెప్టెంబరు 29:** ప్రతిపాదిత ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ (ఎస్ఐఆర్)పై సందేహాలను వ్యక్తం చేస్తూ, ప్రజల హక్కులకు హాని కలిగించే చర్యలకు ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘాన్ని కోరుతూ కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. ఓటర్ల జాబితాను న్యాయంగా, పారదర్శకంగా సవకరించాలని కోరింది. ఓటర్లకు నిర్దేశించిన అర్హత నిబంధనలపై కేరళ అసెంబ్లీ తీవ్ర అభ్యంతరాలను వ్యక్తం చేసింది. అలాగే పౌరసత్వాన్ని మతం ఆధారితంగా చేయడానికి ప్రయత్నించే పౌరసత్వ చట్టాన్ని పునరుజ్జీవించజేయడానికి ప్రయత్నిస్తున్న విభాగాలు ఎస్ఐఆర్‌ని ఏవిధంగా ఉపయోగిస్తారని, ఇది ప్రజాస్వామ్యానికి అది పెద్ద సవాల్ అని తీర్మానం పేర్కొంది. మైనారిటీ వర్గాలు, మహిళలు, పేద కుటుంబాలు,



షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ప్రవాస భారతీయుల ఓటింగ్ హక్కులపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని అభిప్రాయం వ్యక్తం చేసింది. కేరళలో ఓటర్ల జాబితా ప్రత్యేక అత్యవసర సవరణ చేపట్టేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సిద్ధమవుతున్న క్రమంలో.. ఆ రాష్ట్రంలోని అధికార లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్), ప్రతిపక్ష యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) కలిసి అందుకు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేశాయి.
ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానానికి ప్రతిపక్ష కూటమి మద్దతు తెలిపింది. దాంతో తీర్మానం ఏకగ్రీవంగా సభ ఆమోదం పొందింది. ఎన్నికల జాబితాలో ప్రత్యేక అత్యవసర సవరణ అనేది దేశంలో నేషనల్ పాపులర్ రిజిస్టర్ (ఎన్‌పీఆర్) అమలుకు వెనుక ద్వారం లాంటిదని తీర్మానంలో పేర్కొంది. కాగా కేరళ, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడ్డాయని, ఈ నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో అధికార బీజేపీకి లబ్ధి చేకూర్చే ప్రయత్నం చేస్తోందని దేశంలోని విపక్ష పార్టీల నేతలు విమర్శిస్తున్నారు.



## రూ. లక్షకోట్లు దాటేస్తున్న ఐపిఒలు..

**న్యూఢిల్లీ,సెప్టెంబరు 29:** భారత ఐపీఓ మార్కెట్ 2025లో సరికొత్త రికార్డుల దిశగా దూసుకెళుతోంది. ఇప్పటికే కంపెనీలు భారీగా నిధులు సమీకరించగా, అక్టోబర్‌లో రానున్న రెండు పెద్ద ఐపీఓలతో ఈ ఏడాది కార్పొరేట్‌రంగంలో లక్ష కోట్ల రూపాయల మైలురాయిని అధిగమించనున్నాయి. ఇది భారత ప్రైమరీ మార్కెట్ల చరిత్రలో మూడోసారి కావడం గమనార్హం.ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి 74 మెయిన్‌బోర్డ్ కంపెనీలు ఐపీఓల ద్వారా సుమారు రూ. 85,000 కోట్లను సమీకరించాయి. అక్టోబర్ నెలలో రానున్న రెండు కీలక ఐపీఓలు ఈ మైలురాయిని అధిగమించేందుకు తోడవుతున్నాయి. టాటా క్యాపిటల్ సంస్థ రూ.16,000 కోట్ల భారీ ఐపీఓతో అక్టోబర్ 6 నుంచి 8 వరకు మార్కెట్లోకి రానుంది. అదేవిధంగా, వీవర్క్ ఇండియా కూడా రూ. 3,000 కోట్ల సమీకరణ లక్ష్యంతో అక్టోబర్ 3నుంచి 7 మధ్య తన ఐపీఓను ప్రారంభించనుంది. ఈ రెండు ఆఫరింగ్‌లతో కలిపి 2025లో మొత్తం నిధుల సమీకరణ రూ. లక్ష కోట్లు దాటనుంది. గతంలో 2021, 2024 సంవత్సరాల్లో మాత్రమే ఐపీఓ మార్కెట్ ఈ ఘనతను సాధించింది. 2021లో 63 ఐపీఓల ద్వారా రూ. 1.19 లక్షల కోట్లు సమీకరించగా, 2024లో 91 ఐపీఓలు కలిసి రూ. 1.6 లక్షల కోట్లు రాబట్టాయి. ఈ ఏడాది ఆ రికార్డులు కూడా బద్దలయ్యే అవకాశాలున్నాయి. ఎల్‌జీ ఇండియా కూడా అక్టోబర్ ప్రథమార్ధంలో రూ. 15,000 కోట్ల ఐపీఓకు సిద్ధమవుతుండటంతో, సమీకరణలు మరింత పెరుగుతాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్, గ్రో, ఫైన్ ల్యాబ్స్ వంటి మరిన్ని పెద్ద సంస్థలు కూడా ఈ ఏడాది చివరి నాటికి మార్కెట్లోకివచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నాయి. కేవలం మెయిన్‌బోర్డ్ ఐపీఓలే కాకుండా, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎస్ఎంఈ) విభాగం కూడా ఈఏడాది అద్భుతమైన పనితీరు కనబరుస్తోంది. 2025లో ఇప్పటివరకు 207 ఎస్ఎంఈ ఐపీఓలు రూ. 9,129 కోట్లు సమీకరించి, గత వార్షిక రికార్డులన్నింటినీ అధిగమించాయి. ఒక్క సెప్టెంబర్ నెలలోనే 53 కంపెనీలు రూ. 2,309కోట్లు సేకరించడం ఈ విభాగానికి సంబంధించి ఆల్‌టైమ్ రికార్డు.

## సంక్షిప్తంగా..

### నేను ఎక్కడికి పారిపోను : నేపాల్ మాజీ పిఎం ఓలి



**కట్మాండూ, సెప్టెంబరు 29:** ఇటీవల నేపాల్‌లో జరిగిన జెన్-జెడ్ ఆందోళనల నేపథ్యంలో నేపాల్ మాజీ ప్రధాని కెపి శర్మ ఓలి దేశం వీడి వెళ్లనున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ వార్తలపై ఓలీ స్పందిస్తూ తనపై జరుగుతున్న ప్రచారాన్ని ఖండించారు. తాను దేశం విడిచి ఎక్కడికీ పారిపోనన్నారు. ఎటువంటి ఆధారంలేని ఈ ప్రభుత్వానికి దేశాన్ని అప్పజెప్పి తాను పారిపో తానని అనుకుంటున్నారా? అని పార్టీ యువ విభాగాన్ని ప్రశ్నించారు. ప్రస్తుత ప్రభుత్వం తన భద్రత, అధికారిక హక్కులను రద్దుచేయడానికి ప్రయత్నిస్తోందని ఆరోపించారు. తాను ఎవరికీ భయపడనని దేశంలోనే ఉండి తన రాజకీయ పోరాటాన్ని కొనసాగిస్తానని ఓలీ అన్నారు. దేశంలో శాంతిభద్రతలు, రాజ్యాంగ పాలనను తిరిగి పునరుద్ధరించడానికి కట్టుబడి ఉన్నాన న్నారు. సుశీలా కార్కి నేతృత్వంలోని పరిపాలనకు ఎటువంటి చట్టబద్ధత లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజల తీర్పుతో కాకుండా విధ్వంసం శక్తుల ద్వారా అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఇప్పటికి కూడా తనకు బెదరింపు సందేశాలు వస్తున్నాయన్నారు. నిరసనకారులు తన నివాసాన్ని ధ్వంసం చేయడంతో ప్రస్తుతం గుండు ప్రాంతంలోని అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నట్లు తెలిపారు.

### పాక్‌కు వ్యతిరేకంగా పిఒకెలో భారీ ఆందోళన



**ముజఫరాబాదల్, సెప్టెంబరు 29:** పాకిస్థాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ ఆక్రమిత కాశ్మీర్‌లో అక్కడి ప్రజలు భారీ ఆందోళనలు చేపట్టారు. అవామీ యాక్షన్ కమిటీ (ఎఎసి) నేతృత్వంలో కొనసాగుతున్న ఈ నిరసనలను మరింత ఉధృతం చేయనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. పాక్ ప్రభుత్వం దశాబ్దాలుగా తమను రాజకీయంగా, ఆర్థికంగా అణగదొక్కుతున్నట్లు నిరసనకారులు తెలిపారు. 70 యేళ్లకుపైగా పిఒకెలోని ప్రజలకు ప్రాథమిక హక్కులు కూడా కల్పించలేదని అవామీ కమిటీ నేత షౌకత్ నవాజ్ మీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఒకెలో మౌలిక సంస్కరణలు తీసుకురావాలని, తమ 38 డిమాండ్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 'షటర్-డౌన్.. వీల్-జామ్' పేరుతో అవామీ యాక్షన్ కమిటీ సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ క్రమంలో పిఒకెలోని పలు ప్రాంతాల్లో పౌరులు పాక్ బలవంతపు ఆక్రమణల నుంచి విముక్తి కల్పించాలని నినాదాలు చేస్తూ రోడ్లపైకి వచ్చారు. ప్రభుత్వం తమ డిమాండ్ల విషయంలో చర్చలు జరపడానికి ముందుకు రావాలని అవామీ యాక్షన్ కమిటీ కోరింది. ప్రభుత్వం తమ డిమాండ్లను పట్టించుకోకపోతే నిరసనలను మరింత తీవ్రం చేస్తామని హెచ్చరించింది.

### అసోం బిటిసి ఎన్నికల్లో బోడోపీపుల్స్ ఫ్రంట్ గెలుపు



**న్యూఢిల్లీ,సెప్టెంబరు29:** అస్సాంలో అధికార బీజేపీకి గట్టి షాక్ తగిలింది. 2026లో జరగనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికలకు సెమీఫైనల్‌గా భావిస్తున్న బోడోలాండ్ టెరిటోరియల్ కౌన్సిల్ (బిటిసి) ఎన్నికల్లో కమలం పార్టీకి ఘోర పరాభవం ఎదురైంది. 40 స్థానాలకు గానూ ఆ పార్టీ కేవలం ఐదు స్థానాల్లోనే గెలుపొందింది. ది బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ (బీపీఎఫ్) 28 స్థానాల్లో గెలుపొంది అధికారం చేజిక్కించుకుంది. ఇప్పటివరకు బీజేపీ, యునైటెడ్ పీపుల్స్ పార్టీ లిబరల్ (యూపీపీఎల్) కలిసి కౌన్సిల్ పాలనా పగ్గాలు చేపట్టాయి. తాజా ఎన్నికల్లో ఒంటరిగా పోటీచేసిన బీజేపీ.. అతిపెద్ద పార్టీగా లేదా కింగ్‌మేకర్‌గా నిలవాలని భావించింది. అయితే ఆ పార్టీ ఆశలపై ప్రజలు చావుదెబ్బ కొట్టారు.

### లారెన్స్‌బిష్ణోయ్ గ్యాంగ్‌ను 'ఉగ్ర'సంస్థగా ప్రకటించిన కెనడా



**న్యూఢిల్లీ,సెప్టెంబరు 29:** మాఫియా గ్యాంగ్‌నడిపిస్తున్న లారెన్స్‌బిష్ణోయ్ ఆతడి గ్యాంగ్‌ను కెనడా ఉగ్రవాద సంస్థగా ప్రకటించింది. కెనడా తన నేరస్మృతి చట్టాలనుఅనుసరించి ఈ నిర్ణయం తీసుకున్నదని ప్రజాభద్రతా మంత్రి గ్యారీ ఆనంద సంగారీ సోమవారం ప్రకటించారు. హత్యలు, దోపిడీలు,ఆయుధాలు, డ్రగ్స్ స్మగ్లింగ్‌తో ఢిల్లీలో నోటోరియస్‌గా మారిన లారెన్స్ బిష్ణోయ్ కెనడాలో ఉన్నట్లు భారత్ అనుమానించిన సంగతి తెలిసిందే. నగదు చోరీనుంచి వాహనాలు,ఆస్థుల ఆక్రమణ వంటివి అన్నింటినీ స్వాధీనంచేసుకుంటామని కెనడియన్ చట్టాలను అను సరించి గ్యాంగ్‌సభ్యులపై వివిధ నేరాలకింద ప్రాసిక్యూట్ చేస్తామని ప్రకటించింది.

30-09pg6exHMNWJQE MN 10_30-09pg6exHMNWJQE.qxd 9/29/2025 10:44 PM Page 1



## నక్సలైట్లు విముక్తి భారత్ సాధ్యం

### బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు విష్ణువర్ధన్‌రెడ్డి

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** నక్సలైట్లు విముక్తి భారత్ సాధ్యమేనని బీజేపీ, జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎస్.విష్ణువర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేసారు. ఈ రోజు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో డాక్టర్ శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ రీసెర్చ్ ఫౌండేషన్ నిర్వహించిన భారత్ మంథన్" కార్యక్రమంలో పాల్గొని, నక్సల్ రహిత భారతదేశం" అనే అంశంపై ఆలోచనలను పంచుకున్నానని తెలిపారు. ఈ సమావేశంలో, మావోయిస్టు హింస ప్రభావిత ప్రాంతాలు ఎదుర్కొంటున్న సవాళ్లు, వాటిని అధిగమించడానికి వ్యూహాలపై అభిప్రాయాలను పంచుకున్నట్లు పేర్కొన్నారు. పారామిలిటరీ దళాలు, పోలీసుల ప్రభావవంతమైన భాగస్వామ్యం, కఠినమైన చర్యల కారణంగా, నక్సలిజం నేడు దాని ఉనికి చివరి దశలో ఉందన్నారు. కేంద్ర మంత్రి అమిత్ షా ప్రత్యేక అతిథిగా హాజరై, వామపక్ష తీవ్రవాదంపై ఉక్కుపాదం అవసరాన్ని నొక్కి చెప్పారని విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, విశ్వవిద్యాలయ విద్యార్థులు, నక్సలైట్లు బాధితులు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారని వివరించారు.

## గోరంత చేసి కొండంత చెప్పుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబుకే చెల్లు



**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** గోరంత చేసి కొండత చెప్పుకోవడం ముఖ్యమంత్రి చంద్రబాబు చెల్లుతుందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఆరోపించారు. విజయవాడలో పీసీసీ కార్యాలయం షర్మిల పేరిట సమాచార పత్రం విడుదల చేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో ప్రజలపై మోపిన ట్రూ అప్ భారం రూ.15,780 కోట్లు అని షర్మిల ఆరోపించారు. ఇప్పుడు ట్రూ డౌన్‌తో తగ్గిన భారం కేవలం రూ.923 కోట్లు అన్నారు. 2024- 25 వార్షిక సంవత్సరానికి సర్దుబాటు పేరుతో అదనంగా దోచిన రూ.923 కోట్లను ఈఆర్సీ చెల్లించండని మొట్టికాయలు వేస్తే చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నాడన్నారు. అదేదో కూటమి ప్రభుత్వం ఛార్జీలు తగ్గించిందని చంద్రబాబు చెప్పుకుంటున్నారన్నారు. వినియోగదారులకు భారీ ఉపశమనం ఇచ్చామని, సమర్థత, అనుభవం అని గొప్పలు చెప్పుకోవడం సిగ్గుచేటు షర్మిల వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఛార్జీల తగ్గింపు హామీని నిలబెట్టుకున్నామని ప్రకటించుకోవడం ఈ శతాబ్దపు అతి పెద్ద జోక్ అన్నారు. నిజంగా చంద్రబాబుకి చిత్తశుద్ధి ఉంటే, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయండి. అమలవుతున్న విద్యుత్తు ఛార్జీల్లో 30 శాతం మేర ఛార్జీలు తగ్గిస్తామని ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండమన్నారు. అదనంగా విధించిన రూ.15 వేల కోట్ల సర్దుబాటు ఛార్జీల భారాన్ని తక్షణం ఉపసంహరించుకోవాలని షర్మిల డిమాండ్ చేశారు.

## చట్టసభల సాక్షిగా సీఎం అబద్ధాలు



**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** చట్టసభల సాక్షిగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అబద్ధాలను వల్లె వేశారని వైసిపి ఎమ్మెల్సీ మొండితోక అరుణ్ కుమార్ విమర్శించారు. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎనిమిది రోజుల శాసన మండలి సమావేశాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై కూటమి ప్రభుత్వాన్ని నిలదీశామని తెలిపారు. అసమర్థ పాలనను కప్పిపుచ్చుకునేందుకు ప్రభుత్వం నానా తంటాలు పడిందన్నారు. రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉన్నారంటూ సిఎం సభలో పేర్కొనడాన్ని తప్పుబట్టారు. యూరియా కొరత, గిట్టుబాటు ధరలపై మంత్రులు నీళ్లు నమిలారని చెప్పారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణపై ప్రభుత్వాన్ని నిలదీశామన్నారు. మంత్రి లోకేష్ బూతు భాష, ఎమ్మెల్యే బాలకృష్ణ తాగుబోతు మాటలు వారి సంస్కృతికి అద్దం పడుతున్నాయని పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్‌కే ప్రోటోకాల్ పాటించకుండా అవమానించిందని తెలిపారు. సూపర్ సిక్స్‌పై శాసనమండలిలో అడిగితే మంత్రులు మాట్లాడారని, వారికి సూపర్ సిక్స్, సూపర్ ఫ్లాప్ అని తెలుసని, అయినా ప్రభుత్వాన్ని సమర్థించుకునేందుకు అడ్డగోలుగా మాట్లాడారన్నారు. 6 హామీల్లో ఒక్కటి కూడా పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. స్టీల్ ప్లాంట్‌పై కూటమి ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు.



## శ్వేత కమలాలతో పూజ ద్వారా సరస్వతీ దేవి అనుగ్రహం

**రాపూరు (నెల్లూరు), సెప్టెంబరు 29 ప్రభాతవార్త:** నవరాత్రులలో పంచమి రోజున శ్వేత కమలాలతో పూజ చేయడం ద్వారా సరస్వతీ దేవి అనుగ్రహం లభిస్తుందని భగవాన్ కరుణామయ శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తెలిపారు. పెంచలకోనలోని శ్రీ మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమంలోని మణిద్వీప మహా సంస్థానంలో నిర్వహిస్తున్న దేవి నవరాత్రి ఉత్సవాలలో 8వ రోజైన సోమవారం శ్రీ లలితాంబికా దేవి, శ్రీ మహాలక్ష్మీదేవి, శ్రీ మహాసరస్వతీదేవిలకు, శ్రీ మహా గణపతి, శ్రీ సుబ్రమణ్యేశ్వర స్వాములకు వేదపారాయణం, శ్రీ మహా రుద్రాభిషేకం, శ్రీ లలితాంబికాదేవి, శ్రీ మహా లక్ష్మీదేవి, శ్రీ మహా సరస్వతీ దేవిల ఉత్సవ మూర్తులకు ఆశ్రమ వ్యవస్థాపకులు భగవాన్ కరుణామయ శ్రీశ్రీశ్రీ విజయేశ్వరీ దేవి తన స్వహస్తాలతో అభిషేకాలు, విశేష అర్చనలు, కమలార్చనలు, మహా మంగళ హారతులు నిర్వహించి, భక్తులకు దేవి నవరాత్రి ఉత్సవాల ప్రాముఖ్యతను అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆశ్రమంలోని యాగశాలలో శ్రీ మహాగణేశ హోమం, శ్రీ లలితా సహస్రనామ హోమం, శ్రీ చండీ హోమం, నవగ్రహ శాంతి హోమం, శ్రీ లక్ష్మీ నృసింహ హోమం, శ్రీ సరస్వతీ సూక్త హోమం, శ్రీ మేధా సూక్త హోమం, శ్రీ సుదర్శన హోమం, శ్రీ ధన్వంతరి హోమాలు నిర్వహించి భగవాన్ విజయేశ్వరీ దేవి పూర్ణాహుతిని హోమగుండాలలో సమర్పించారు. సాయంత్రం మణిద్వీప మహా సంస్థానంలో సామూహిక శ్రీ లలితా సహస్రనామ కుంకుమార్చన చేశారు. శ్రీ లలితాంబికా దేవికి శ్రీ మహా సరస్వతి దేవి అలంకారం నిర్వహించారు. హంస వాహనంపై ఆశ్రమంలోని మాడవీధులలో క్షేత్రోత్సవం నిర్వహించారు.

## అమరావతిలో వాతావరణ మార్పులపై సమగ్ర అధ్యయనం



- అధ్యయనం చేస్తున్న ఇక్లీ
- వచ్చే అక్టోబర్ నెలాఖరుకు నివేదిక

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** రాజధాని అమరావతి నగరంలో వాతావరణంపై సమగ్ర విశ్లేషణ జరుగుతోంది. వాతావరణ మార్పులకు సంబంధించి గత వాతావరణ గణాంకాలను ఇక్లీ సంస్థ సిబ్బంది విశ్లేషిస్తున్నారు. జాతీయ హరిత ట్రిబ్యునల్ సూచన మేరకు రాజధాని నగరానికి సంబంధించి వాతావరణ మార్పులపై సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధమవుతోంది. 2058 నాటికి వాతావరణ మార్పుల కారణంగా సంభవించే దుష్ఫలితాలను నివారించేందుకు సీఆర్డీఏ తయారు చేయిస్తోంది. కర్బన ఉద్గారాలను కనిష్ఠ స్థాయికి తీసుకెళ్లాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. బహుళ జాతి సంస్థ అయిన ఇంటర్నేషనల్ కౌన్సిల్ ఫర్ లోకల్ ఎన్విరాన్‌మెంట్ ఇనీషియేటివ్స్ (ఇక్లీ) ఆధ్వర్యంలో గత నాలుగు నెలలుగా అధ్యయనం సాగుతోంది. అక్టోబరు చివరి నాటికి పూర్తి నివేదికను సమర్పించనుంది. లక్ష్యాలను చేరుకునేందుకు పలు సిఫార్సులను సైతం చేయనుంది. ఉష్ణోగ్రతలు, వర్షపాతం, వాయు నాణ్యతపై ప్రభావం గురించి తెలుసుకునేందుకు ఈ ప్రక్రియ సాగుతోంది. వార్షిక సగటు ఉష్ణోగ్రత ప్రతి ఏటా 0.22 డిగ్రీల సెంటిగ్రేడ్ చొప్పున పెరుగుతోంది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు ప్రతి దశాబ్దానికి 0.2 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర పెరుగుదల కనిపిస్తోంది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా ప్రతి దశాబ్దానికి 0.32 డిగ్రీల సెంటిగ్రేడ్ చొప్పున పెరుగుతున్నాయి. అమరావతిలో భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత 32.74 డిగ్రీల సెంటిగ్రేడ్. రాజధానిని హరిత, నీలి నగరంగా అభివృద్ధి చేయాలన్నది బృహత్ ప్రణాళికలో లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అధిక ఉష్ణోగ్రతలు తగ్గించేందుకు ఇది ఉపయోగపడనుంది. ఖాళీ స్థలాలు, రహదారుల వెంబడి పచ్చదనం పెంచితే భూమి ఉపరితల ఉష్ణోగ్రత 1.5 డిగ్రీల సెంటిగ్రేడ్ మేర తగ్గే అవకాశం ఉందని అధ్యయనంలో గుర్తించారు. పచ్చదనం తక్కువగా ఉన్న అనంతవరం, లింగాయపాలెం, నేలపాడు, వెంకటపాలెం, నవులూరులో అధిక ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తేలింది. 2015 -2024 కాలంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఏటా 4.5 మిల్లీమీటర్ల చొప్పున వార్షిక వర్షపాతం పెరుగుతోంది. పెరుగుదల ప్రధానంగా నైరుతి రుతుపవనాల్లో కనిపించింది. వర్షం పడే రోజులు తగ్గుతున్నాయి. ప్రతి దశాబ్దానికి 2.6 రోజుల చొప్పున తరుగుదల నమోదైంది. కానీ వర్ష తీవ్రత మాత్రం పెరుగుతోంది.

రాజధానికి సంబంధించి నీటి సరఫరా, వృథా నీరు, వర్షపు నీరు, ఘన వ్యర్థాలు, రవాణా, విద్యుత్తు, భవనాలు, ఆరోగ్యం, హరితం, జీవవైవిధ్యం, గాలి నాణ్యత అంశాలపై ఇక్లీ ముమ్మరంగా అధ్యయనం చేస్తోంది. వీటికి సంబంధించి ప్రస్తుత పరిస్థితులు, 2058 నాటికి వాతావరణ మార్పుల కారణంగా తలెత్తే సమస్యలను ఎలా అధిగమించాలన్న దానిపై సూచనలు కూడా ఇవ్వనుంది. ప్రకాశం బ్యారేజి నుంచి అమరావతికి మొదటి దశలో 386 లీలిదీ నీరు, వైకుంఠపురం నుంచి రెండో దశలో 539 లీలిదీ చొప్పున 2058 నాటికి మొత్తం 925ఎంఎల్‌డీ నీరు అవసరమవుతుందని అంచనా. 15 శాతం మేర నీటి నష్టాలు ఉంటాయని సర్వే అధికారులు లెక్కగట్టారు.

2058 నాటికి వృథా నీరు 723 వస్తుందని, ఈ నీటిని శుద్ధి చేసేందుకు 12 ఎస్‌టీపీ, 1సీఇటీపీ నిర్మించాల్సి ఉంది. శుద్ధి చేసిన నీటిలో పచ్చదనం కోసం వినియోగించుకోవచ్చు. రాజధాని నగరంలో 2058 నాటికి రోజుకు 3,956 టన్నుల మేర ఘన వ్యర్థాలు పోగయ్యే అవకాశం ఉంది. ఇందులో తడి చెత్త 2,028 టన్నులు కాగా, పొడి చెత్త 1,436 టన్నులు. ఈ వ్యర్థాలను శుద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ప్రస్తుతం రాజధానిలో విద్యుత్తు వినియోగం 220.5 మిలియన్ కిలోవాట్ అవర్. 2058 నాటికి డిమాండ్ 10,756 మిలియన్ కిలోవాట్ అవర్‌కు చేరుకోవచ్చని అధ్యయనంలో గుర్తించారు. సౌరవిద్యుత్తు డిమాండ్ 7,954 మిలయన్ కిలోవాట్ అవర్‌గా ఉంటుందని అంచనా.



## రాష్ట్రం నుంచి పండుగల ప్రత్యేక రైళ్లు

**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రస్తుత దసరా, దీపావళి, చాత్ పండుగల సమయంలో ప్రయాణీకుల సౌకర్యార్థం రైల్వే శాఖ పండుగ ప్రత్యేక రైలు సర్వీసులను నడుపుతున్నట్లు రైల్వేవర్గాలు తెలిపాయి. తిరుపతి నుంచి హిస్సార్ వెళ్ళే నెంబర్ 07717 ప్రత్యేక రైలును అక్టోబర్ 01 నుంచి నవంబర్ 26 వరకు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే హిస్సార్ నుంచి తిరుపతి వెళ్ళే నెంబర్ 07718 రైలును అక్టోబర్ 05 నుంచి నవంబర్ 30 వరకు పడుతున్నారన్నారు. ఈ రైలు సర్వీసులు తెలుగు రాష్ట్రాల్లో రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, గుంతకల్లు, డోన్, కర్నూలు, గద్వాల, మహబూబ్ నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజిగిరి, మేడ్చల్, కామారెడ్డి, నిజామాబాద్, బాసర, ధర్మాబాద్ స్టేషన్లతోపాటు, మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలుస్తాయి.

### నర్సాపూర్- బెంగళూరు ప్రత్యేక రైళ్లు

నర్సాపూర్ నుంచి బెంగళూరు వెళ్ళే నెంబర్ 07153 ప్రత్యేక రైలు అక్టోబర్ 3 నుంచి డిసెంబర్ 26 వరకు, బెంగళూరు నుంచి నర్సాపూర్ వెళ్ళే నెంబర్ 07154 రైలు అక్టోబర్ 4 నుంచి డిసెంబర్ 27 వరకు తిరుగుతాయి. ఈ రైళ్లు మార్గమధ్యంలో రాష్ట్రంలో పాలకొల్లు, విరసవరం, భీమవరం జంక్షన్, భీమవరం టౌన్, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, కుప్పం తోపాటు, తమిళనాడు, కర్ణాటకలోని ముఖ్యమైన స్టేషన్‌లలో నిలుస్తాయి.



## సెల్ ఇవ్వలేదని సూసైడ్

**ఎమ్మిగనూరు క్రైం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు పట్టణంలోని వెరటాపురం కాలనీ నందు చోటు చేసుకుంది.. వివరాల్లోకి వెళితే.. కాలనీలో నివాసం ఉంటున్నా శేఖర్, శారదకు ఒక కుమారుడు, ఒక కుమార్తె సంతానం. శేఖర్ దసరా సెలవులు కావడంతో ఇంట్లో ఉన్న కుమారుడు పవన్(10) అతిగా సేల్‌ఫోన్ చూస్తూ ఉండటంతో గమనించిన తల్లితండ్రులు మందలించారు. మనస్థాపం చెంది బాత్రూంలోకి వెళ్లి తాళం వేసుకున్నాడు. విషయం గమనించి బాత్రూం తలుపును పగలకొట్టి చూస్తే లోపల పవన్ ఉరికి వేలాడుతున్నాడు. బాలుడిని దించి హుటాహుటిన ఆసుపత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి బాలుడు మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీంతో కొడుకు ఆత్మహత్యను తట్టుకోలేని తల్లిదండ్రులు గుండెలవిసేలా కన్నీరుమున్నీరుగా విలపించారు.

## వర్షాకాలంలో రైలు మార్గాల నిర్వహణపై అప్రమత్తంగా ఉండండి

### రైల్వే భద్రతా సమీక్షలో ఎస్‌సీఆర్ జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ




**గుంతకల్లు రైల్వే, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రస్తుత వర్షాకాలంలో రైలు మార్గాల నిర్వహణను నిత్యం అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా ఎదుర్కోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాత్సవ అన్నారు. సోమవారం రైల్ నిలయం నుండి రైల్వేజోన్ పరిధిలోని వివిధ డివిజన్లలో రుతుపవనాల ప్రభావంపై రైల్వే సిబ్బంది సన్నద్ధత, భద్రతపై ఆయన సమీక్షి ంచారు. జోన్‌కు చెందిన వివిధ విభాగాల ప్రధాన అధికారులతోపాటు గుంతకల్లు డిఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా, అదనపు డిఆర్‌ఎం సుధాకర్‌లతోపాటు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లకు చెందిన డిఆర్‌ఎంలు, ఆయా విభాగాలకు చెందిన సంబంధిత ఉన్నతాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడుతూ వర్షాకాలంలో వంతెనలు, చెరువుగట్లు, సొరంగాలు వాటి నిర్వహణ స్థితిపై ప్రాథమికంగా దృష్టి సారించాలని సూచించారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు అవసరమైన ఇసుక, బండరాళ్లు, పైపుల వంటి అవసరమైన వస్తుసామగ్రి, నిల్వలను కూడా ఆయన సమీక్షి ంచారు. భారీవర్షాలు కురిసిన పక్షంలో ప్రమాదానికి గురయ్యే వంతెనలు ట్యాంక్ బండ్‌ల వద్ద రేయింబవళ్లు పర్యవేక్షి ంచేందుకు గాను పెట్రోలింగ్ సిబ్బందిని నియమించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన తక్షణ చర్యలు చేపట్టేందుకు ఇరవైనాలుగు గంటలు రైలుమార్గాలను పహారాకాస్తూ, పర్యవేక్షి ంచాల్సిన అవసరం ఉందన్నారు. సైడ్ వాటర్ డ్రెయిన్లు, వాటర్‌వేలను శుభ్రపరచడంతోపాటు రైలుకమ్మీలపై వరదనీరు ప్రవహించకుండా, రైళ్లు సాఫీగా తిరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరికరాల సురక్షి తమైన పని విధానాలను, రైలు కార్యకలాపాలకు సంబంధించిన రిజిస్టర్ల సరైన నిర్వహణ, అవసరమైన అన్ని వర్షాకాల జాగ్రత్తలు చేపట్టాలని ఆయన అధికారులకు, సిబ్బందికి సూచించారు. పర్యవేక్షక సిబ్బంది జోన్ స్థాయి కార్యాచరణను నిరంతరం పర్యవేక్షి ంచాలని, ఏవైనా సమస్యలు ఉత్పన్నం అయిన పక్షంలో తక్షణమే హాజరు కావాలని, వీలైనంత త్వరగా పరిస్తితిని సరిదిద్దాలన్నారు. గ్రూప్ మీటింగ్‌లు, వ్యక్తిగత కౌన్సెలింగ్ సెషన్‌ల ద్వారా భద్రతా కేటగిరీ సిబ్బందికి క్రమం తప్పకుండా అవగాహన కల్పించాలని ఆయన

## వైభవంగా దసరా ఉత్సవాలు



పట్టువస్త్రాలు సమర్పిస్తున్న సిఎం చంద్రబాబు దంపతులు

- దుర్గమ్మ వారికి సిఎం పట్టువస్త్రాల సమర్పణ
- 1,44,000 మంది భక్తులకు దర్శనం
- విజయదశమిన దర్శన టిక్కెట్లు రద్దు
- అమ్మవారి సేవలో పలువురు వీఐపీలు



డికె శివకుమార్‌కు జ్ఞాపిక అందిస్తున్న దృశ్యం



మంత్రి కొలుసు పార్థసారధికి దుర్గమ్మవారి జ్ఞాపిక

**ఇంద్రకీలాద్రి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** అమ్మల గన్న అమ్మ బెజవాడ దుర్గమ్మ ఆలయంలో దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సతీసమేతంగా పట్టువస్త్రాలు తీసుకొచ్చి శ్రీ అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా పూర్ణకుంభ స్వాగతం పలికి మంత్రులు, అధికారులు ముఖ్యమంత్రి దంపతులను ఆలయంలోకి తీసుకెళ్ళారు. దుర్గమ్మవారికి ప్రత్యేక పూజాదికాలు నిర్వహించిన అనంతరం సిఎం దంపతులకు శ్రీ అమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

### శ్రీ సరస్వతి మాతగా దుర్గమ్మ

దసరా ఉత్సవాల్లో శ్రీ అమ్మవారి జన్మనక్షత్రం మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ సరస్వతి దేవిగా దర్శించుకునే భక్తులకు విజయవంతంగా సేవలందించి వారి మన్ననలందుకున్న అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. శ్రీ సరస్వతి మాతగా దుర్గమ్మవారు భక్తులను అనుగ్రహించారు. రాత్రి 8 గంటల వరకు ఒకలక్ష 44వేల మంది భక్తులు దుర్గమ్మను సోమవారం దర్శించుకున్నారు. కలెక్టర్ లక్ష్మీషా, విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు, కమీషనర్ రామచంద్రమోహన్, ఇఓ వికె శీనా నాయక్ ఏర్పాట్లు ఎప్పటికపుడు పరిశీలించారు. అమ్మవారి దర్శనానికి భక్తుల సంఖ్య అంతకంతకు పెరుగుతుండడంతో మూలానక్షత్రం రోజున సోమవారం నాడు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దుర్గమ్మవారి ఆలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆధ్యాత్మిక ఆనందంలో భక్తులను ఓలలాడించాయి. సాయంసంధ్యాకాలంలో శ్రీ గంగాభవాని సమేత మల్లేశ్వర స్వామివార్ల నగరోత్సవం వైభవంగా జరిగింది. నగర వీధుల్లో విహరిస్తూ శ్రీ స్వామి అమ్మవార్లు భక్తులను కటాక్షించారు. కమీషనర్ రామచంద్రమోహన్ పాల్గొన్నారు.

### దుర్గమ్మవారి సేవలో విఐపిలు

దుర్గమ్మవారిని సోమవారం శ్రీ సరస్వతిదేవి అవతారంలో కర్ణాటక ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్, ఏపి శాసనసభ డిప్యూటి స్పీకర్ కె రఘురామకృష్ణంరాజు, మంత్రులు కొలుసు పార్థసారధి, కొల్లు రవీంద్ర, ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, నక్కా ఆనందబాబు, తదితర ప్రముఖులు దర్శించుకున్నారు.

### విజయదశమిన దర్శన టికట్లు రద్దు

విజయ దశమిన దుర్గమ్మవారి దర్శనానికి టికెట్లు అన్నింటిని రద్దు చేస్తున్నట్లు మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు దుర్గమ్మవారిని ఈ దసరా ఉత్సవాల్లో సుమారు 8లక్షల మంది భక్తులు దర్శించుకున్నారని చెప్పారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.



మహాగౌరి అలంకారాల్లో అమ్మవారు




శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తుల కిటకిట

## దుర్గాష్టమి వేళ... అమ్మవారి ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** 'దుర్గాష్టమి. సోమవారం. సాధారణంగానే దుర్గాష్టమి రోజు ఆలయాలకు భక్తుల తాకిడి అధికంగా ఉంటుంది. సోమవారం దుర్గాష్టమి రావటంతో శ్రీకాళహస్తీశ్వరాలయంతో పాటు అనుబంధ ఆలయాలు శక్తి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు 'దుర్గమ్మ మాల ధరించి' కనబడ్డారు. ఎర్రటి చీరల్లో వారు దర్శనమిచ్చారు.

### కొండదిగిన జనం... కైలాసనాథుని దర్శనం

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధి సోమవారం భక్తజనంతో కిటకిట లాడింది. తిరుమలేశుని గరుడవాహన సేవలకు కదలి వచ్చిన జనం సోమవారం ఉదయం కైలాసనాధుని దివ్యదర్శనానికి పోటెత్తారు. సాధారణంగానే సోమవారం శ్రీకాళహస్తీశ్వరాలయం రద్దీగా ఉంటుంది. అలాంటిది ఆదివారం రాత్రి తిరుమలేశుని గరుడవాహన సేవ రావటంతో అక్కడ దర్శనం చేసుకున్న భక్తులు కదలి వచ్చారు. దాంతో సోమవారం ఉదయం భోళాశంకరుని సన్నిధి కిటకిట లాడింది. శివయ్యకు విశేష సంఖ్యలో అభిషేకాలు నిర్వహించారు.

### నిత్యకళ్యాణంకు విశేష స్పందన

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ప్రవేశిస్తే ఎనలేని మధురానుభూతి కల్గుతుంది. ఇక్కడి ఆలయ నిర్మాణామో స్వామి అమ్మవార్ల మహాత్మ్యమో కాని ఆలయంలోని కంచుగడప దాటితే ఇక బయటి ప్రపంచం గుర్తుకురాదు. ఆద్మాత్మిక చింతక కల్గుతుంది. ఇక ఆలయంలో ప్రవేశిస్తూనే ఎదురుగా చిన్మయముద్ర కల్గిన గురు దక్షిణామూర్తి దర్శనం లభిస్తుంది. ఇక ఎడమవైపును ఆకాశ గణపతి, ఆకాశ గంగ దర్శనం లభిస్తుంది. పక్కనే స్వామి అమ్మవార్ల విగ్రహాలను ఏర్పాటు చేసి నిత్యకళ్యాణం నిర్వహిస్తున్నారు. సోమవారం ఆలయంలోని స్వామి అమ్మవార్ల నిత్యకళ్యాణోత్సవానికి విశేష స్పందన వచ్చింది. గణపతి పూజలు, నవగ్రహ పూజలు, యజ్ఞోపవేత పూజలు, మాంగల్యధారణ కార్యక్రమూలు నిర్వహించారు. ఆలయాధికారులు అందించిన సమాచారం మేరకు సుమారు 25వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు సమాచారం.

### విశేష అలంకరణల్లో అమ్మవారు

శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయాల్లో వెలసిన దేవేరి ఆలయాల్లో వెలసిన మూల విరాట్టులకు నిర్వాహకులు వివిధ రూపాల అలంకారాలు నిర్వహించారు. ఆలయంలోని బొమ్మల కొలువులో దేవేరిజ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి మహాలక్ష్మీ దేవిగా, ముత్యాలమ్మ గుడిలో లలితా దేవి, కనక దుర్గమ్మను మహాలక్ష్మీదేవిగా తీర్చిదిద్దారు. కాగా మహాగౌరి దేవిగా ముస్తాబు చేసారు.

## మన్నెం కళావతికి ఘన సన్మానం

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం బోర్డు డైరెక్టర్‌గా నియమితులైన మన్నెం కళావతిని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య సత్కరించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి ఆలయ బోర్డు డైరెక్టర్‌గా మన్నెం కళావతి నియమితులవడం సంతోషదాయకమని సౌమ్య ప్రశంసించారు. దేవస్థానం అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తారని ఆశిస్తున్నా, ఆలయ సేవలు మరింత మెరుగుపరచడంలో ఆమె పాత్ర కీలకమవుతుందని పేర్కొన్నారు.



## కరకట్టలో సామూహిక సరస్వతీ పూజ

**కైకలూరు, సెప్టెంబరు 29 (ప్రభాతవార్త):** చదువుల తల్లి సరస్వతీదేవి తన చల్లని ఆశీస్సులను చిన్నారులందరికీ అందించాలని, అమ్మ దయతో చిన్నారులంతా మంచి విద్యాబుద్ధులు నేర్చుకుని జీవితంలో ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని పలువురు పెద్దలు ఆకాంక్షి ంచారు. కైకలూరు వైఎస్ఆర్ కాలనీ (కరకట్ట)లో విజయదుర్గ అమ్మవారి తృతీయ వార్షిక దేవీశరన్నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. దసరా ఉత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారు చదువులతల్లిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఉత్సవ పందిరిలో చిన్నారులతో సామూహిక సరస్వతి పూజ, కుంకుమార్చన నిర్వహించారు. అర్చకస్వామి యాజ్ఞకత్వంలో సుమారు 120మంది చిన్నారులు అమ్మవారికి కుంకుమార్చన చేశారు.

# ఆ పోస్టులు మాకొద్దు బాబోయ్!

## ఒకే నెలలో ఒకరు సస్పెన్షన్... మరొకరు బదిలీ



ఖాళీగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కుర్చీలు

- అనంత అర్బన్ కార్యాలయంలో రెండు సబ్ రిజిస్టర్ పోస్టులు ఖాళీ
- ఆ పోస్టుల్లోకి రావడానికి వెనకడుగు వేస్తున్న ఇతర సబ్ రిజిస్టర్లు
- అనంత ఆర్వోలోని ప్రస్తుత పరిస్థితిపై జిల్లా వ్యాప్తంగా చర్చ

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త:** ప్రతి ప్రభుత్వ ఉద్యోగి జిల్లా కేంద్రంలో పనిచేయడానికి ఇష్టపడతారు. కానీ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలోని సబ్ రిజిస్టర్లు మాత్రం జిల్లా కేంద్రంలో పనిచేయడానికి ఇష్టపడటం లేదు. ఇటీవల ఒక సబ్ రిజిస్టర్ సస్పెన్షన్ కావడం, మరొక సబ్ రిజిస్టర్ ఆకస్మికంగా తాడిపత్రి కి బదిలీ కావడం ఆ శాఖలో తీవ్ర చర్చ కొనసాగుతుంది. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలోని అనంతపురం అర్బన్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో జాయింట్ వన్ సబ్ రిజిస్టర్గా పనిచేస్తున్న రమణరావు ఇటీవల పలు తప్పులు చేయడంతో ఈనెల 3వ తేదీ సస్పెన్షన్ అయ్యారు. ఇది జరిగిన నాలుగు రోజులకే మరొక సబ్ రిజిస్టర్ యూనస్ను కూడా తాడిపత్రి సబ్ రిజిస్టర్ (ఎఫ్ఎసి)గా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే అప్పటి నుంచి ఆ సబ్ రిజిస్టర్పై పలు రకాలుగా పలు ఒత్తిళ్లు అధికం అవడంతో వాటిని ఆయన తట్టుకోలేక శనివారం రిలీవ్ అయ్యి సోమవారం తాడిపత్రిలో జాయిన్ అయ్యారు. దీంతో అక్కడే సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న ఇంద్ర శేఖర్కు ఇంచార్జ్ సబ్ రిజిస్టర్గా బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతము ఆర్వోలో రెండు సబ్ రిజిస్టర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టుల్లో పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లలో ఒకరు సస్పెన్షన్ అయ్యారు. మరొకరికి పలు ఒత్తిళ్లు రావడంతో బదిలీ అయ్యారు. ఇక్కడ పరిస్థితిని ఆ ఇద్దరు సబ్ రిజిస్టర్లు ఇతర సబ్ రిజిస్టర్లకు చెప్పడంతో ఆ పోస్టులు మాకొద్దు బాబోయ్ అంటున్నట్లు ఆ శాఖలోని సబ్ రిజిస్టర్లు, ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. రెగ్యులర్ సబ్ రిజిస్టర్లు వచ్చేవరకు అనంతపురం రూరల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్గా పనిచేస్తున్న ఇస్మాయిల్కు అదనపు బాధ్యతలు అప్పగించనున్నట్లు ఆ శాఖ ద్వారా అందిన సమాచారం. ఆయన కూడా గతంలో సబ్ రిజిస్టర్ (ఎఫ్ఎసి)గా పనిచేశారు. అప్పుడు కూడా ఆయన పలు ఒత్తిళ్ల వలన అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన జాయిన్ అవుతారా? లేదా? అన్నది తెలియాల్సి ఉంది.

**రూరల్లో కూడా అదే పరిస్థితి**

అనంతపురం రూరల్ సబ్ రిజిస్టర్ కార్యాలయంలో గత కొన్ని నెలలుగా రెగ్యులర్ సబ్ రిజిస్టర్ లేరు. ప్రస్తుతము అక్కడే సీనియర్ అసిస్టెంట్గా పని చేస్తున్న టీజీ రెడ్డి ఇన్చార్జ్ సబ్ రిజిస్టర్గా కొనసాగుతున్నారు. ఆ పోస్టులోకి రావడానికి కూడా పలువురు సబ్ రిజిస్టర్లు వెనకడుగు వేస్తున్నట్లు తెలిసింది. గతంలో అక్కడ పనిచేస్తున్న సబ్ రిజిస్టర్లకు పలు రకాలుగా ఒత్తిళ్లు రావడంతోనే అందుకు భయపడి రావడంలేదని ఆ శాఖలో తీవ్ర చర్చ కొనసాగుతుంది. రెగ్యులర్ సబ్ రిజిస్టర్ వచ్చేంతవరకు ప్రస్తుతం పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ ఇన్ఛార్జ్ సబ్ రిజిస్టర్గా కొనసాగనున్నారు. అయితే ఆయన మీద కూడా పలు ఒత్తిళ్లు వస్తుండడంతో చేసేది లేక అలాగే భరిస్తున్నారని అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ఇలా పలు ఒత్తిళ్లతో ఇబ్బందులకు గురవుతున్న సబ్ రిజిస్టర్లు, సీనియర్ అసిస్టెంట్లకు అండగా ఉండాల్సిన ఉన్నతాధికారులు, ఉద్యోగుల సంఘం నాయకులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చెందుతున్నారు.

## ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి

# రూ.2,745.05 కోట్లు విడుదల



- పెన్షన్ లబ్ధిదారులు 63,50,765మంది
- కొత్తగా 10,578మందికి స్పౌజ్ పెన్షన్లు
- స్పౌజ్ పెన్షన్ల కోసం అదనంగా రూ.4.23 కోట్లు విడుదల
- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ వెల్లడి

**విజయవాడ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఎన్టీర్ భరోసా పెన్షన్ పథకం కింద అక్టోబర్ ఒకటవ తేదీన 63,50,765 మంది లబ్ధిదారులకు పెన్షన్ మొత్తాన్ని పంపిణీ చేసేందుకు రూ. 2,745.05 కోట్లు గ్రామ, వార్డు సచివాలయాలకు విడుదల చేసిందని రాష్ట్ర సూక్ష్మ చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొత్తగా మంజూరైన 10,578 మంది స్పౌజ్ పెన్షన్ లబ్దిదారులకు అక్టోబర్ 1న పెన్షన్ పంపిణీ చేయడానికి రూ.4.23 కోట్లు కూడా విడుదల చేశామని మంత్రి చెప్పారు. బుధవారం జరిగే పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం దత్తి గ్రామంలో ముఖ్యమంత్రి సామాజిక పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి తెలియజేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మొదటిసారిగా విజయనగరం జిల్లాలో తాను ప్రాతినిధ్యం వహిస్తున్న గజపతినగరం నియోజకవర్గంలో పేదల దినోత్సవ కార్యక్రమంలో భాగంగా పెన్షన్ పంపిణీ కార్యక్రమానికి ముఖ్యమంత్రి పాల్గొనడం ఆనందించదగ్గ విషయమన్నారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ పాలన ప్రారంభమైన తర్వాత పెన్షన్ల ద్వారా 45 వేల కోట్ల రూపాయలు లబ్ధిదారులకు అందించామని మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి పింఛన్ల కోసం రూ.32,143 కోట్లు బడ్జెట్ కేటాయించగా, ఇందులో ఏప్రిల్ నుంచి అక్టోబర్ 2025 వరకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీకి రూ.19,111.85 కోట్లు విడుదలయ్యాయని తెలిపారు. దేశంలో మరే రాష్ట్ర ప్రభుత్వం కూడా పెన్షన్ కోసం ఏడాదిలో రూ.10,000 కోట్లకు మించి కేటాయించడం లేదని తెలియజేశారు.

పెన్షన్ పంపిణీ ప్రక్రియ మరింత పారదర్శకంగా ఉండేలా, లబ్ధిదారుల ఇంటి వద్దే పెన్షన్ అందించడం తోపాటు వారి జియోకోఆర్డినేట్స్ ను కూడా నమోదు చేస్తున్నా మని మంత్రి శ్రీనివాస్ అన్నారు. ముఖ్యమంత్రి నాయకత్వంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కట్టుబడి ఉందని, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వికలాంగులు వంటి నిరుపేద, నిస్సహాయ వర్గాల కష్టాలను తొలగించడానికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పథకాన్ని ఒక ముఖ్యమైన సంక్షేమ పథకంగా అమలు చేస్తోందని అన్నారు. దేశంలో సామాజిక భద్రతా పెన్షన్ కోసం అత్యధిక మొత్తాన్ని ఖర్చు చేస్తున్నది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమేనని మంత్రి శ్రీనివాస్ తెలియజేశారు.

## తిరువూరు మున్సిపల్ కౌన్సిల్

# సమావేశం రసాభాస

**విజయవాడ, సెప్టెంబరు 29, ప్రభాతవార్త ప్రతినిధి:** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో గందరగోళం నెలకొంది. అధికార, ప్రతిపక్ష సభ్యుల వాగ్వివాదంతో తిరువూరు నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశం దద్దరిల్లింది. వైసీపీ సభ్యులు ఛైర్ పర్సన్ పోడియాన్ని చుట్టిముట్టి సభను అడ్డుకున్నారు. అజెండాలో పొందుపర్చిన అంశాలపై చర్చ జరగకుండా వైసీపీ సభ్యులు వ్యక్తిగత అంశాలను సభలో లేవనెత్తారు. ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు వరసగా మూడు కౌన్సిల్ సమావేశాలకు డుమ్మా కొట్టారు. దీంతో ఛైర్ పర్సన్ వారిపై అనర్హత వేటు వేశారు. ఈ క్రమంలో మానవతా దృక్పథంతో తమ ఇద్దరు కౌన్సిలర్ల సభ్యత్వాన్ని పునరుద్ధరించాలంటూ వైసీపీ సభ్యులు చేసిన విజ్ఞప్తిని ఛైర్ పర్సన్ తిరస్కరించారు. వైసీపీ సభ్యుల సభ్యత్వాన్ని ఆమోదించటం లేదని ఛైర్ పర్సన్ చెప్పటంతో సమావేశంలో ఓటింగ్కు వైసీపీ సభ్యులు పట్టుబట్టారు. ఓటింగ్లో 10 మంది టీడీపీ సభ్యులు వారి సభ్యత్వం పునరుద్ధరణకు వ్యతిరేకంగా ఓటు వేయగా 9 మంది వైసీపీ సభ్యులు అనుకూలంగా ఓటు వేయటంతో మరోసారి వైసీపీ సభ్యులు.. ఛైర్ పర్సన్ పోడియాన్ని చుట్టుముట్టి సభను అడ్డుకున్నారు. ఇద్దరు వైసీపీ సభ్యుల అనర్హత వేటుపై ఓటింగ్ను మినిట్స్లో రికార్డు చేసి సభ్యులు సంతకాలతో మున్సిపల్ ఉన్నతాధికారుల అనుమతి కోసం డీఎంఏకు అధికారులు నివేదించారు. రానున్న సమావేశాలకు ఇద్దరు వైసీపీ కౌన్సిలర్లు తమ పదవి కోల్పోయే అవకాశం ఉంది.

## విజయవాడ ఉత్సవం...

# ఆద్యంతం ఆహ్లాదం

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ ఉత్సవ్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ వాతావరణాన్ని సృష్టించాయి. రంగుల హరివిలాసంగా సాగిన ఈ వేడుకలు సందర్శకులను అలరించాయి. శాస్త్రీయ నృత్యాలు, సంగీత కచేరీలు, జానపద కళలు, నాటిక ప్రదర్శనలు వరుసగా సాగి ప్రేక్షకులను కట్టిపడేశాయి. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నాటికలు ప్రేక్షకుల కరతాళ ధ్వనులతో మారుమోగాయి. వేదికపై నృత్యాలు, సంగీతం, నాటకాలతో సందడి నెలకొంది. విజయవాడ ఉత్సవ్లో భాగంగా సొసైటీ ఫర్ వైబ్రెంట్ విజయవాడ ఆధ్వర్యంలో గొల్లపూడి జక్కంపూడి రోడ్డులో ఏర్పాటు చేసిన విజయవాడ ఎగ్జిబిషన్ సాయంత్రం సంగీత వాతావరణంతో సందడిగా మారింది. ప్రసిద్ధ సింగర్, మ్యూజిక్ డైరెక్టర్ రామ్ మిరియాల తన బృందంతో కలిసి ఇచ్చిన లైవ్ మ్యూజిక్ కచేరీ ప్రేక్షకులను అలరించింది. హిట్ సాంగ్స్ తో పాటు ఉత్సాహభరితమైన బీట్స్ తో ప్రేక్షకులను అలరించిన రామ్ మిరియాల గాత్రం ఎగ్జిబిషన్ వేదికను కాసేపు సంగీతమయం చేసింది. వేలాది మంది సందర్శకులు ఈ కచేరీని ఆస్వాదిస్తూ కరతాళధ్వనులతో ప్రోత్సహించారు. కుటుంబ సభ్యులతో తరలివచ్చిన సందర్శకులు ఆదివారం ఎగ్జిబిషన్ వేదికను పండుగ వాతావరణంగా మార్చారు. గొల్లపూడి ఎగ్జిబిషన్లో ఆదివారం రాత్రి జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలను ఎంపి కేశినేని శివనాథ్, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభి, సుంకర అనిల్, తదితరులు ఆసక్తిగా తిలకించారు.

## వడ్డీ వ్యాపారుల నుండి

# రైతులకు విముక్తి

### మనీ లెండింగ్ యాక్ట్ తెచ్చిన సర్కార్

**హైదరాబాద్, సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** తెలంగాణలో వడ్డీ వ్యాపారుల వేధింపుల నుంచి రైతులను రక్షించేందుకు రాష్ట్ర సర్కార్ మనీ లెండింగ్యాక్ట్ తీసుకొచ్చింది. రాష్ట్రంలో ఈ యాక్టు 1349ను కఠినంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేసింది. పంట పెట్టుబడుల కోసం తప్పని సరి పరిస్థితుల్లో అన్నదాతతలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీలకు రుణాలు తీసుకుంటారని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. వడ్డీ వ్యాపారులు వేస్తున్న అధిక వడ్డీభారంతో రైతుల అప్పులు పెరిగిపోతున్నాయని, దీంతో అసలు, వడ్డీ కలిపి చెల్లించలేక రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని గతంలో రాష్ట్ర రైతు కమిషన్ ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. దీంతో వాటిని తీర్చలేని అప్పుల ఊబిలో కూరుకుపోతున్న రైతులు గత్యంతరం లేని పరిస్థితుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నట్లు తెలిపింది. రైతు కమిషన్ నివేదికలోని పలు అంశాలను పరిగణనలోనికి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మనీలెండింగ్ యాక్ట్ అమలు కఠినంగా చేయాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలిచ్చింది.

# డైనమిక్ ఫ్లడ్ మేనేజ్మెంట్తో నీటి వనరుల సంపూర్ణ వినియోగం



- వరద నీటిని ఒడిసి పట్టుకోవాలి
- ప్రతి రిజర్వాయర్, చెరువు నింపాలి
- కృష్ణా, గోదావరి నదుల వరద ఉధృతి
- ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలి
- ప్రకాశం బ్యారేజ్కు 7 లక్షల క్యూసెక్కుల వరద వచ్చే చాన్స్
- రిజర్వాయర్లులో నీటి నిల్వలపై అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** డైనమిక్ ఫ్లడ్ మేనేజ్మెంట్తో నీటి వనరుల సంపూర్ణ వినియోగం జరగాలని సిఎం చంద్రబాబు సూచించారు, వరద నీటిని ఒడిసి పట్టుకుని తాగు, సాగునీటి అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరద ప్రవాహాలను రియల్ టైంలో అంచనా వేస్తూ... అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో నదీ ప్రవాహాలు, రిజర్వాయర్లలో నీటి నిల్వలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రెయిన్ గేజెస్ ద్వారా కురిన వర్షాన్ని లెక్కించి ఫ్లడ్ మేనేజ్మెంట్ జరపాలన్నారు. వర్షపాతం, ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చే నీటి ప్రవాహాల సమాచారాన్ని విశ్లేషించి సమన్వయంతో అన్ని రిజర్వాయర్లను పూర్తిగా నింపాలని సిఎం సూచించారు. అదే విధంగా సాధ్యమైనన్ని ఎక్కువ చెరువులను నీటితో నింపాలని సూచించారు. కృష్ణా నదిలో ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతం 6.57 లక్షల క్యూసెక్కుల వరద ఉందని అధికారులు తెలిపారు. వచ్చిన నీటిని వచ్చినట్లు సముద్రంలోకి పంపుతున్నట్లు వివరించారు. రేపు 7 లక్షల క్యూసెక్కులకు పైగా వరద రావొచ్చని అంచనా వేస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం నుంచి వస్తున్న వరదతో పాటు తెలంగాణ రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వరద వస్తుందని తెలిపారు. అలాగే అటు గోదావరిలో ధవళేశ్వరం వద్ద ప్రస్తుతం 10.12 లక్షల క్యూసెక్కుల వరద ఉందని, ఈ వరద ప్రవాహం పెరిగి 11.50 లక్షల క్యూసెక్కుల వరకు రావచ్చని అధికారులు తెలిపారు. కృష్ణా, గోదావరి నదులకు వస్తున్న భారీ వరద కారణంగా వేల టిఎంసిల నీరు సముద్రంలో కలుస్తోంది. రాష్ట్రంలో అన్ని రిజర్వాయర్లలో కలిపి ప్రస్తుతం 94 శాతం నీటి నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. పైనుంచి ఇంకా వరద వస్తున్న కారణంగా నీటిని సముద్రంలోకి విడుదల చేస్తున్నట్లు తెలిపారు. కృష్ణానది నుంచి సముద్రంలో ఇప్పటి వరకు 1089 టిఎంసిలు వెళ్లాయని అధికారులు వివరించారు. గోదావరి నుంచి 3251 టిఎంసిలు సముద్రంలోకి వెళ్లాయని అధికారులు అన్నారు. సమర్థ నీటి నిర్వహణ, కాలువల్లో ప్రవాహాలు, చెరువులు నింపే కార్యక్రమం వల్ల భూ గర్భ జలాలు పెరిగినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. గత ఏడాది కంటే ఈ ఏడాది భూగర్భ నీటి మట్టం పెరిగినట్లు వివరించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరి భూగర్భ నీటి మట్టం 8.43 మీటర్లు ఉందని తెలిపారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది 1.25 మీటర్ల భూగర్భ జలాలు పెరిగినట్లు తెలిపారు. ముఖ్యంగా రాయలసీమలో గత ఏడాది కంటే 2.07 మీటర్లు భూగర్భ జలాలు పైకి వచ్చినట్లు అధికారులు వివరించారు. కృష్ణా, గోదావరి నదుల వరద ప్రవాహం గమనించినప్పుడు నిలకడగా కృష్ణా వరద ఉందని అధికారులు సీఎంకు వివరించారు. ఇప్పటికి ప్రకాశం బ్యారేజ్ వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 6,86,074 క్యూసెక్కులు ఉందని సీఎంకు వివరించారు. దీంతో రెండవ ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్నట్లు తెలిపారు.

గోదావరి వరదను భద్రాచలం వద్ద ప్రస్తుతం 44.4 అడుగుల నీటిమట్టం ఉందని తెలిపారు. ధవళేశ్వరం వద్ద ఇన్ ఔట్ ఫ్లో 9,80,447 లక్షల క్యూసెక్కులు ఉందన్నారు. ఇక్కడ మొదటి ప్రమాద హెచ్చరిక ఉపసంహరణ జరిగినట్లు తెలిపారు. సహాయక చర్యలకు 2 ఎన్డిఆర్ఎఫ్, 3 ఎస్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉంచామన్నారు. ఈ క్రమంలో కృష్ణా, గోదావరి నదిపరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇంకా వరదలు, వర్షాలు ఉన్న కారణంగా... నీటి సమర్థ వినియోగానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సిఎం సూచించారు. చెరువులు నింపడంతో పాటు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన అన్ని ప్రణాళికలు అమలు చేయాలని ఆదేశించారు. మరోవైపు వరదల కారణంగా ముంపు ఉండే ప్రాంతాల ప్రజలను ఎప్పటికప్పుడు సమాచారంతో అప్రమత్తం చేయాలని సూచించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో ప్రజలకు అవసరమైన సహాయం అందించాలని సూచించారు. ఆన్లైన్ విధానంలో జరిగిన ఈ సమీక్షలో ఇరిగేషన్ శాఖ అధికారులు, ఆర్టీజీఎస్ అధికారులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# ఎక్సైజ్లో మైక్రో బ్రూవరీ

- మంత్రివర్గ ఉపసంఘం భేటీలో చర్చ
- డిజిటల్ పేమెంట్లకు ప్రోత్సాహం
- ప్రీమియం స్టోర్స్ ఏర్పాటుపై సమాలోచన




**విజయవాడ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త ప్రతినిధి:** వివిధ ఎక్సైజ్ అంశాలపై సోమవారం మంగళగిరి ఎక్సైజ్ కమిషనర్ కార్యాలయంలో మంత్రివర్గ ఉపసంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఖనిజ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అధ్యక్షత వహించారు. ఆహార, పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ హాజరయ్యారు. ఎంఎస్ఎంఈ, ఎస్ఈఆర్పీ, ఎన్ఆర్ఐ వ్యవహారాల మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. సమావేశంలో బార్ ఏఆర్ఈటీ సమస్యపై చర్చ జరిగింది. మైక్రో బ్రూవరీ విధానం, డిజిటల్ పేమెంట్ల ప్రోత్సాహం, ప్రీమియం స్టోర్స్ ఏర్పాటు అంశాలు కూడా పరిశీలించారు. ప్రభుత్వం ఎక్సైజ్ రంగంలో పారదర్శకత, ఆధునికత, బాధ్యతాయుత వినియోగం కోసం ముందడుగు వేస్తోందని ఈ చర్చలు సూచించాయి. నియంత్రణతో పాటు వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్త విధానాలు రూపొందించాలని మంత్రులు అభిప్రాయపడ్డారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి (ఎక్సైజ్, మైన్స్, సాధారణ పరిపాలన శాఖ -పొలిటికల్) ముఖేష్ కుమార్ మీనా, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్ చామకూరి, ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ రాహుల్దేవ్ శర్మ పాల్గొన్నారు. అధికారులు సంబంధిత నివేదికలు సమర్పించి, అమలు విధానాలపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో వివరించారు.

# 12న విజయవాడలో ఒబిసిల సదస్సు

### చట్టసభల్లో రిజర్వేషన్లు సాధిస్తాం: ఎంపి ఆర్.కృష్ణయ్య ధీమా



**హైదరాబాద్(సైఫాబాద్), సెప్టెంబరు 29, ప్రభాతవార్త:** దేశ జనాభాలో సగానికిపైగా ఉన్న బిసిలకు అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో 50 శాతం రిజర్వే షన్లు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ అక్టోబరు 12న విజయవాడలో ఒబిసిల జాతీయస్థాయి సదస్సు నిర్వహిస్తున్నామని రా జ్యసభ సభ్యుడు, జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలి పారు. ఈ మేరకు సోమ వారం బషీర్బాగ్ ప్రెస్క్లబ్లో దక్షిణ భారత బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు జబ్బాల శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సదస్సుకు సంబం ధించిన వాల్పోస్టర్ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ సదస్సులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, కేరళకు చెందిన వేలాది మంది ఒబిసిలు పాల్గొంటారని చెప్పారు. ముఖ్య అతిథులుగా నలుగురు కేంద్ర మంత్రులు, మేధావులు, ప్రొఫెసర్లు, 20 మంది వివిధ పార్టీలకు చెందిన ఎంపిలు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సు తరువాత హైదరాబాద్, బెంగళూరు, తమిళనాడు, ఢిల్లీలోనూ ఒబిసిల జాతీయ సదస్సులు నిర్వహించి ఒబిసిల సత్తా తెలియజేస్తామన్నారు. కుల గణన తరువాత అన్ని రంగాల్లో ముఖ్యంగా ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్యా, ఉద్యోగరంగాల్లో జనాభా ప్రాతిపదిక వాటా లభిస్తుందని, అన్ని కోణా ల్లో కులగణన తర్వాత సమాజంలో విప్లవాత్మక మార్పు వస్తుందన్నారు.



# లింగాలలో ఉచిత వైద్య శిబిరం

**మండవల్లి, సెప్టెంబర్ 29 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని లింగాల గ్రామం సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసర్పంచ్ బోయిడి ధానలక్ష్మి శ్రీ సురేష్ బాబు ఆధ్వర్యంలో సోమవారం ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. సేవ పక్షోత్సవాలు కార్యక్రమంలో భాగంగా కూటమి నేత చాపరాల దుర్గాప్రసాద్ రక్తదాన శిబిరం ప్రారంభించారు. అనంతరం యువకులు 20 మంది రక్తదానం చేసారు. గ్రామంలోని ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 2 వరకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ వైద్య ఆరోగ్య శాఖల ద్వారా రెండు వారాల పాటు సేవ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అందరూ ఆరోగ్యంగా ఉండాలని ఉద్దేశంతో ప్రధాని నరేంద్ర మోడీ దేశవ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్సి డాక్టర్ ఎన్ పవిత్ర, జిల్లా వైస్ ప్రెసిడెంట్ సమయం ఏసుబాబు, కాశగాని కొండ, కాశగాని వెంకటేశ్వరావు, అనిశెట్టి రామకృష్ణ, బి.వెంకటశాస్త్రులు, ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పశ్చిమగోదావరి జిల్లా పోలీసులపై

# హైకోర్టు మండిపాటు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** సున్నిత అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై నమోదైన కేసులపై శ్రద్ధపెట్టరా?, కనీస విచారణపైనా చేయరా! అంటూ పశ్చిమ గోదావరి జిల్లా పోలీసులపై ఏపీ హైకోర్టు మండిపడింది. పెళ్లి జరిగాక అత్తింట భర్త, అత్తమామల వేధింపులను భరించలేక కూతురు పుట్టింటికి చేరింది. కొద్ది రోజుల తర్వాత మళ్లీ అత్తింటికి వెళ్లిన తర్వాత కనబడకుండా పోయింది. తమ అల్లుడు, అతని తల్లిదండ్రులే కారణమంటూ ఫిర్యాదు చేస్తే పోలీసులు 13 ఏళ్లుగా కేసు కట్టకుండా కాలయాపన చేస్తున్నారని కలెక్టర్ వద్ద గోడు చెప్పుకున్నారు. సాక్షాత్తు ఎస్పికి ఫిర్యాదు చేశారు. న్యాయ సేవాధికార సంస్థ తలుపు తట్టారు. ఆ తర్వాత మానవ హక్కుల కమిషన్కు వెళ్లారు. ఫలితం లేకపోవడంతో అలిసిపోయిన తండ్రి హైకోర్టు మెట్లు ఎక్కారు. 2017 నుంచి హైకోర్టులో చేస్తున్న పోరాటంలో ఆ తర్వాత ఏడాది ఎస్పి కౌంటర్ వేశారు. పిటిషన్ తాజాగా విచారణకు రావడంతో పోలీసుల తీరుపై హైకోర్టు ఆగ్రహించింది. ఈ కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించడం సబబుగా ఉంటుందని, ఇందుకు తగిన ప్రాథమిక ఆధారాలు కూడా ఉన్నాయని జస్టిస్ బి దేవానంద్ అభిప్రాయపడ్డారు. పశ్చిమగోదావరి జిల్లా, జీలుగుమిల్లి మండలం, కామయ్యపాలెం గ్రామానికి చెందిన చిన్న రైతు బండారు ప్రకాశరావు తన కూతురు మంగాదేవిని మోహన బ్రహ్మాజీకి ఇచ్చి కొన్నేళ్ల క్రితం పెళ్లి చేశారు. కట్నకానుకల కోసం భర్త, అత్తమామలు వేధిస్తున్నారని చెప్పి మంగాదేవి 2012లో పుట్టింటికి వచ్చేసింది. తల్లిదండ్రులు కానుకలను కూడా సర్దుబాటు చేసి అత్తింటికి పంపారు. 2012 అక్టోబరు 18న అల్లుడు బ్రహ్మాజీ ఫోన్ చేసి తన భార్య ఎక్కడికో వెళ్లిపోయిందని, కనబడటం లేదని చెప్పాడు. దీనిపై ప్రకాశరావు ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసుగా రిజిస్టర్ చేశారు. అల్లుడు, వారి తల్లిదండ్రులపై అనుమానంతో చేసిన ఫిర్యాదులో 13 ఏళ్లుగా ఎలాంటి పురోగతి లేకపోవడంపై హైకోర్టు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేసింది. కేసు దర్యాప్తు పురోగతిని వివరించాలని ఎస్పిని ఆదేశించింది. విచారణను అక్టోబరు 19కి వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

## సజ్జల శ్రీధర్రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్రెడ్డి

# బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వు

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** లిక్కర్ కేసులో విజయవాడ ఏసీబీ కోర్టులో నిందితులు సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి బెయిల్ పిటిషన్పై వాదనలు ముగిసాయి. అనంతరం ఈ బెయిల్ మంజూరు అంశంలో తీర్పు రిజర్వు చేసినట్లు ఏసీబీ కోర్టు ప్రకటించింది. సజ్జల శ్రీధర్ రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఏపీలో భారీ స్కామ్గా ప్రచారంలో ఉన్న మద్యం కుంభకోణంలో కీలక నిందితులుగా ఉన్నారు. వీరు తమకు బెయిల్ ఇవ్వాలను కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు కొట్టివేసింది. ఈ క్రమంలో మరోసారి బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించగా విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పు రిజర్వు చేసింది.

# విధి నిర్వహణలో ఎస్ఐ మృతి

**విజయవాడ, సెప్టెంబరు 29 ప్రభాతవార్త ప్రతినిధి:** విధి నిర్వహణలో విజయనగరం జిల్లా పూసపాటిరేగా పోలీస్ స్టేషన్ ఎస్ఐ శ్రీనివాసరావు గుండెపోటుతో మృతి చెందారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఇంద్రకీలాద్రి ప్రత్యేక విధులకు హాజరైన ఎస్ఐ శ్రీనివాసరావు గుండెపోటుతో బాత్రూంలో పడి మృతి చెందారు. అది గమనించి సహచర పోలీసులు ఆయనను హుటాహుటిన ఆస్పత్రికి తరలించినప్పటికి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపినట్లు సమాచారం, ఎస్ఐ శ్రీనివాసరావు మృతదేహాన్ని విజయనగరంకు పంపడానికి పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd, at Plot Nos. 56&58, 9th line, Ramnagar, Ongole - 523001, ph: 2312451, Fax: 08592-236879, RNI No, 64847/96, Editor.Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act, Regd. No.H/SD/337/12-14 Air Surcharge:Delhi:40 Ps